నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం మన పత్రిక

NAMASTE TELANGANA

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline

శుక్రవారం FRIDAY 27.9.2024 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4 Pages: 12+4 | సంపుటి (Volume): 14 ‖ సంచిక (Issue): 113 ‖ వెల (Price) రూ.6.50

దశమి

శుక్రవారం, సూర్యోదయం: 6-06, సూర్యాస్తమయం: 6-08. శ్రీ క్రోధి నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం కృష్ణ పక్షం తిథి: దశమి పగలు 1-26 వరకు. నక్షత్రం: పుష్యమి రాత్రి 1-20 వరకు. వర్జ్యం: ఉదయం 8-10 నుంచి ఉదయం 9-54 వరకు. రాహుకాలం: ఉదయం 10-36 నుంచి ఉదయం 12-06 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 8-30 నుంచి పగలు 9-18 వరకు, పునర్ దుర్ముహూర్తం: పగలు 12-30 నుంచి పగలు 1-18 వరకు. అమృతకాలం: సాయంత్రం 6-28 నుంచి రాత్రి 8-11 వరకు.

జిల్లాల్లోనూ కూల్చివేత.. మూసీలో ఎర్రగీత





సూర్యాపేట జిల్లా కేంద్రంలోని పలు కాలనీల్లో ఇండ్ల కూల్చివేతకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం నెహ్రూనగర్‌లో సర్వే కోసం వెళ్లిన అధికారులను స్థానికులు అడ్డుకుని, వెనక్కి పంపారు. 'ఇండ్ల సర్వే అంటూ వస్తే కండ్లల్లో కారం కొడుతం' అని హెచ్చరించడంతోపాటు ప్రభుత్వంపై దుమ్మెత్తి పోస్తున్న మహిళలు

- మూసీ తీరంపైకి బుల్డోజర్ దౌడు తీయిస్తున్న సర్కార్
- పాలమూరు తరహాలో మరిన్ని జిల్లాల్లో కూల్చివేతలు
- ఎందరి ఉసురుపోస్కుంటే కాంగ్రెస్ కండ్లు సల్లబడ్తయ్
- ఆగ్రహంతో రగిలిన జనం.. ప్రభుత్వంపై శాపనార్థాలు



మూసీ రివర్‌బెడ్ కింద కూల్చివేతల కోసం పురానాపూల్‌లోని ఇండ్లకు ఎరుపురంగుతో మార్కింగ్ చేస్తున్న హైడ్రా, రెవెన్యూ సిబ్బంది

› 2

ఉన్న ఇంటినీ ఊడగొట్టే సర్కార్

ఒక్కో రూపాయి జమ చేస్కొని ఆ పైసల్తో కట్టుకున్న ఇండ్లు కూలగొడ్తే ఎట్ల బతకాలె. అసలు ఇండ్లు కూలగొట్టాల్సిన పనేంది. అన్నీ సక్కంగ ఉన్నయంటేనే ఇల్లు కట్టుకున్నం. ఇప్పుడొచ్చి ఎఫ్‌టీఎల్ అంటే ఎట్ల. అయినా గీ గవర్నమెంట్ మాకు చేసిందేం లేదు.. ఉన్నది ఊడగొట్టుడు తప్ప. ఆఖరికి ఉన్న మకాన్ కూడా కూల్చేయవడ్తిరి. ఫస్టు వచ్చి మూడింతలు ఇస్తమన్నరు. ఇప్పుడేమో డబుల్ బెడ్రూం అంటున్నరు. మూడు నాలుగు కుటుంబాలు కలిసి ఉన్నోళ్లం ఇప్పుడు ఒక ఇల్లు ఇస్తే ఎట్ల ఉంటం. ఆఖరికి ఏదీ ఇయ్యరు. ఇదంతా మమ్మల్ని మాయ చేసి ఇక్కడ్నుంచి వెళ్లగొట్టాలని చేస్తున్నరు. అయినా మా ఇల్లు మాగ్గావాలె. రేవంత్‌రెడ్డీ.. మా ఇల్లు జోలికి రావద్దు. మాకేమైనా అయితే నీదే బాధ్యత.

- ముస్లిం మహిళలు (కేసీఆర్ నగర్ - రామంతపూర్)

బ్రదర్స్ కోసమే ఫోర్త్ సిటీ.. వేల కోట్ల కుంభకోణం!


ఫార్మా సిటీ ఉందా.. లేదా?

- సీఎం అన్నదమ్ములకు దోచిపెట్టే కుట్ర
- భూదందా కోసమే రకరకాల సిటీల పేర్లు
- ఎకరం సేకరించకుండా ఫోర్త్‌సిటీ కడ్తరా?
- ఫార్మాసిటీ 14 వేల ఎకరాల్లో ఉండాలి
- లేదంటే ఆ భూములు రైతులకిచ్చేయాలి
- అందులో రియల్ దందా చేస్తే ఊరుకోం
- కోర్టులను తప్పుదోవ పట్టిస్తే సహించం
- కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ హెచ్చరిక



సిరిసిల్ల జిల్లా కొదురుపాకలో పాఠశాలను ప్రారంభించి చిన్నారులకు స్కూల్ బ్యాగులను అందజేస్తున్న కేటీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఫార్మాసిటీపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని, అది ఉంటుందో, లేదో చెప్పాలని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఫార్మాసిటీపై హైకోర్టుకు వాస్తవ పరిస్థితులను తెలియజేయాలని కోరారు. అలా చేయకుంటే అది ముమ్మాటికీ చీటింగ్ కిందికి వస్తుందని, ఇలాంటి నేరానికి పాల్పడుతున్న రాష్ట్ర సర్కారుకు తగిన గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కేవలం తన సోదరులకు, అనయాయులకు వేల కోట్ల రూపాయల లబ్ధి చేకూర్చే కుంభకోణంలో భాగంగానే రేవంత్‌రెడ్డి ఇదంతా చేస్తున్నారని ఆరోపించారు. ఫార్మాసిటీ › 5వ పేజీలో



ట్రిపుల్ ఆర్ మార్పులపై న్యాయ పోరాటం

› 5

- హైకోర్టును ఆశ్రయించిన వర్కట్‌పల్లి భూబాధితులు
- ఉన్న పొలాలు గుంజుకుంటే మేం బతికేదెట్లా?
- మొదటి అలైన్‌మెంట్‌నే అమలు చేయాలి: రైతులు




ట్రిపుల్ ఆర్ భూ నిర్వాసితుల ఆందోళన

చౌటుప్పల్ జంక్షన్ అలైన్‌మెంట్ మార్చాలని ధర్నా › 5

క్వీన్ సిటీస్ స్కామ్..

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్?

సేమ్ టు సేమ్



- బెంగళూరు, హైదరాబాద్‌లో ముగ్గు పోస్తున్న కాంగ్రెస్
- కొత్త నగరాలకు రెండు ప్రభుత్వాల ఒకే బ్లూప్రింట్

ప్రత్యేక కథనం-9

- 5,800 ఎకరాల్లో క్విన్ సిటీ నిర్మాణానికి కర్ణాటక సర్కార్ రెడీ
- అదేబాటలో రేవంత్ సర్కార్.. ఫోర్త్ సిటీ పేరిట ఇప్పటికే హడావుడి
- కర్ణాటకలో హెల్త్‌సిటీ రద్దు .. తెలంగాణలో ఫార్మాసిటీకి ఎసరు!
- అక్కడ శాటిలైట్ ఆర్‌ఆర్ రూట్ మార్పు.. ఇక్కడ ట్రిపుల్ ఆర్‌దీ అదే!
- ఒకరినొకరు కాపీ కొట్టారా? లేక రెండు నగరాలకూ ఒకే డిజైనరా?
- న్యూ సిటీ మాటున భూదందా.. కాంగ్రెస్ నాయకులపై విమర్శలు

రెండు వేర్వేరు రాష్ట్రాల్లో రెండు కొత్త నగరాల నిర్మాణం జరుగుతున్నదంటే ఒకటో, రెండో పోలికలు కనిపిస్తాయి. అయితే బెంగళూరులోని 'క్విన్' సిటీ, హైదరాబాద్‌లోని 'ఫోర్త్' సిటీ నిర్మాణంలో దాదాపు అన్ని విషయాలూ అచ్చుగుద్దినట్టు సరిపోతున్నాయి. ప్రాంతం, ప్రధాన నగరానికి దూరం, కనెక్టివిటీ, మౌలిక వసతులు.. అన్నీ సేమ్ టు సేమ్!!

› 5

	క్విన్ సిటీ (కర్ణాటక)	ఫోర్త్ సిటీ (తెలంగాణ)
దిశ	బెంగళూరుకు ఉత్తరం	హైదరాబాద్‌కు దక్షిణం
కోర్ సిటీ నుంచి దూరం	56 కిలోమీటర్లు	57 కిలోమీటర్లు
ఎయిర్‌పోర్టుకు దూరం	33 కిలోమీటర్లు	37 కిలోమీటర్లు
ఎయిర్‌పోర్టుకు చేరే టైం	43 నిమిషాలు	45 నిమిషాలు
విస్తీర్ణం	5,800 ఎకరాలు	13,972 ఎకరాలు
నిర్మించే ప్రాంతం	దొడ్డబల్లాపూర్	కందుకూరు-ముచ్చర్ల-తుక్కుగూడ
ప్రధాన నిర్మాణాలు	ఏఐ సిటీ, నాలెడ్జ్, హెల్త్ వర్సిటీ	ఏఐ సిటీ, స్కిల్ వర్సిటీ, స్పోర్ట్స్ వర్సిటీ
వివాదాస్పద నిర్ణయాలు	శాటిలైట్ ఆర్‌ఆర్ రూట్ మార్పు	ఆర్ఆర్ఆర్ రూట్ మార్పు
రద్దయిన గత ప్రాజెక్టు	హెల్త్ సిటీ	ఫార్మా సిటీ
ట్రాన్స్‌పోర్ట్	మెట్రో, ముంబై ఎక్స్‌ప్రెస్ రైలు, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లు	మెట్రో రైలు, గ్రీన్‌ఫీల్డ్, రేడియల్ రోడ్లు

న్యూ సిటీ భూమాయకు సంబంధించిన వివరాలు మీ దగ్గర ఉంటే వాట్సాప్ చేయండి **91827 77711**

రెండు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లోనూ కొత్త సిటీకి ఒకే బ్లూప్రింట్! డిజైన్‌తోపాటు వివాదాలూ సేమ్.. భూదందా ఆరోపణలూ డిటో!

ఐ&పీఆర్‌లో అవినీతి బాణం

- వర్క్ ఆర్డర్లన్నీ 'యారో' అడ్వర్టైజింగ్ ఏజెన్సీకే! › 7
- మార్చిలోనే అక్రెడిటేషన్ సస్పెండైనా ఆగని యాడ్స్
- తెరవెనుక వ్యవహారం నడిపించిన 'బిగ్ బ్రదర్స్'

రచ్చబండలో రచ్చ రచ్చ

- పెన్షన్ల పెంపు ఏది?.. రుణమాఫీ ఇంకెప్పుడు?
- ఎమ్మెల్యే ఆదినారాయణను నిలదీసిన గ్రామస్థులు › 7

గతంలో వచ్చినట్టు 24 గంటల కరెంటు ఇప్పుడెందుకు రాదు?

- విద్యుత్తు సిబ్బందికి కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రశ్న
- ఇదో వరస్ట్ డిపార్ట్‌మెంట్
- సర్కార్ మారగానే కరెంటు కోతలా: పల్లెకారెడ్డి › 7

విషమిచ్చి చంపి ఇండ్లు కూల్చండి


కొత్తపేట జనప్రియ కాలనీలో హైడ్రా అధికారులు వేస్తున్న మార్కింగ్‌ను అడ్డుకుంటున్న స్థానికులు

- మా శవాలను మూసీలో పారేయండి
- ఓట్లేసి గెలిపించింది ఇండ్లు కూల్చేందుకా?
- వివరాలు ఇవ్వం.. ఖాళీ చెయ్యం..!
- 'మూసీ' పొడవునా సర్వే అధికారులకు తేల్చిచెప్పిన స్థానికులు.. అడ్డగింత
- గుండెలు బాదుకుంటూ రోదిస్తూనే ప్రభుత్వంపై మహిళల శాపనార్థాలు
- 'సీఎం డౌన్ డౌన్' అంటూ నినాదాలు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : మూసీ నదిలో ఆక్రమణలు అంటూ సర్వేకు వచ్చిన అధికారులపై ఒక్కసారిగా మహిళల్లో ఆగ్రహం పెల్లుబికింది. 'ఏండ్ల తరబడి ఉంటున్న ఇండ్లను ఉన్నపలంగా కూలుస్తామంటే చూస్తూ ఊరుకోవాలా' అంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రంగా మండిపడ్డారు. 'ఓట్లేసి గెలిపించింది మా ఇండ్లను కూలగొట్టించుకునేందుకా?' అని ఓ యువతి ఆక్రోశం వ్యక్తంచేస్తే.. 'మాకు విషమిచ్చి చంపి శవాలను మూసీలో పడేసిన తర్వాతే మా ఇండ్లు కూలగొట్టుండ్రి' అంటూ రామంతపూర్‌లోని కేసీఆర్ నగర్‌లో ఓ మహిళ తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. 'పేదలకు ఇండ్లు ఇవ్వాల్సింది పోయి ఉన్న ఇండ్లను కూలగొట్టి మా జీవితాలనే కూల్చేయాలనుకుంటున్నోని కుటుంబం బాగుంటదా? మా ఉసురు తగలకుండా పోతడా' అంటూ ఓ వృద్ధురాలు శాపనార్థాలు పెట్టింది. ఇలా ఒక్కరో ఇద్దరో కాదు.. మూసీ నది పొడవునా ఉన్న ఇండ్లలో నివాసముంటున్న వందలాది మంది, రేవంత్ సర్కారుపై దుమ్మెత్తిపోశారు. గురువారం మూసీ పరీవాహక ప్రాంతంలో మూడు జిల్లాల పరిధిలోని మండలలాకు చెందిన రెవెన్యూ అధికారులు చేపట్టిన సర్వేతో ఒక్కసారిగా నిర్వాసితుల ఆక్రందనలు మిన్నంటాయి. అధికారుల బృందాలను చుట్టుముట్టి తమ గోడు వెల్లగక్కారు. డబుల్ బెడ్రూం ఇండ్లు ఇస్తామని అధికారులు నచ్చజెప్పే ప్రయత్నం చేసినా 'మా ఇండ్లను ఇట్లనే ఉంచండి తప్ప మాకు వేరే ఇండ్లే వద్దు' అంటూ కుండబద్దలు కొట్టారు.

నిరసనల మధ్యే సర్వే

ఓవైపు స్థానికుల నిరసనలు కొనసాగుతుండగానే గురువారం గ్రేటర్ పరిధిలోని మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ఇండ్లకు అధికారులు మార్కింగ్ చేశారు. పోలీస్, రెవెన్యూ, నీటిపారుదల సహా వివిధశాఖల అధికారుల ఆధ్వర్యంలో ఈ సర్వే ప్రక్రియ జరిగింది. అధికారులు సర్వేకు రాగానే వారంతా ఒక్కసారిగా అడ్డుకున్నారు. తమ ప్రాంతాల్లో సర్వే చేయొద్దంటూ మార్కింగ్ ప్రక్రియను ఆపే ప్రయత్నం చేశారు. తమ ఇండ్లు తొలగిస్తే ఊరుకోబోమని హెచ్చరించారు. ఒకదశలో సర్వే అధికారులను అడ్డుకునేందుకు స్థానికులు ప్రయత్నించడంతో ఆయా ప్రాంతాల్లో ఉద్రిక్తత చోటుచేసుకున్నది. పలు చోట్ల అధికారుల కాళ్లావేళ్లాపడి బతిమిలాడుకున్నారు. కొందరు మహిలు మహిళా కానిస్టేబుళ్ల చేతులు పట్టుకొని ఏడుస్తూ దండం పెడుతూ తమ ఇండ్ల జోలికి రావద్దని వేడుకున్నారు. అయినా అధికారులు వినకపోవడంతో సర్వేను అడ్డుకున్నారు. ఇండ్ల వద్దకు వచ్చిన సర్వే అధికారులను మహిళలు అడ్డుకోవడంతో మహిళా కానిస్టేబుళ్లు వారిని పక్కకు లాక్కెళ్లే ప్రయత్నం చేసినా విడిపించుకుంటూ సీఎం రేవంత్‌రెడ్డిపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటివరకు ఎన్నిసార్లు వర్షాలు పడ్డా తమ ఇండ్ల వద్దకు చుక్క నీరు కూడా రాలేదని, రెవెన్యూ పట్టాలున్న తమ ప్రాంతాన్ని ఎఫ్‌టీఎల్ అని ఎట్లా డిసైడ్ చేస్తారని అధికారులతో వాగ్వాదానికి దిగారు.

సర్వేపై వెల్లువెత్తిన ప్రజాగ్రహం

ఇక చాదర్‌ఘాట్, మూసానగర్, శంకర్‌నగర్‌లో మూసీనది బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలకు అధికారులు మార్కింగ్ చేశారు. బహదూర్‌పురా, కిషన్‌బాగ్,అసద్‌బాబానగర్ తదితర ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు పోలీసుల సాయంతో మార్కింగ్ చేశారు. లంగర్‌హౌస్ ఆశ్రంనగర్‌లో మార్కింగ్ ప్రక్రియను స్థానికులు అడ్డుకున్నారు. తాము అన్ని అనుమతులు తెచ్చుకొని కష్టపడి కట్టుకున్న ఇండ్లను కూల్చేయడమంటే తమ బతుకులతో ఆడుకోవడమేనని ఆవేదన వ్యక్తంచేశారు. చైతన్యపురి ఫణిగిరికాలనీ, న్యూ మారుతీనగర్, సత్యనగర్‌లో అధికారులతో వాగ్వాదానికి దిగారు. రివర్‌బెడ్‌లో ఉన్న ఇండ్ల వివరాలు, యజమానుల వివరాలను నమోదు చేసే పత్రాలను లాక్కొని ఆగ్రహంతో చింపివేశారు. మార్కింగ్‌కు ఉపయోగించే ఎరుపురంగును లాక్కున్న ఓ యువకుడు దూరంగా విసిరేశాడు. దీంతో అక్కడ కొద్దిసేపు ఉద్రిక్తత చోటుచేసుకున్నది. ఒక్కో బృందం 75 ఇండ్లను సందర్శించాల్సి ఉండగా ఉద్రిక్తల మధ్య సాధ్యం కాలేదు. అధికారులు అడిగిన సమాచారాన్ని ఇంటి యజమానులు ఇవ్వకుండా తిరస్కరించారు. తాము ఇక్కడి నుంచి వెళ్లే ప్రసక్తే లేదని అధికారులతో వాగ్వాదానికి దిగిన ఘటనలే అంతటా కనిపించాయి. ఉప్పల్‌లోని కేసీఆర్ నగర్, చైతన్యపురిలో సర్వే అధికారులను అడ్డుకున్నారు. పరిస్థితిని ఉన్నతాధికారులకు వివరించినా వినకపోవడంతో కొన్ని ఇండ్లు తిరిగి వాటికి మార్కింగ్ చేసి మమ అనిపించారు.

26 బృందాలతో మార్కింగ్..

మూసీ విస్తరించిన మూడు జిల్లాలు రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ ప్రాంతాల్లో రెవెన్యూ అధికారులు గురువారం ఏకకాలంలో సర్వే చేపట్టారు. రెవెన్యూ, పోలీస్, జీహెచ్‌ఎంసీ అధికారులతో ఏర్పాటైన 26 బృందాలు మూసీ పరీవాహక ప్రాంతాల్లో ఆక్రమణలను గుర్తించి మార్క్ చేశారు. హైదరాబాద్‌లో 16, రంగారెడ్డిలో 4, మేడ్చల్‌లో 5 బృందాలు మండలాల వారీగా పర్యటించాయి. మూసీ రివర్ బెడ్ ఏరియాలో నిర్మాణాలను అధికారులు గుర్తించి రిపోర్ట్ రెడీ చేశారు. హైదరాబాద్‌లో అంబర్‌పేట్, ఆసిఫ్‌నగర్, బహదూర్‌పుర, చార్మినార్, గోల్కొండ, హిమాయత్‌నగర్, నాంపల్లి, సైదాబాద్ మండలాలు, రంగారెడ్డిలో ఘట్‌కేసర్, మేడిపల్లి, ఉప్పల్, మేడ్చల్ జిల్లాలో అబ్దుల్లాపూర్‌మెట్, గండిపేట, రాజేంద్రనగర్ మండలాల్లో కూల్చివేసే నిర్మాణాలను మార్క్ చేశారు. మూసీ నది వెంబడి రెవెన్యూ శాఖ నిర్వహించిన తాజా సర్వేలో రివర్ బెడ్ (నది గర్భం)లో 2,116 నిర్మాణాలు, బఫర్ జోన్‌లో మరో 7,850 నిర్మాణాలు ఉన్నాయని గుర్తించారు. హైదరాబాద్‌లో అధికారులు అంచనా వేసుకున్న 1,595 నిర్మాణాల్లో నిరసనల మధ్య 941 ఇండ్లకు మాత్రమే అధికారులు మార్క్ చేశారు. కాగా నేడూ కూడా సర్వే కొనసాగనుంది.

శనివారం నుంచే కూల్చివేతలు!

మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్టులో భాగంగా అక్రమణలను తొలగించేందుకు ఇప్పటికే హైడ్రా బుల్డోజర్లు మూసీ తీరానికి చేరుకున్నట్టు అధికారులు చెప్తున్నారు. శనివారం సాయంత్రం అంతా సిద్ధం చేసి ఆదివారం కూల్చివేయడానికి హైడ్రా ప్రణాళికలు చేసుకుంది. అందుకు సంబంధించి ఫోర్స్‌ను కూడా రెడీ చేసింది. ఎలాగైనా పెద్ద ఎత్తున వ్యతిరేకత ఉంటుందని ముందస్తుగానే హైడ్రా వద్ద సమాచారం ఉండటంతో అందుకు తగ్గట్టు ఏర్పాట్లు చేస్తున్నట్టు తెలిసింది. మూసీ పరిధిలోని ఆయా పోలీస్ స్టేషన్ల సిబ్బంది ఆ ప్రాంతాల నుంచి ఎప్పటికప్పుడు సమాచారం సేకరిస్తున్నారు. స్థానిక నాయకులతో చర్చిస్తూ ఖాళీ చేయించేందుకు ప్రయత్నిస్తున్నారు. మరోవైపు నది ఒడ్డున ఉన్న నివాసాల నుంచి ఖాళీ చేసే ప్రజలకు వసతి కల్పించేందుకు ప్రభుత్వం నగరంలోని వివిధ ప్రాంతాల్లో పునరావాసం కల్పిస్తామని చెప్పినప్పటికీ వాటిని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

మమ్ముల్ని సంపుండ్రి



నాపేరు లక్ష్మి.. నాకు ఒక్కటే ఇల్లున్నది. అది కూడా నలభై గజాలు.. ఈ ఇల్లు కూడా కూలగొడ్తమంటె ఆఫీసర్లు మామీద నుంచి పోయి కూలగొట్టాలే.. మమ్మల్ని చంపి కూలగొట్టుండ్రి. మాకు ఆస్తుల్లేవు. భూముల్లేవు. నాకు ఎప్పుడు హార్టెటాక్ వస్తదో తెల్వదు. మూడు మాట్ల కాల్లు చేతులు పడిపోయినయ్. నాకేమన్న అయిందనుకో రేవంత్‌రెడ్డే చేసిండని నా కొడుకులకు చెప్పి సచ్చిపోత. ఇగో.. రేవంత్‌రెడ్డీ చెప్తున్న.. నన్ను సంపి మూసీలో పారేసి నా ఇల్లు కూలగొట్టుండ్రి. రేవంత్‌రెడ్డి ఎందుకొచ్చిండు? మా ఇల్లు కూలగొట్టడానికి వాడెవ్వడు?

- లక్ష్మి, కేసీఆర్‌నగర్

కూలగొట్టినోడు బాగుపడ్తడా?



గవర్నమెంట్ జాగా తీసుకోవాలె.. కాల్వలు చేసుకోమను.. కానీ మా ఇండ్ల జోలికి ఎందుకు రావాలె. ఇక్కడి నుంచి మేమెక్కడికి పోవాలె. మా పిల్లల కాలేజీలు, స్కూల్లు అన్నీ వదిలేయాల్న. ఒక్క ఇల్లు కూలగొట్టినా అందరం సచ్చిపోతం. ఈ రేవంత్‌రెడ్డి ఎప్పటికీ అన్యాయం చేస్తనే ఉంటడా. మేమైతే చెప్తున్నం..మా చావుకు రేవంత్‌రెడ్డే కారణమైతడు. ఆయనవల్లే మాకు ఈ కష్టం. మల్లోసారి వస్తడా.. మళ్ల ఓట్లేస్తమా. మా ఇండ్లు కూలగొట్టినోడు బాగుపడ్తడా. జనాల నోళ్లు కొట్టిన వాడు సంతోషంగా ఉంటడా. మేం మాత్రం ఊరుకోం. మాకు న్యాయం జరగాలె.

-నాగవాణి, కేసీఆర్‌నగర్



స్వయంపాలనా కెరటం కొండా లక్ష్మణ్ బాపూజీ

రాజీలేని పోరాటానికి ఆదర్శప్రాయుడు

లక్ష్మణ్ బాపూజీ జయంతి సందర్భంగా బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నివాళి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): స్వాతంత్ర్య సమరయోధుడుగా, అనంతర కాలంలో తెలంగాణ స్వయంపాలన కోసం, ఆత్మగౌరవం కోసం పోరాటాలు నడిపిన తొలితరం ఉద్యమనేతగా కొండా లక్ష్మణ్ బాపూజీ చేసిన కృషి అజరామరమని బీఆర్‌ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. రాజకీయవేత్తగా తెలంగాణ అస్తిత్వాన్ని చాటేందుకు బాపూజీ నడిపిన రాజీలేని పోరాటాలు తెలంగాణ సోయి కలిగిన ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని కొనియాడారు. శుక్రవారం కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతిని పురస్కరించుకుని వారి కృషిని కేసీఆర్ స్మరించుకున్నారు. మంత్రి పదవిని త్యాగం చేసి నాటి తెలంగాణ వ్యతిరేకులకు సవాల్ విసిరిన బాపూజీ పట్టుదల తన మలిదశ రాష్ట్ర సాధన పోరాటానికి స్ఫూర్తి నింపిందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రజల హక్కులు, రక్షణ స్వరాష్ట్ర సాధనతోనే సాధ్యమని, తాను రాజీనామా చేసి ఉద్యమాన్ని ప్రారంభించిన నాడు బాపూజీ తనకు అండగా నిలిచిన సందర్భాన్ని కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. స్వయంపాలన కోసం తాను తొలి అడుగు వేసిన జలదృశ్యం ఉద్యమ ప్రస్థానం నుంచి, స్వరాష్ట్రంగా నిలిపి పదేండ్ల బీఆర్‌ఎస్ పాలన సాధించిన ప్రగతి ప్రస్థానం చరిత్రాత్మక ఘట్టం అని పేర్కొన్నారు.

బడుగుల అభ్యున్నతే...

బడుగుబలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా తన జీవితకాలం పోరాడిన బాపూజీ ఆకాంక్షలకు అనుగుణంగా పదేండ్ల పాలన కొనసాగిందని కేసీఆర్ పునరుద్ఘాటించారు. బాపూజీ కృషిని భావితరాలకు నిత్య స్ఫూర్తిగా నిలిపేందుకు బీఆర్‌ఎస్ ప్రభుత్వం వారి ఆదర్శాలను కొనసాగించేందుకు అనేక కార్యక్రమాలను చేపట్టిందని గుర్తుచేశారు. తెలంగాణ సబ్బండ కులాల ఆత్మగౌరవాన్ని కాపాడటం, అన్ని రంగాల్లో వారి హక్కులకు రక్షణ కల్పించడం, స్వయంపాలనలో వారిని భాగస్వాములను చేయడమే కొండా లక్ష్మణ్ బాపూజీకి మనం అందించే ఘననివాళి అని కేసీఆర్ పేర్కొన్నారు.

లోకం పోకడ



మామూలు కంపే బాగుంది..
ఈ అవినీతి కంపు భరించలేకపోతున్నాం!

వానకాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	38.7°c	24.5°c
రంగారెడ్డి	34.1°c	22.1°c
మెదక్	33.2°c	22.3°c
ఖమ్మం	33.0°c	24.0°c
నిజామాబాద్	32.6°c	24.7°c
కరీంనగర్	31.0°c	26.0°c
వరంగల్	31.0°c	25.0°c
నల్లగొండ	30.0°c	23.0°c
హైదరాబాద్	28.0°c	23.0°c
మహబూబ్‌నగర్	28.0°c	21.0°c

హైడ్రాతో పేదలకు ఇబ్బందులు లేవు: మంత్రి సీతక్క



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): హైడ్రాతో పేదలకు ఇబ్బందులు లేవని, ఇండ్లు కోల్పోయే పేదలకు మరో చోట డబుల్ బెడ్రూం ఇండ్లు కేటాయిస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్పారని మంత్రి సీతక్క తెలిపారు. అమృత్ పథకంలో ఏమైనా తప్పిదాలు జరిగితే కేంద్రమే చర్యలు తీసుకుంటుందని పేర్కొన్నారు. గురువారం పెసా జాతీయ సదస్సులో పాల్గొన్న అనంతరం ఢిల్లీలోని తెలంగాణభవన్‌లో తనను కలిసిన మీడియా ప్రతినిధుల ప్రశ్నలకు సీతక్క సమాధానమిచ్చారు. రేవంత్‌రెడ్డి బంధువు అయినందునే సృజన్‌రెడ్డికి అమృత్ టెండర్లు దక్కాయన్న విమర్శలు సరికావని చెప్పారు. తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగలేదన్న కారణంతో గ్రామ పంచాయతీలకు కేంద్రం నిలిపివేసిన 15వ ఆర్థిక సంఘం నిధులను విడుదల చేయాలని కేంద్ర పంచాయతీరాజ్‌శాఖ సహాయ మంత్రి ఎస్‌పీసింగ్ బఘేల్‌ను సీతక్క కోరారు.

హైడ్రా కూల్చివేతలు చట్టబద్ధంగా ఉండాలి

సీఎంకు బహిరంగలేఖలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): హైడ్రా కూల్చివేతలను న్యాయబద్ధంగా, చట్టబద్ధంగా చేపట్టి ఉంటే బాగుండేదని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఆక్రమణలను, అక్రమ నిర్మాణాలను తాము సమర్థించబోమని పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఆయన సీఎం రేవంత్‌రెడ్డికి బహిరంగలేఖ రాశారు. హైడ్రా ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ఇష్టారాజ్యంగా కూల్చివేతలు కొనసాగిస్తున్నదని ఆరోపించారు. హడావుడి చేసి నిత్యం వార్తల్లో ఉండే లక్ష్యంతోనే రాష్ట్ర ప్రభుత్వం కూల్చివేతలను ఎంచుకున్నట్టు కనిపిస్తున్నదని తెలిపారు. పేద, మధ్యతరగతి ప్రజలు అప్పులు చేసి, బ్యాంకు రుణాలు తీసుకొని స్థలాలు, ఫ్లాట్లు కొనుక్కున్నారని, వారి కట్టడాలు కూల్చివేసి బజారున పడేస్తే వారు ఎటుపోవాలని ప్రశ్నించారు. తప్పుడు లేఅవుట్‌లు సృష్టించి ప్రజలను మభ్యపెట్టి, పెట్టుబడులు పెట్టించి, అక్రమంగా భూములు అమ్మిన వారిని దీనికి బాధ్యులను చేస్తూ కఠినమైన చట్టాలు తీసుకురావాలని సూచించారు.

హెచ్‌ఎండీఏలో ఎన్‌వోసీ గుబులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : హెచ్‌ఎండీఏ ప్లానింగ్ అధికారవర్గాల్లో ఎన్‌వోసీ గుబులు మొదలైంది. ఇరిగేషన్ ఇతర శాఖలు ఇచ్చిన ఎన్‌వోసీలను ప్రామాణికంగా తీసుకొని నిర్మాణ అనుమతుల జారీ ప్రకియ పలు జోన్ల పరిధిలో జోరుగా సాగింది. లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ప్లానింగ్, హైడ్రా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఎన్‌వోసీ ఆధారంగా జారీ చేసిన అనుమతులను పునఃపరిశీలన చేయాలని నిర్ణయించారు. ఇది ప్లానింగ్ విభాగంలోని సిబ్బందిని హడలెత్తిస్తున్నది. బిల్డింగ్ పర్మిషన్ల పునఃపరిశీలనతో అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉన్నది. అదే జరిగితే ప్లానింగ్ విభాగంలో ఎన్‌వోసీ ఆధారంగా జరిగిన లావాదేవీలన్నీ బట్టబయలు కానున్నాయి. హెచ్‌ఎండీఏ ప్లానింగ్ విభాగంలో జరిగిన ఎన్నో అవకతవకలకు అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన లేకపోవడమే కారణమని పలు సందర్భాల్లో వెల్లడైంది. అధికారుల నిర్లక్ష్యంతోనే ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ భూముల్లో నిర్మాణాలు భారీగా జరిగాయి. ఇరిగేషన్‌శాఖ ఇచ్చిన ఎన్‌వోసీ, హెచ్‌ఎండీఏ బిల్డింగ్ పర్మిషన్ ఉన్న భవనాలనూ హైడ్రా కూల్చివేయడంతో పలు విమర్శలు వచ్చాయి. పర్మిషన్లు ఉన్న భవనాలను ఎలా కూలుస్తారని బాధితులు కోర్టులకు ఎక్కుతున్నారు. ఈ క్రమంలో కూల్చివేతలను పకడ్బందీగా నిర్వహించేందుకు హెచ్‌ఎండీఏ ప్లానింగ్, హైడ్రా అధికారులతో లేక్ ప్రొటెక్షన్ కమిటీ సమన్వయ సమావేశం నిర్వహించింది.


సూర్యాపేట పట్టణం నెహ్రూనగర్‌లో సర్వే చేస్తున్న అధికారులు

సర్వేకొస్తే కండ్లల్లో కారం కొడుతాం

- సూర్యాపేటలో సర్కారు 'హైడ్రా'మా
- సద్దుల చెరువు పరిసర నివాసాల్లో సర్వే
- తిట్లు, ఎదురుదాడితో అధికారుల పీచేముడ్

బొడ్రాయిబజార్, సెప్టెంబర్ 26: కొద్ది రోజులుగా సూర్యాపేట జిల్లా కేంద్రంలోని సద్దుల చెరువు, పుల్లారెడ్డి చెరువు సమీపంలో ఉన్న నివాసులకు హైడ్రా గుబులు పుట్టిస్తున్నది. చెరువు పరిధిలోని ఇండ్లు కూల్చేస్తారనే ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో గురువారం రెవెన్యూ, ఇరిగేషన్, మున్సిపల్ శాఖల అధికారులు సద్దుల చెరువు ప్రాంతంలో ఇండ్ల వివరాలు తెలుసుకునేందుకు వచ్చారు. దీంతో ప్రజల నుంచి పెద్ద ఎత్తున తిరుగుబాటు ఎదురైంది. 'ఏం మార్కింగ్ వేస్తుండ్రు.. కండ్లల్లో కారం పోసి కొడుతం.. ఒక్కో ఇంట్లో నాలుగు నాలుగు కుటుంబాలున్నాయి. రోడ్డు మీద బతకాలా? మేమొచ్చి 40 ఏండ్లు దాటింది.. మా ఇండ్లకు పట్టాలు కూడా ఉన్నాయి. అప్పుడు చెరువే లేదు. నాయకులు గేమ్‌లు ఆడుతూ జనాలను పిచ్చోళ్లను చేస్తుండ్రు. మీరు.. జేసీబీ తెచ్చి ఈడ పెట్టుండ్రి.. ఒక్కొక్క నా కొడుకును నరకకుంటే అడుగు.. కడుపుల మండుతుంది.. ' అని అక్కడి జనం ఆగ్రహ వ్యక్తంచేశారు. ఇలా తిట్లు, శాపనార్థాలు పెట్టడంతో చేసేదేమి లేక అధికారులు వెనుదిరిగిపోయారు. సూర్యాపేట ఆర్డీవో ఆదేశాల మేరకు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న ఇండ్లను సర్వే చేసేందుకు సద్దుల చెరువు సమీపంలోని నెహ్రూనగర్‌కు వచ్చినట్టు ఇరిగేషన్ ఏఈ భూక్యా పాండునాయక్ తెలిపారు.

పుస్తకాలు కూడా తీసుకోనివ్వరా?: ఎన్‌ఆర్‌ఐ తిరుపతిరెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తేతెలంగాణ): 'ప్రభుత్వం హైడ్రా పేరిట హైదరాబాద్‌లో విధ్వంసం సృష్టిస్తున్నది. రియల్ ఎస్టేట్ వాళ్ల దగ్గర డబ్బులు తీసుకొని పేదల ఇండ్లను కూలగొడుతున్నది' అంటూ ఎన్‌ఆర్‌ఐ ఎర్రంరెడ్డి తిరుపతిరెడ్డి చిటపటలాడారు. ఈ మేరకు గురువారం వీడియో విడుదల చేశారు. ' అమీన్‌పూర్ దగ్గర కట్టుకున్న తన ఇంటిని కూలగొడుతుంటే ఒడిశా నుంచి వచ్చిన పెద్దాయన ఏడుపు చూసి మీకు బాధనిపించలేదా? ఓ పాప కనీసం పుస్తకాలు, వాటర్ బాటిళ్లు తీసుకోనివ్వలేదంటూ చెప్తుంటే మీ మనసు కరగలేదా? అనుమతులిచ్చిన అధికారులపై ఎందుకు చర్యలు తీసుకోరు? పెద్దోళ్ల అక్రమ కట్టడాలను విడిచిపెట్టి పేదోళ్లవి మాత్రం పడగొడుతున్నరు. దమ్ముంటే కూల్చుడు కాదు.. కట్టి చూపాలె' అని పేర్కొన్నారు.

ఇక జిల్లాల్లోనూ కూల్చుడే!

- పాలమూరు తరహా కూల్చివేతలకు చర్యలు
- ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, సర్కార్ భూముల్లో నిర్మాణాల తొలగింపునకు ఆదేశాలు
- రెవెన్యూ అధికారులకు బాధ్యతలు
- హైడ్రా తరహా బృందాలను రెడీ చేయాలని సూచన


సిద్దిపేట పట్టణంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు

హైదరాబాద్, సెప్టెంబర్26(నమస్తే తెలంగాణ): ఇప్పటిదాకా హైదరాబాద్ నగరంలో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో అక్రమ నిర్మాణాలు, ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు అంటూ హైడ్రా పేరిట కూల్చివేతల కాండ సాగించిన కాంగ్రెస్ సర్కార్, ఇక జిల్లాల్లోనూ బుల్డోజర్లు పెట్టేందుకు రంగం సిద్ధం చేసినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పాలమూరు జిల్లా క్రిస్టియన్‌పల్లి తరహాలో మరిన్ని కూల్చివేతలకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు సమాచారం. ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్, ప్రభుత్వ భూముల్లో ఉన్న భవనాలను నిర్దాక్షిణ్యంగా కూల్చివేయలని కలెక్టర్లకు ప్రభుత్వం మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. కూల్చివేతలకు రెవెన్యూ అధికారులు నాయకత్వం వహించాలని, హైడ్రా తరహా బృందాలను లీడ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇప్పటికే పలు జిల్లాల్లో కూల్చివేతలు మొదలయ్యాయి.

సిద్దిపేటలో మొదలైన కూల్చివేతలు

గురువారం తెల్లవారుజామున సిద్దిపేట జిల్లా కేంద్రంలో రెండు ఇండ్లను అధికారులు కూల్చివేశారు. ఎర్రచెరువు బఫర్ జోన్‌లో ఉన్నదని ఒక ఇంటిని, మున్సిపల్ అనుమతి లేదని మరో ఇంటిని రెవెన్యూ, మున్సిపాలిటీ అధికారులు కూల్చి వేశారు. ఎర్ర చెరువు సమీపంలో ఓ వ్యక్తి ఇల్లు కట్టుకొని నివాసం ఉంటున్నాడు. అతడి ఇల్లు బఫర్ జోన్‌లో ఉన్నదంటూ రెవెన్యూ అధికారులు నేలమట్టం చేశారు. మరో ఐదు కుటుంబాలకు నోటీసులు ఇచ్చినట్టు తెలిసింది. పట్టణం 5వ వార్డులో తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో అనుమతి పొంది ఇల్లు కడుతున్నారనే ఆరోపణతో మరో ఇంటిని కూలగొట్టారు. మున్సిపాలిటీ అనుమతి లేకుండా, అనుమతించిన ప్లాన్ ప్రకారం లేకుండా కట్టిన ఇండ్లను అక్రమ నిర్మాణాలుగానే గుర్తించి కూల్చి వేస్తామని మున్సిపాలిటీ అధికారులు హెచ్చరించారు. గతేడాది ఆగస్టు 23 తర్వాత సిద్దిపేట పట్టణంలో 58, 59 జీవోల కింద పట్టాలిచ్చిన దాదాపు 200కు పైగా ఇంటి స్థలాలకు రీ వెరిఫికేషన్ చేయాలని నిర్ణయించినట్టు తెలిసింది. సంగారెడ్డి జిల్లాలోనూ రెవెన్యూ అధికారులు ఓఇంటిని కూల్చేశారు. కొండాపూర్ మండలం మల్కాపూరంలో నర్సింహులు అనే వ్యక్తి భవనం కట్టుకున్నాడు. దానికి గ్రామ పంచాయతీ అనుమతించింది. కాగా పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్‌ను ఆక్రమించి భవనం కట్టాడన్న కారణంతో కూల్చేశారు.

దివ్యాంగుల ఇండ్లపై విరుచుకుపడి..

గత ఆగస్ట్ చివరి వారంలో మహబూబ్‌నగర్ పట్టణంలో భారీగా కూల్చివేతల కాండ కొనసాగింది. పొద్దంతా కష్టం చేసిన ప్రజలు ఆదమరిచి నిద్రపోతున్న వేళ క్రిస్టియన్‌పల్లిమీద రెవెన్యూ అధికారులు బుల్డోజర్లతో విరుచుకుపడ్డారు. 75 ఇండ్లను తెల్లవారేలోపు నేలమట్టం చేశారు. బాధితుల్లో బదిరులు, అంధులు, దివ్యాంగులే ఎక్కువగా ఉన్నారు. రెవెన్యూ అధికారులే 2007లో ఇవే ఇండ్లకు పట్టాలిచ్చారు. కేసీఆర్ ప్రభుత్వం వచ్చాక వారికి విద్యుత్తు కనెక్షన్ ఇచ్చి, నీటి సౌకర్యం కల్పించింది. ఇవేవీ పట్టించుకోకుండా రెవెన్యూ అధికారులు దివ్యాంగుల ఇండ్లను కూలగొట్టారు. ఈ నెల మెదటి వారంలో రంగారెడ్డి జిల్లా రాయదుర్గం మండలం మల్కం చెరువు వద్ద 40 ఇండ్లను శేరిలింగంపల్లి రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. ఇక్కడి పేదలు చెరువుకు దూరంగా ఇండ్లు కట్టుకొని 40 ఏళ్ల నుంచి ఉంటున్నరు. అర్ధరాత్రి వేళ ఆ ఇండ్లను నేలమట్టం చేశారు. కానీ ఇదే చెరువును ఆక్రమించి జాతీయ స్థాయిలో పేరున్న రియల్ ఎస్టేట్ సంస్థలు ఆకాశహర్మ్యాలు నిర్మించాయి. ఏకంగా మల్కం చెరువునే ఆక్రమించి బహుళ అంతస్థుల భవనాలు కట్టాయి. కానీ రెవెన్యూ అధికారులు వాటివైపు కన్నెత్తి చూడకుండా పేదల ఇండ్లను కూలగొట్టారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చెరువులో భవనం కూల్చివేత

గతంలో 'నమస్తే తెలంగాణ'లో కథనం • విచారణ జరిపించిన కలెక్టర్

పేలుడు పదార్థాలతో విధ్వంసం • హోంగార్డు గోపాల్‌కు స్వల్ప గాయం


• కూల్చడానికి ముందు


• కూల్చిన తర్వాత

కొండాపూర్, సెప్టెంబర్ 26 : ఓ వ్యక్తి ఏకంగా చెరువులో నిర్మించిన భవనాన్ని గురువారం అధికారులు కూల్చివేశారు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకున్నది. కొండాపూర్ మండలం మల్కాపూర్ మధిర గ్రామం కుతుబ్‌షాయిపేటలోని మల్కాపూర్ పెద్ద చెరువులో పటాన్‌చెరుకు చెందిన నర్సింలు అనే వ్యక్తి 2011లో మూడు ఎకరాలు కొనుగోలు చేశాడు. అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే 2012లో నాలా కన్వర్షన్ చేసుకొని 250 గజాల విస్తీర్ణంలో జీ+2 భవనాన్ని నిర్మించాడు. అది ఎఫ్‌టీఎల్ పరిధిలో ఉన్నదని గతంలో 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. అప్పట్లో ఆ భవన యజమాని కోర్టు స్టే తీసుకువచ్చినట్టు ప్రచారం జరిగింది. దీంతో ఆ నిర్మాణం అలాగే ఉండిపోయింది. విషయం సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి దృష్టికి రావడంతో విచారణకు ఆదేశించారు. కొండాపూర్ మండల రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు పరిశీలించి ఈ నిర్మాణం ఎఫ్‌టీఎల్ పరిధిలోనే ఉన్నదని తేల్చి కలెక్టర్‌కు నివేదిక ఇచ్చారు. భవనాన్ని కూల్చివేయాలని అధికారులు సదరు భవన యజమానికి వారం రోజుల క్రితం నోటీసులు జారీచేసినా స్పందించలేదు. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం ఉదయం భారీ పోలీసు బందోబస్తు మధ్య భవనాన్ని తహసీల్దార్ ఎస్తేరు అనిత, ఇతర అధికారులతో కలిసి పేలుడు పదార్థాలతో కూల్చివేశారు. ఈ క్రమంలో భవన శకలం తగలడంతో ఇంద్రకరణ్ పోలీస్‌స్టేషన్ హోంగార్డు గోపాల్ తలకు గాయమైంది. అక్కడే ఉన్న అధికారులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం సంగారెడ్డి దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ తరలించారు. తన భవనం ఎఫ్‌టీఎల్‌లో ఉన్నట్లు తెలియదని అన్నారు. తాను నిర్మాణం చేపట్టినప్పుడు నీళ్లు లేవని చెప్పాడు. ఎఫ్‌టీఎల్‌లో భవన నిర్మాణాలకు అనమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ సర్కార్ తీరువల్ల తనకు రూ.6 కోట్లకుపైగా నష్టం వాటిలినట్టు వాపోయాడు.



తెలంగాణలోనూ ఎమ్మెల్యే కొనుగోళ్లు

- ఇక్కడా పదో షెడ్యూల్ అపహాస్యమే
- కాంగ్రెస్ నేత కపిల్ సిబల్‌కు కేటీఆర్ కౌంటర్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): కర్ణాటకలో బీజేపీ తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ రాజ్యాంగంలోని పదో షెడ్యూల్‌ను అపహాస్యం చేస్తున్నదని కాంగ్రెస్ నేత కపిల్ సిబల్ వ్యాఖ్యలపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటుగా స్పందించారు. కపిల్ సిబల్ వైఖరి గురువిందగింజ మాదిరిగా ఉన్నదని ఎక్స్ వేదికగా ఎద్దేవా చేశారు. కర్ణాటకలో బీజేపీలానే తెలంగాణలో కాంగ్రెస్ కూడా అదే పని చేస్తూ రాజ్యాంగాన్ని అపహాస్యం చేస్తున్నదని, సిబల్‌కు ఇది ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలోనూ పదో షెడ్యూల్ అపహాస్యమవుతున్నదని తెలిపారు. పోలీసులు, విజిలెన్స్‌ను అడ్డంపెట్టుకుని అధికారాన్ని దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి భారీగా అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఇంత జరుగుతున్నా రాహుల్‌గాంధీ మాత్రం రాజ్యాంగ పరిరక్షకుడిలా ఫోజులు కొడుతుండడం సిగ్గుచేటని విమర్శించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో జరుగుతున్న తప్పులను తొలుత సరిదిద్ది, విమర్శలు చేయాలని కపిల్ సిబల్‌కు కేటీఆర్ హితవు పలికారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

రైతునువంచించాలని చూస్తే కాలం రాగానే రైతు తాను దిగమింగిన దుఃఖం ప్రతాపాన్ని రుచి చూపిస్తాడని కేటీఆర్ హెచ్చరించారు. తెలంగాణ గడ్డమీద నిలబడి రుణమాఫీ డిక్లరేషన్ ఇచ్చి రైతులను నిండా మోసం చేసినందుకు కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం తప్పదని పేర్కొన్నారు. రూ.లక్ష రుణమాఫీ కావాలని రైతు బ్యాంకుకు వెళితే లక్ష ఖర్చు అయ్యేలా కేసులు పెడతారా? ఇదేనా ప్రజాపాలన? ఇదేనా ఇందిరమ్మ రాజ్యం? అని ప్రశ్నించారు. అన్నదాతపై పోలీసులు దాష్టీకాలకు పాల్పడితే బీఆర్‌ఎస్ పార్టీ సహించదని తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పాలకులారా ఖబడ్దార్ అని కేటీఆర్ హెచ్చరించారు.

పండుగలు వస్తున్నయ్.. ఉపాధి పైసలివ్వండి

- 30లోగా యూసీ ఇవ్వకుంటే రెండో విడత నిధులు బంద్
- రాజీవ్ విగ్రహం సాక్షిగా పంచాయతీ చట్టాలు నిర్వీర్యం
- ఆర్థిక సంఘం, ఉపాధి హామీ నిధులపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు హరీశ్ లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): జాతీయ ఉపాధి హామీ పథకాన్ని తామే తెచ్చామని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ, మన రాష్ట్రంలో ఈ పథకం అమలులో తీవ్ర అలసత్వం ప్రదర్శిస్తున్నదని మాజీ మంత్రి టీ హరీశ్‌రావు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ ఆర్థిక సంవత్సరానికి కేంద్రం రూ.1,200 కోట్లు విడుదల చేసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం మెటీరియల్ కాంపోనెంట్‌కు సంబంధించిన 25% నిధులను విడుదల చేయలేదని మండిపడ్డారు. దసరా, దీపావళి పండుగలు సమీపిస్తున్న నేపథ్యంలో ఉపాధి హామీ పథకం కూలీలు, సిబ్బంది పరిస్థితిని అర్థం చేసుకొని, తక్షణం నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ పథకానికి సంబంధించి సెప్టెంబర్ 30లోపు యుటిలైజేషన్ సర్టిఫికెట్‌ను కేంద్రానికి సమర్పించకపోతే రెండో విడత నిధుల విడుదల నిలిచిపోతుందని, ఇది తెలంగాణ ప్రయోజనాలను మరింత దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. 15వ ఆర్థిక సంఘం



కేటాయించిన పంచాయతీరాజ్ నిధుల విడుదలలో జాప్యం, ఉపాధి హామీ పథకం మెటీరియల్ కాంపోనెంట్ నిధులు విడుదలలో ఆలస్యం కారణంగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలంటూ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు హరీశ్‌రావు గురువారం బహిరంగ లేఖ రాశారు.

నిలిచిపోయిన గ్రామాల అభివృద్ధి

పంచాయతీరాజ్ చట్టాన్ని తెచ్చామనే గొప్పలు చెప్పుకొనే కాంగ్రెస్ నేతలు.. సచివాలయం ముందున్న రాజీవ్‌గాంధీ విగ్రహం సాక్షిగా ఆ చట్టాలను తుంగలో తొక్కడం దారుణమని హరీశ్‌రావు విమర్శించారు. 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను గ్రామ పంచాయతీలకు విడుదల చేయకపోవడం వల్ల

> గ్రామ పాలన ఆగిపోయింది. చెత్త సేకరణ నిలిపోయింది. ట్రాక్టర్లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా నిర్వహణ మూలనపడింది. ఫాగింగ్ లేదు. చివరకు బ్లీచింగ్ పౌడర్ కూడా చల్లడం లేదు. దీంతో గ్రామాల్లో విషజ్వరాలు ప్రబలుతున్నాయి. మలేరియా, డెంగీ వంటి వ్యాధుల బారిన పడి ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. - హరీశ్‌రావు

రాష్ట్రంలో గ్రామాభివృద్ధి నిలిచిపోయిందని, పారిశుద్ధ్యం కుంటుపడిందని దుయ్యబట్టారు. గత ఎనిమిది నెలలుగా ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో గ్రామాలుగా మురికికూపాలుగా మారాయని, చెత్తను తొలగించే ట్రాక్టర్లకు డీజిల్ డబ్బులు కూడా ఇవ్వలేని పరిస్థితి నెలకొన్నదని, కొన్నిచోట్ల అధికారులు అప్పులు చేసి డీజిల్ పోయిస్తున్నారంటే పరిస్థితి ఎంత అధ్వాన్నంగా తయారైందో అర్థం చేసుకోవచ్చునని పేర్కొన్నారు. సొంత జేబు నుంచి డబ్బులు ఖర్చు చెయ్యలేక, ఆ ఆర్థిక భారాన్ని మోయలేక పంచాయతీ కార్యాదర్శులు మూకుమ్మడిగా సెలవులు పెట్టే దుస్థితి దాపురించిందని విమర్శించారు. ఉద్యోగులు, పారిశుద్ధ్య కార్మికులకే కాదు.. పదవీకాలం ముగిసి నాలుగు నెలలైనా సర్పంచులు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలకు సైతం ఎనిమిది నెలల గౌరవ వేతనాలు చెల్లించలేదని దుయ్యబట్టారు. 1వ తేదీనే జీతాలు చెల్లిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం ఆచరణలో అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నదని మండిపడ్డారు. రాష్ట్రంలోని మాజీ సర్పంచులు గవర్నర్‌ను కలిసి పెండింగ్ బిల్లులు విడుదల చేయాలని మొర పెట్టుకునే పరిస్థితి వచ్చిందని ధ్వజమెత్తారు. ఇప్పటికైనా కండ్లు తెరిచి 15వ ఆర్థిక సంఘం కేటాయించిన నిధులను వెంటనే పంచాయతీలకు విడుదల చేయాలని, గ్రామ పంచాయతీ వ్యవస్థను తిరిగి గాడిన పెట్టేందుకు కృషిచేయాలని డిమాండ్ చేశారు. అక్టోబర్‌లో రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులను సాధించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

బీఆర్‌ఎస్ పాలన వ్యవసాయానికి సువర్ణ అధ్యాయం

'ధాన్యం ఉత్పత్తిలో తెలంగాణ నంబర్ 1.. పత్తి ఉత్పత్తిలో నంబర్ 3.. పంటల సాగులో మేటి.. మన తెలంగాణ.. దేశానికే ఆదర్శం. ఇదంతా మంత్రమేస్తేనో, మాయ చేస్తేనో జరిగింది కాదు.. తొమ్మిదేండ్ల కేసీఆర్ కృషి, పట్టుదల, విజనరీ లీడర్‌షిప్ వల్ల సాధించిన ఘనత' అని గురువారం ఎక్స్‌వేదికగా హరీశ్‌రావు ట్వీట్ చేశారు. తొమ్మిదేండ్ల బీఆర్‌ఎస్ పాలన వ్యవసాయ రంగానికి ఒక సువర్ణ అధ్యాయమని పేర్కొన్నారు.



ఫోన్‌లో కేటీఆర్‌కు కష్టాలు చెప్పుకుంటున్న వికారాబాద్ జిల్లా నారేగూడె రైతు నాగిరెడ్డి. చిత్రంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ తదితరులు

పెద్దాయనా.. ధైర్యంగా ఉండండి

- రుణమాఫీపై మీ తరఫున సర్కారుతో గట్టిగ కొట్లాడ్తం
- ఫోన్‌లో గోడు వెళ్లబోసుకున్న రైతుకు కేటీఆర్ భరోసా

నవాబుపేట, సెప్టెంబర్ 26: 'ఎన్నికల ముందు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తా అన్నడు. గెలిచినంక మాఫీ చేయకుండా తిప్పలు పెడుతుండు. నిలదీద్దామని పట్నమొస్తే.. మమ్మల్ని దొంగల్లాగా ఎస్‌ఆర్‌నగర్ పోలీసుస్టేషన్ల నిర్బంధించిన్రు. కేటీఆర్ గారూ మీరున్నప్పుడు మంచిగుండె.. మీరే మాకు దారి చూపాలి' అంటూ వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలం నారేగూడె వాసులు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఫోన్‌లో గోడు వెళ్లబోసుకున్నరు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, బీఆర్‌ఎస్ నాయకులతో రుణమాఫీకాని రైతుల సమస్యలు వినేందుకు గురువారం నవాబుపేటమండలం నారేగూడకు వెళ్లారు. ఈ సందర్భంగా రైతులు మల్లారెడ్డి, నాగిరెడ్డి బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఫోన్ చేసి తమ సమస్యలను వివరించారు. కేటీఆర్ వారికి భరోసా ఇస్తూ 'మీ తరఫున ప్రభుత్వంపై మేము గట్టిగ కొట్లాడ్తం. మీ వెంట కేసీఆర్‌సార్, సబితమ్మ ఉన్నారు' అని ధైర్యం చెప్పారు. 'ఈ గుంపు మేస్త్రి దేవుళ్ల మీద ఒట్టు పెడితే నమ్మినం.ఇంత మోసం చేస్తడనుకుకోలే'అంటూ ఒకరైతు కన్నీరు పెడితే సబితారెడ్డి ధైర్యం చెప్పి ఓదార్చారు.

బీఆర్‌ఎస్ శ్రేణులపై పోలీసుల వేధింపులు

మర్పల్లి : రెండు రోజుల క్రితం వికారాబాద్ జిల్లా మర్పల్లి మండలం పట్లూరుకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు ప్రవీణ్, నవీన్‌లను ఓ కేసు విషయంలో మర్పల్లి పోలీసులు అరెస్టు చేసి వేధించిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం మాజీ మంత్రి సబితారెడ్డి వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు.

రాష్ట్రంలో పోలీస్ రాజ్యం

- ప్రశ్నిస్తే.. నిర్బంధం.. దాడులా?
- ఇందిరమ్మ రాజ్యం ఇదేనా?
- బీఆర్‌ఎస్ నేత దేవీప్రసాద్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని పోలీసు రాజ్యంగా మార్చిందని బీఆర్‌ఎస్ నేత జీ దేవీప్రసాద్ విమర్శించారు. ఇందిరమ్మ రాజ్యం అంటే నిర్బంధ పాలనేనా అని ప్రశ్నించారు. తెలంగాణలో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరిస్తామని చెప్పిన కాంగ్రెస్ తొమ్మిది నెలలుగా పోలీస్ రాజ్యాన్ని నడిపిస్తున్నదని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో గురువారం మీడియా సమావేశంలో దేవీప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ ద్వారా నిర్బంధం కొనసాగుతున్నదని అన్నారు. కాంగ్రెస్ నిర్బంధాలపై మేధావులు స్పందించాలని కోరారు. ప్రభుత్వ దవాఖానల పరిస్థితిపై



ముగ్గురితో కమిటీ వేస్తే వాళ్లను అనుమతించలేదని, ఖమ్మంలో బీఆర్‌ఎస్ నేతలపై రాళ్ల దాడి చేశారని ఆరోపించారు. బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే ఇంటిపై మరో ఎమ్మెల్యే దాడి చేశారని, ప్రశ్నించే వారిని పోలీస్‌స్టేషన్లకు తిప్పుతున్నారని మండిపడ్డారు. ధర్నాలు చేస్తే రైతులపై కేసులు పెడతామని పోలీసులు బెదిరిస్తున్నారని అన్నారు. బీఆర్‌ఎస్ సోషల్ మీడియా సిబ్బందిపై అక్రమ కేసులు పెడుతున్నారని, ఇందిరమ్మ రాజ్యం అంటే నిర్బంధ రాజ్యమా? అని నిలదీశారు. పౌరహక్కుల సంఘాల నేతలను అరెస్టులు చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ, కాంగ్రెస్ కుమ్మక్కై రాజకీయాలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగులకు 4 డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, ఉద్యోగ సంఘాల నేతలను సీఎం తొమ్మిది నెలల నుంచి కలవడం లేదని విమర్శించారు. ఉద్యోగ సంఘాల నాయకుల మధ్య చిచ్చు పెట్టే విధంగా కాంగ్రెస్ నేతలు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. హైడ్రాపై ప్రభుత్వానికి స్పష్టత లేదని, హైదరాబాద్ నగరంలో 60 శాతం ప్రజలు నిరాశ్రయులు అవుతారని చెప్పారు. రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, రేవంత్‌రెడ్డి సోదరుడికి నోటీసులు ఇచ్చి వదిలేశారని, పేదలపై మాత్రం ఉక్కుపాదం మోపుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలి

బీఆర్‌ఎస్ నేత రాకేశ్‌కుమార్

బీఆర్‌ఎస్ నేత చిరుమళ్ల రాకేశ్‌కుమార్ మాట్లాడుతూ శాసనమండలిలో ప్రతిపక్షనేత మధుసూదనాచారి నేతృత్వంలో తమిళనాడులో బీసీలకు అందుతున్న ప్రయోజనాలపై బీఆర్‌ఎస్ పార్టీ అధ్యయనం చేస్తున్నదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ హయంలో అమలైన బీసీ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకాన్ని కొనసాగించి పెండింగ్ బకాయిలు విడుదల చేయాలని కోరారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్రచారి, బీఆర్‌ఎస్ నేత గోసుల శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ భవన్‌లో చాకలి ఐలమ్మకు నివాళులర్పిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు

తెలంగాణలో దేశ్‌ముఖ్‌ల ఆనవాళ్లు

బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ):తెలంగాణలో దేశ్‌ముఖ్ ఆనవాళ్లు మళ్లీ కనిపిస్తున్నాయని బీఆర్‌ఎస్ నేత ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. విస్నూరు రామచంద్రారెడ్డి జాగిర్దారీ పాలనకు, రేవంత్‌రెడ్డి పాలనకు తేడాలేదని ధ్వజమెత్తారు.నాడు రామచంద్రారెడ్డిపై పోరాడిన చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితో నేడు రేవంత్ సర్కారుపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో గురువారం ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ సహా పలువురు బీఆర్‌ఎస్ నేతలు నివాళ్లర్పించారు.

ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, ఎమ్మెల్సీలు టీ రవీందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు జీ దేవీప్రసాద్, ఎర్రోళ్ల శ్రీనివాస్, అల్లిపురం వెంకటేశ్వర్‌రెడ్డి, చిరుమళ్ల రాకేశ్ కుమార్, కే వాసుదేవ రెడ్డి, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఉపేంద్రచారి, బీఆర్‌ఎస్ నాయకులు బొమ్మెర రామ్మూర్తి, ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్లు

- రాష్ట్రంలో అమలుకు బీఆర్‌ఎస్ పోరాటం
- స్థానిక రిజర్వేషన్లు 42% పెంచేదాకా పోరు
- చెన్నైలో బీఆర్‌ఎస్ నేతల బృందం పర్యటన
- తమిళ బీసీ వెల్ఫేర్ ఉన్నతాధికారులతో సభ్యుల భేటీ
- బీసీల అభ్యున్నతికి కేసీఆర్ అమోఘ కృషి: ఎమ్మెల్సీ మధుసూదనాచారి



తమిళనాడులో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ బీసీ నేతల బృందం సభ్యులు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): తమిళనాడు తరహాలో విద్యా, ఉద్యోగాల్లో బీసీ రిజర్వేషన్లు తెలంగాణలో సాధించేందుకు బీఆర్‌ఎస్ పార్టీ పోరాడుతుందని ఆ రాష్ట్రంలో పర్యటిస్తున్న బీఆర్‌ఎస్ పార్టీ నేతల బృందం స్పష్టం చేసింది. గురువారం చెన్నైలోని తమిళనాడు బీసీ భవన్‌లో బీసీ సంక్షేమశాఖ ఉన్నతాధికారులతో బీఆర్‌ఎస్ బృందం సమావేశమైంది. రాష్ట్రంలో రిజర్వేషన్లు, బీసీ అభివృద్ధి పథకాల తీరుతెన్నులను సుదీర్ఘంగా చర్చించింది. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వ బీసీ వెల్ఫేర్ ముఖ్య కార్యదర్శి విజయకుమార్ సారథ్యంలోని బీసీ సంక్షేమశాఖ అధికారుల బృందం బీసీ రిజర్వేషన్లపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌తో బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందానికి వివరించారు. బీసీ రిజర్వేషన్లు, వారి అభివృద్ధి, సంక్షేమం కోసం తమిళనాడులో అమలవుతున్న కార్యక్రమాల అధ్యయనం, తమిళ పార్టీల్లో బహుజనుల ప్రాతినిధ్యం వంటి పలు అంశాలను అధ్యయనం చేసేందుకు శాసనమండలిలో బీఆర్‌ఎస్ పక్ష నేత సిరికొండ మధుసూదనాచారి నేతృత్వంలోని బీఆర్‌ఎస్ పార్టీ బీసీ నేతల బృందం తమిళనాడులో పర్యటిస్తున్నది. అనంతరం బృందం సభ్యులు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధకుడు కేసీఆర్ తన పదేండ్ల పాలనలో వివిధ సందర్భాల్లో తమిళనాడు తరహా రిజర్వేషన్లు తమ రాష్ట్రంలో అమలు చేయాలని ప్రధాని మోదీని కోరిన విషయాన్ని గుర్తుచేశారు. రాజ్యసభలో బీఆర్‌ఎస్ పక్ష ఉపనేత వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రులు వీ శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, జోగు రామన్న మాట్లాడుతు తెలంగాణలో స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలయ్యేదాకా బీఆర్‌ఎస్ పోరాడుతుందని స్పష్టంచేశారు. తమిళనాడులో రిజర్వేషన్ల అమలు విషయంపై బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం ఆరా తీసింది.

ఐలమ్మ స్ఫూర్తితో బీసీ రిజర్వేషన్ల సాధన

తెలంగాణ పోరాట యోధురాలు చిట్యాల ఐలమ్మ స్ఫూర్తితోనే బీసీ రిజర్వేషన్ల సాధన కోసం పోరాడుతామని బీఆర్‌ఎస్ ప్రతినిధి బృందం సభ్యులు ప్రతినబూనారు. ఐలమ్మ జయంతి సందర్భంగా చెన్నైలో బీఆర్‌ఎస్ నేతలు ఆమెకు ఘనంగా నివాళులర్పించారు. ఆమె చిత్రపటానికి నివాళి అర్పించి ఆమె పోరాటాన్ని స్మరించుకున్నారు. ప్రతినిధి బృందంలో శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్, మాజీ ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, మాజీ ఎమ్మెల్యేలు వినయ్‌భాస్కర్, పుట్టా మధు, కోరుకంటి చందర్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ తుల ఉమ, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్లు జూలూరు గౌరీశంకర్, డాక్టర్ ఆంజనేయగౌడ్, పల్లె రవికుమార్, గెల్లు శ్రీనివాస్‌యాదవ్, నాగేందర్‌గౌడ్, రవీంద్రసింగ్, దూదిమెట్ల బాలరాజుయాదవ్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్, కిశోర్‌గౌడ్, పార్టీ సీనియర్ నేతలు దాసోజు శ్రీనివాస్, చెరుకు సుధాకర్, రాజ్యలక్ష్మి, బీసీ జనసభ అధ్యక్షుడు రాజారాం యాదవ్, విద్యార్థి సంఘం నేత దత్తాత్రేయ తదితరులు ఉన్నారు.

మరో రెండు రోజులు వర్షాలు

ఎల్లో అలర్ట్ జారీ

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): బంగాళాఖాతంలో అల్పపీడనం బలహీనపడటంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మరో రెండు రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో వానలు పడే అవకాశమున్నట్టు తెలిపింది. పలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీచేసింది. రాబోయే రెండు రోజుల్లో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుందని పేర్కొంది. గడిచిన 24 గంటల్లో ములుగు జిల్లా ఏటూరునాగారంలో అత్యధికంగా 12.25 సెం.మీ వర్షపా తం నమోదైనట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

బీసీలకు వాటా దక్కేదాకా ఉద్యమం

- సమగ్ర కులగణన చేస్తేనే బీసీలకు న్యాయం
- వివిధ పక్షాల, బీసీ సంఘాల నేతల డిమాండ్
- బీసీలంతా ఏకతాటిపైకి రావాలి: ఎమ్మెల్సీ ఎల్ రమణ



బీసీ కులాల రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రమణ

హిమాయత్‌నగర్, సెప్టెంబర్26: బీసీలకు రాజకీయ వాటా దక్కే వరకు సామాజిక ఉద్యమాన్ని కొనసాగిద్దామని వివిధ పక్షాల నేతలు పిలుపునిచ్చారు. హైదరాబాద్ నారాయణగూడలోని పద్మశాలి భవన్‌లో గురువారం 'బీసీ కులసంఘాల ఐక్యత' అనే అంశంపై రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. అఖిల భారత పద్మశాలి సంఘం రాజకీయ విభాగం జాతీయ అధ్యక్షుడు బొల్ల శివశంకర్ అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. సమగ్ర కులగణన చేపడితేనే బీసీలకు న్యాయం జరుగుతుందని వక్తలు స్పష్టం చేశారు. బీసీల్లో ఐక్యత కోసం పాటుపడాలని సూచించారు. రాష్ట్రంలోని బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి చట్టసభల్లో రిజర్వేషన్ల అమలు కోసం ఉద్యమించాలని ఎమ్మెల్సీ ఎల్ రమణ పిలుపునిచ్చారు. బీసీల అభివృద్ధి జరిగినప్పుడే దేశ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. చట్టసభల్లో బీసీల ప్రాతినిధ్యాన్ని పెంచేందుకు బీసీ సమాజాన్ని మేల్కొల్పాలని ఎంపీ ఈటల రాజేందర్ పిలుపునిచ్చారు. బీసీలు ఐక్యం కాకపోతే రాబోయే రోజుల్లో ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. బీసీ కులగణనతో పాటు చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లను సాధించడమే తన జీవిత లక్ష్యమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య తెలిపారు. తెలంగాణకు చివరి ఓసీ సీఎం రేవంత్‌రెడ్డే అవుతారని, 2028లో జరిగే ఎన్నికల్లో బీసీ సీఎం ఖావడం తథ్యమని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పునరుద్ఘాటించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్‌ను వెంటనే అమలు చేయాలని అఖిల భారత పద్మశాలీ సంఘం జాతీయ అధ్యక్షుడు కందగట్ల స్వామి కోరారు. సమావేశంలో మేధావులు, బీసీ నేతలు బీఎస్ రాములు, గడ్డం జగన్నాథం, అవ్వారి భాస్కర్, వనం దుశ్యంతల, గుజ్జ కృష్ణ, గుంటక రూపా, గుజ్జ సత్యం, బొమ్మ ప్రవళిక, రాకేశ్, బొమ్మ అమరేందర్, బిల్లా దీపిక, గుర్రం శ్రవణ్, వేముల రామకృష్ణ, ఎం భాగ్యలక్ష్మి, కేపీ మురళీకృష్ణ, అనురాధాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి నేడు

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

ఉద్యోగాల ఊచకోత

అమెరికా టెక్ జాబ్ మార్కెట్‌లో ఊచకోతలు నిత్యకృత్యమవుతున్నాయి. ఈ ఏడాది ఇప్పటివరకు టెక్ కంపెనీలు సుమారు 1,37,500 ఉద్యోగాలకు కోత విధించాయి. మరో అంచనా ప్రకారం.. ఉద్యోగాలు కోల్పోయినవారి సంఖ్య 2,15,402. ఇందులో అత్యధిక కోతలు ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో జరగడం గమనార్హం. ఏడాది కాలంలో ఉద్యోగుల తొలగింపు 98 శాతం పెరిగింది. వచ్చే ఏడాది ఖర్చుల తగ్గింపు కోసం ఈ ఏడాది ఆగస్టు 1న ఇంటెల్ కంపెనీ 15 శాతం సిబ్బందిని తొలగించింది. సిస్కో, ఐబీఎం, అమెజాన్ అదే బాటపట్టాయి. ఈ ఊచకోతలపై సామాజిక మాధ్యమాల్లో ఐటీ ఉద్యోగులు గగ్గోలు పెట్టడం మనం చూస్తున్నాం. దీంతో కంపెనీలు గుట్టు చప్పుడు కాకుండా తొలగింపులు జరిపే ఎత్తుగడలను అమలు చేస్తున్నాయి. పెద్దపెద్ద ప్రకటనలు చేయకుండా లోపల్లోపల పనితీరు సరిగా లేదనో, మరో కారణం మీదనో తొలగింపులకు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితి ఉద్యోగుల్లో ఆందోళనను, మానసిక ఒత్తిడిని పెంచుతున్నది. జీతాల పెంపు డిమాండ్లను అణచివేసేందుకు కూడా ఈ ధోరణి తోడ్పడుతున్నది. కొన్ని కంపెనీలు ఇదే అదనుగా జీతాల కోతలూ విధిస్తుండటం గమనార్హం.

అమెరికాలో ఉద్యోగాల సంక్షోభం అక్కడి జాబ్ మార్కెట్‌లో ప్రధాన వర్గమైన ఎన్నారైలకు గుదిబండగా మారింది. రెండున్నర దశాబ్దాల్లో ఇంతటి సంక్షోభం ఎన్నడూ చూడలేదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఉద్యోగాల ఊచకోతకు కారణాలను అన్వేషిస్తే పెరుగుతున్న మాంద్యం భయాలు, కంపెనీలకు ప్రాజెక్టులు తగ్గిపోవడమే మనకు ప్రధానంగా కనిపిస్తాయి. జీతాల ఖర్చు తగ్గించేందుకు పేద, మధ్యాదాయ దేశాలకు యూనిట్లను తరలించడం మరో కారణం. లేఆఫ్‌లు పెరుగుతున్న నేపథ్యంలో హెచ్-1బీలకు సైతం ఉద్యోగాలు దొరకని పరిస్థితి ఎదురవుతున్నది. ఇక లక్షలు పోసి ఎంఎస్ చదవడానికి వెళ్లిన చాలామంది సరైన ఉద్యోగాలు దొరక్క ఇబ్బందులు పడుతున్నారు. అమెరికాలో అమలయ్యే కఠిన నిబంధనలు వారిని తరుముతున్నాయి. ఈ ఏడాది చివరి నాటికి ఉద్యోగాల పరిస్థితి మరింతగా దిగజారిపోతుందని విశ్లేషకులు అంటున్నారు. ఈ పరిస్థితి అమెరికాకే పరిమితం కాలేదు. కెనడా, యూకే, జర్మనీ, స్వీడన్, ఆస్ట్రేలియా తదితర దేశాల్లో ఉద్యోగ సంక్షోభం వెంటాడుతున్నది. ప్రపంచవ్యాప్త ఉద్యోగాల కోతల్లో సింహభాగం ఈ దేశాలదే.

ఉద్యోగ కోతల కారణంగా ప్రధానంగా ఇబ్బందులు పడుతున్నది భారతీయులేనన్న సంగతి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. 'ఏ దేశమేగినా, ఎందుకాలిడినా..' అన్నట్టు ఎక్కడచూసినా మనవాళ్లే ఉండటం అందుకు ప్రధాన కారణం. డాలర్ కలలు చెదిరిపోతున్న ప్రస్తుత తరుణంలో భారత సంతతి ఉద్యోగులను ఆదుకునేందుకు కేంద్రం నిర్దుష్టమైన వ్యూహం, ఎత్తుగడలు రూపొందించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. కేవలం నినాదంగా మిగిలిపోయిన 'మేకిన్ ఇండియా'ను దుమ్ము దులిపి చిత్తశుద్ధితో అమలు చేయాల్సిన అవసరమూ ఉంది.

ఇది పట్టం కట్టుడా? మభ్యపెట్టుడా?

రెండు వారాల కిందట నూనె గింజలు, ఉల్లిపాయలు, బాస్మతి బియ్యానికి సంబంధించిన వాణిజ్య విధానాల్లో కేంద్ర ప్రభుత్వం అనేక మార్పులు చేసింది. దీనివల్ల అక్టోబర్ మాసంలో మొదలయ్యే ఖరీఫ్ పంట కాలంలో గ్రామీణ రైతాంగ ఆదాయాలు పెరుగుతాయనేది అంచనా. బాస్మతి బియ్యం తాలూకు కనీస ఎగుమతి ధర టన్నుకు 950 డాలర్లకు పైబడే ఉండాలన్న గతంలోని నిబంధనను తొలగించడం ఈ విధాన మార్పుల్లో ఒకటి. అలాగే, ఉల్లిపాయల ఎగుమతి తాలూకు కనీస ధర టన్నుకు 550 డాలర్లుగా ఉండాలన్న నిబంధనను తొలగిస్తూ, దాంతో పాటు ఉల్లి ఎగుమతులపై సుంకాన్ని 40 శాతం నుంచి 20 శాతానికి తగ్గించింది. మరో పక్కన ముడి వంటనూనెలు, శుద్ధి చేసిన వంటనూనెలపై దిగుమతి సుంకాన్ని 27.5 శాతం నుంచి 36 శాతానికి పెంచింది.



డి.పాపారావు
98661 79615



రైతాంగానికి లాభం చేకూర్చడానికే వాణిజ్య విధానాల్లో మార్పులు చేసినట్టు కేంద్ర ప్రభుత్వం చెప్తున్నది. ఉదాహరణకు బాస్మతి బియ్యంపై కనీస ఎగుమతి ధరను రద్దు చేయడంతో ఆ బియ్యం ఉత్పత్తిదారులు అంతర్జాతీయ మార్కెట్లో తక్కువ ధరను ఆఫర్ చేయడం ద్వారా పోటీని తట్టుకోగల అవకాశాన్ని కల్పించారు. అలాగే, ఉల్లిపాయల ఎగుమతి విషయంలో కూడా. ఇక ముడి, శుద్ధి చేసిన వంటనూనెల దిగుమతులపై సుంకాన్ని పెంచడం ద్వారా, దేశీయ నూనె గింజల ఎగుమతిదారులకు, తక్కువ ధరలకు దిగుమతయ్యే విదేశీ వంటనూనెల పోటీ నుంచి రక్షణ కల్పించారు. ఈ నిర్ణయాలన్నీ కచ్చితంగా ఆయా పంటలు పండించే రైతాంగానికి అనుకూలమైనవే. కాగా, ఇంతకాలం మూడు వ్యవసాయ చట్టాల వంటి రైతాంగ వ్యతిరేక నిర్ణయాలు తీసుకుంటూ రైతుకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేసేందుకు వెనుకాడిన కేంద్ర ప్రభుత్వం, నేడు ఈ రైతాంగ అనుకూల విధాన మార్పులను ఎందుకు చేసినట్టు?

దీనికి కారణం సుస్పష్టం. త్వరలో జరగనున్న 4 రాష్ర్టాల ఎన్నికలే అందుకు కారణం. అందులోనూ ముఖ్యంగా మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలు కేంద్రంలోని ఎన్డీయే సంకీర్ణ ప్రభుత్వానికి అగ్నిపరీక్ష లాంటివి. ఆ రాష్ర్టాల్లో గెలవడం బీజేపీకి అనివార్యం. గత పదేండ్ల పాలనలో తన రైతాంగ వ్యతిరేక విధానాల ద్వారా వారిని బీజేపీ దూరం చేసుకున్నది. దాని ఫలితంగానే 2024 పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీ 240 సీట్లకు పరిమితమైంది. ఒక పక్క నితీశ్, మరోపక్క చంద్రబాబుల ఊతకర్ర మద్దతుతో ప్రస్తుతం బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ మనుగడ సాగిస్తోంది. ఈ క్రమంలోనే మహారాష్ట్ర, హర్యానా ఎన్నికలు బీజేపీకి గెలిచి తీరాల్సిన అగత్యాన్ని కల్పించాయి. హర్యానాలో బీజేపీకి పూర్తిగా వ్యతిరేక పవనాలు వీస్తున్నందున అక్కడి బాస్మతి బియ్యం ఉత్పత్తిదారుల (రైతులు)ను (దేశంలో అతిపెద్ద బాస్మతి ఉత్పత్తిదారు హర్యానా కావడం గమనార్హం) బుజ్జగించడమే ఈ నిర్ణయం వెనకున్న ఉద్దేశం. ప్రస్తుతం స్థానికంగా బాస్మతి బియ్యానికి అంతగా ధర పలకడం లేదు. అందువల్ల ఆ బియ్యాన్ని 'కనీస ఎగుమతి ధర' అనే ఆటంకం లేకుండా, విదేశాలకు ఎగుమతి చేసుకొనే అవకాశాన్ని రైతులకు కల్పించారు. అదీ విషయం. ఇక, ఉల్లిపాయల విషయంలో కూడా కనీస ఎగుమతి ధర తొలగింపు.. ఎగుమతి సుంకం తగ్గింపు అనేవి దేశంలోనే ఉల్లిపాయల ప్రధాన ఉత్పత్తిదారు అయిన మహారాష్ట్ర రైతులకు లాభం చేకూరుస్తుంది. అలాగే, వంటనూనెలపై దిగుమతి సుంకం పెంచడం వల్ల మహారాష్ట్రలో సోయాబీన్ పండించే రైతాంగానికి విదేశీ పోటీ నుంచి రక్షణ ఏర్పడుతుంది.

అంతిమంగా రైతు అనుకూల విధాన నిర్ణయాల పేరిట ఎన్నికల తంతు పూర్తయ్యే వరకు రైతాంగానికి అరచేతిలో వైకుంఠం చూపించి.. ఆ తర్వాత తిరిగి కచ్చితంగా చుక్కలు చూపిస్తారు! అదీ విషయం.

రైతాంగానికి అనుకూలమైన ఈ నిర్ణయాలన్నీ 'మనసా వాచా కర్మణా' రైతాంగం మేలు కోరి తీసుకున్నవా? లేదా హర్యానా, మహారాష్ట్ర ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని తాత్కాలిక రాజకీయ లబ్ధి కోసం తీసుకున్నవా? అనే ప్రశ్న ఇప్పుడు వ్యక్తమవుతున్నది. రైతాంగ అనుకూల విధానాల ప్రకటన అనంతరం వాటివెనుకే వెలువడిన కొన్ని ప్రకటనలు.. ముక్తాయింపులను గమనిస్తే ఈ ప్రశ్నకు జవాబు దొరుకుతుంది. నిజానికి ఈ నిర్ణయాలు మార్కెట్లో మాత్రం కొంతమేర ధరల పెరుగుదలకు కారణం కాగలవనేది ఒక అంచనా. బాస్మతి బియ్యం, ఉల్లిపాయల ఎగుమతులకు అనుకూలంగా తీసుకున్న నిర్ణయాల వల్ల దేశంలో ఆ ఉత్పత్తుల లభ్యత తగ్గి, కొంతమేర ధరలు పెరగవచ్చు. అలాగే, వంటనూనెల దిగుమతులపై పెంచిన సుంకాలు కూడా దేశీయంగా వంటనూనెల సరఫరాను తగ్గించి, తద్వారా వాటి ధరల పెరుగుదలకు కారణం కాగలవు. మరి అటువంటప్పుడు, ఈ ధరల పెరుగుదల అంశం ఎన్నికలకు వెళ్లనున్న మహారాష్ట్ర, హర్యానాలలో ప్రజా వ్యతిరేకతకు కారణం కాగలదు కదా? కచ్చితంగా అవుతుంది. అందుకే ఒకపక్క రైతాంగానికి మంచి ధరలు వచ్చేలా నిర్ణయం తీసుకుంటూనే.. మరోపక్క వంటనూనెల ధరలను పెంచవద్దంటూ దేశీయ ఉత్పత్తిదారులకు, వ్యాపారులకు ప్రభుత్వ వర్గాలు విజ్ఞాపనలు చేస్తున్నట్టు సమాచారం.

దాంతోపాటు తక్కువ సుంకంతో ఇప్పటికే దిగుమతి అయిన వంటనూనెల నిల్వలు 3 మిలియన్ టన్నుల మేరకు ఉంటాయని, ఈ నిల్వలు కనీసం 45-50 రోజుల వరకు సరిపోతాయని ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. కాగా, దిగుమతి చేసుకుంటున్న వంట నూనెలపై సుంకం పెంచడం, వాటి దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకేనని ప్రభుత్వ వర్గాల వాదన. మరి, అదే నిజమైతే.. ఈ లక్ష్యాన్ని సాధించేందుకు కనీసం కొన్ని సంవత్సరాల పాటు దిగుమతులపై ఈ అధిక సుంకాల రక్షణ కవచం దేశీయ రైతాంగానికి అవసరం. తద్వారా మాత్రమే నూనె గింజల ఉత్పత్తి తమకు నికరంగా లాభసాటి అవుతుందనే భరోసాను ప్రభుత్వం రైతుకు కల్పించగలదు. కాబట్టి, దేశీయ ఉత్పత్తిని ప్రోత్సహించడం ప్రభుత్వ ప్రధాన ఉద్దేశం కచ్చితంగా కాదని అర్థమవుతున్నది.

ఎందుకంటే, ముందుగానే చెప్పుకున్నట్టుగా ప్రస్తుతం దేశంలో ఉన్న వంటనూనెల నిల్వలు 45-50 రోజుల పాటు సరిపోతాయి గనుక, ఆ ధరలను ప్రస్తుతానికి పెంచనవసరం లేదని వ్యాపారులకు, ఉత్పత్తిదారులకు విజ్ఞప్తులు చేయడం వెనుక అసలు మతలబు ఏమిటి? సూక్ష్మంగా గమనిస్తే.. దీని వెనకున్న మతలబు ఒకటే. అదేమిటంటే.. రానున్న 45-50 రోజులలోగా హర్యానా, మహారాష్ట్రలలో ఎన్నికల ప్రక్రియ ముగిసిపోతుంది. కాబట్టి, ఈలోగా అటు రైతులకు మంచి ధర ఆశ చూపి వారి ఓట్లను కొల్లగొట్టడం, మరోపక్క ఉత్పత్తిదారులు, వ్యాపారులను బతిమిలాడో, బెదిరించో ధర పెరగకుండా నిలువరించి వినియోగదారులు ఆగ్రహానికి గురికాకుండా చూసుకొని మొత్తానికి ఈ ఎన్నికల్లో గట్టెక్కడం బీజేపీ అసలు వ్యూహం.

ఈ కారణం వల్లే ఒక వాణిజ్య పత్రిక కూడా తన కథనంలో బహుశా ఈ విధానాలు తాత్కాలికమే కావచ్చనే ముక్తాయింపును ఇచ్చింది. అదీ విషయం! అలాగే దిగుమతి సుంకాలు తగ్గే వరకు వంట నూనెల ధరలు పెంచొద్దని తయారీ కంపెనీలను ప్రభుత్వం విజ్ఞప్తి చేసిందని మరో వాణిజ్య పత్రిక సెలవిచ్చింది. దీని సారాంశం ఒకటే..! వంటనూనెల దిగుమతులపై సుంకాన్ని పెంచి దేశీయ ఉత్పత్తిదారులకు లబ్ధిని చేకూర్చే ఈ నిర్ణయం కేవలం మూన్నాళ్ల ముచ్చటే! అదీ కథ.

అలాగే, ఉల్లిపాయల ఎగుమతులకు మెరుగైన అవకాశాన్ని కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం కూడా అటువంటిదే. అయితే ఈ నిర్ణయం వల్ల ఇప్పటికే ఉల్లి ధర భారీగా పెరగడం మొదలైంది. కాకపోతే, ప్రభుత్వం వద్ద ఉల్లి నిల్వలు సరిపడా ఉన్నాయి. గనుక వాటిని మార్కెట్లోకి విడుదల చేసి ధరల పెరుగుదలను నియంత్రించే అవకాశం ప్రభుత్వం చేతిలో ఉన్నది. ఎన్నికల అనంతరం ఈ విషయంలో కూడా విధాన నిర్ణయం తిరగదోడే అవకాశమే అధికం.

అంతిమంగా రైతు అనుకూల విధాన నిర్ణయాల పేరిట ఎన్నికల తంతు పూర్తయ్యేవరకు రైతాంగానికి అరచేతిలో వైకుంఠం చూపించి.. ఆ తర్వాత తిరిగి కచ్చితంగా చుక్కలు చూపిస్తారు! అదీ విషయం. 'ఏక్ దిన్ కా సుల్తాన్'గా ప్రస్తుతం రైతాంగానికి పెద్దపీట వేసి పట్టాభిషేకం చేస్తున్నారు. తర్వాతి కథ మామూలే. 'ఏరు దాటే దాకా ఓడ మల్లన్న.. దాటాక...' ఇక చెప్పనవసరం లేదనుకుంట. పార్లమెంట్ ఎన్నికల్లో చావుదెబ్బ తిన్నాక రైతాంగాన్ని విస్మరించి, అధికారాన్ని కాపాడుకోలేమని బీజేపీ గ్రహించింది. అందుకే, నేడు భోళాశంకరుడైన రైతుకు, రైతాంగ సమస్యలకు శాశ్వత పరిష్కారమైన కనీస మద్దతు ధరకు చట్టబద్ధతను కల్పించే బదులుగా మభ్యపెట్టేందుకు పడరాని పాట్లు పడుతున్నది.

(వ్యాసకర్త: ఆర్థికరంగ నిపుణులు)

ఏరుదాటాక బోడ మల్లన్న!

ఎన్నికల ఏరు దాటాక నిస్సిగ్గుగా, హామీల తెప్పను తగలేస్తున్నవారిలో మోదీ, చంద్రబాబు, రేవంత్ వగైరాలను అగ్రగణ్యులుగా చెప్పకుంటూ ప్రజలు వాపోతున్నారు. చేతులు కాలాక ఆకులను పట్టుకోవడమంటే ఇదే మరి. ఇచ్చిన హామీలను చెప్పిన సమయంలోపు నెరవేర్చని పాలకులను గద్దె దించే హక్కును ప్రజలకిచ్చే చట్టం రానంతవరకు చీటింగ్ నేతల హవా కొనసాగుతూనే ఉంటుంది. ఎందుకంటే, భారతీయ/మానవీయ సంస్కృతి చీటింగ్‌ను నేరంగా, చీటర్స్‌ను నేరస్థులుగా పరిగణిస్తుంది. కానీ, ప్రపంచీకరణ, కార్పొరేటీకరణ సంస్కృతి 'చీటింగ్'ను 'టాలెంట్'గా, 'చీటర్స్'ను నిపుణులుగా భావిస్తున్నది. అందువల్లనే చీటింగ్ (అబద్ధాల హామీలు)తో గద్దెనెక్కిన సదరు నేతలు, కార్పొరేట్ మీడియా అండతో 'విజనరీ నేతలు'గా చెలామణి కాగలుగుతున్నారు.



పాతూరి వేంకటేశ్వరరావు
98490 81889

భావోద్వేగాలతో మైకం కమ్మించి మెజారిటీ ఓటర్లను సమీకరించుకునేందుకు మోదీకి, బాబుకు, రేవంత్‌కు రకరకాల సమ్మోహనాస్త్రాలు ఉన్నాయి. కాబట్టి ప్రజలు వాళ్ల పాలనా అనుభవాలను గుర్తుంచుకొని, ఇకనుంచైనా, ఆకర్షణీయ హామీలకు, కుల, మత, భావోద్వేగాలకు లోనుకాకుండా సంయమనం పాటించాలి. గత, ప్రస్తుత ప్రభుత్వాలను, నేతలను బేరీజు వేసుకొని మీడియా, సోషల్ మీడియాలతో కాకుండా సొంత బుద్ధితో, స్వానుభవంతో 'ప్రోగ్రెసివ్ పార్టీ'ని, ప్లానింగ్ నేతలను గుర్తించి ఎన్నుకోవటమే ప్రజలకు శ్రీరామరక్ష.

కార్పొరేట్ మీడియాకు సామాన్య ప్రజలు ప్రభావితులై అపమార్గం పట్టకుండా, వాళ్లకు సరైన దిశానిర్దేశం చేయాల్సిన సామాజిక కర్తవ్యాన్ని ఉపాధ్యాయులు, ఉద్యోగులు, మేధావులు, విస్మరించకుందురుగాక. ఎందుకంటే, 'నంది'ని, 'పంది'గా – 'పంది'ని, 'నంది'గా చేయగలిగినంత శక్తిమంతమైనది మీడియా! అందుకు నిదర్శనాలు 1.మీడియా అండతోనే, చేరదీసిన ఎన్టీఆర్‌ను నెట్టేసి సీఎం కాగలిగాడు చంద్రబాబు. 2.మీడియా అండ లేనందువల్లనే చేరదీసిన జయలలితను ఆస్పత్రి పాలుచేసినా సీఎం కాలేకపోయింది శశికళ. 3.అతి స్వల్పకాలంలో అనన్య సామాన్యమైన అభివృద్ధిని సాధించిన 'ప్రోగ్రెసివ్ పార్టీ బీఆర్‌ఎస్' మీడియా, సోషల్ మీడియాలను తేలికగా తీసుకున్నందునే ఓటమి పాలైంది. 4. కనీసం మంత్రి కూడా కాని రేవంత్‌రెడ్డి మీడియా, సోషల్ మీడియాల అండదండలతోనే ఏకంగా ముఖ్యమంత్రి కాగలిగాడు.

సీఎం రేవంత్ వాగ్దానాలను ఒకసారి చూద్దాం. 1.గత ప్రభుత్వం తెలంగాణను అప్పుల పాల్జేసిందని, తమకు అధికారం కట్టబెడితే తెలంగాణను ప్రగతిపథాన పరుగెత్తిస్తానని రేవంత్ అన్నాడు. కానీ, కొన్ని నెలల్లోనే, రూ.70 వేల కోట్ల అప్పుల కుప్పను ఆయన ప్రజల నెత్తిన పెట్టాడు. 2. తనను గెలిపిస్తే, ఆరు గ్యారెంటీలు, 60 హామీలతో పాటు, ఏక్ దమ్మున ప్రతి రైతుకు రూ.2 లక్షల రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చాడు. 3.కౌలు రైతులతో సహా అందరికీ రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇస్తానని చెప్పాడు. 4.అప్పులేని రైతులు, గతంలో రుణమాఫీ అయిన రైతులు గూడ, ఇప్పటికిప్పుడు బ్యాంకులకు వెళ్లి రూ.2 లక్షలు తెచ్చుకోవాలని, ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే రుణాలన్నీ మాఫీ చేస్తానని వాగ్దానం చేశాడు.



షరతులు లేని రుణమాఫీ హామీనిచ్చి గద్దెనెక్కిన రేవంత్.. రూ.49 వేల కోట్ల రుణాలను, షరతులతో రూ.31 వేల కోట్లకు కుదించి, రూ.17 వేల కోట్లతో చేతులు దులుపుకొన్నాడు. వానకాలపు పంట సీజన్ అయిపోతున్నది. రైతుబంధు లేదు, ఫ్రీ బస్ తప్ప 60 హామీల జాడలేదు, అమలు కోసం నిలదీస్తున్న ప్రజల దృష్టిని మళ్లించడానికి ఇదిగో ప్రజాపాలన శ్వేత పత్రం, కాళేశ్వరం, ఫోన్ ట్యాపింగ్ అంటూ ప్రచార ఆర్భాటం చేస్తున్నాడు. ఏపీలోనూ సేమ్ టూ సేమ్. చంద్రబాబు ఏకంగా తిరుపతి లడ్డూ పేరిట ప్రజల దృష్టిని మళ్లిస్తున్నాడు.

చంద్రబాబు తనవాళ్ల భూముల అభివృద్ధి కోసం హైటెక్ సిటీని అభివృద్ధి చేసుకున్నట్టే.. తన వాళ్ల భూముల విలువ పెంచేందుకు రేవంత్ ఫోర్త్ సిటీని డెవలప్ చేసుకుంటున్నాడనీ, మద్దతు కోసమే అనుకూల జర్నలిస్టులకు అక్కడ ఇండ్ల స్థలాలు కేటాయిస్తున్నాడనీ చాలామంది అంటున్నారు. హైడ్రా పేరిట సామాన్యుల ఇండ్లను కూల్చుతూ, బడాబాబులను నోటీసులతో భయపెడుతూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఆ బెదిరింపుతోనే బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను లాగేసుకుంటున్నాడనీ ఆబాలగోపాలం గగ్గోలు పెడుతున్నది. రాష్ట్ర, దేశ ప్రజలెంత గగ్గోలు పెట్టినా, ఎన్ని శాపనార్థాలు పెట్టినా, ఈ రాష్ట్రం, దేశం మరింత అప్పులపాలవటం తప్ప ఐదేండ్ల దాకా తమకు ఢోకా లేదని సదరు నేతలకు తెలుసు. వాళ్ల ధీమాకు, దూకుడుకు కారణమదే మరి. ప్రపంచీకరణ సంస్కృతి ప్రవాహంలో కొట్టుకుపోతున్న మోదీ, బాబు, రేవంత్ వగైరాలకు రాజకీయ లాభ దృక్పథమే తప్ప మానవీయ కోణం బొత్తిగా ఉండదు. పేదలు, అన్నదాతల పట్ల వాళ్ల వైఖరే అందుకు నిదర్శనం.

కానీ వాస్తవమేమంటే... అందరి ప్రాణాలకు ఆధారం అన్నం. అన్నాన్ని పండించి అందర్ని బతికిస్తున్నది అన్నదాత. ఆ అన్నదాత కన్నీరు దేశానికి అరిష్టం. అన్నదాతల ఆత్మహత్యలు మానవజాతికే అవమానం. ఈ వాస్తవాన్ని గుర్తించిన నేతల్లో కేసీఆర్ కూడా ఒకరు. అందుకే గద్దెనెక్కిన వెంటనే మిషన్ కాకతీయ, వ్యవసాయానికి నిరంతర విద్యుత్తు, రైతుబంధు– రైతుబీమా వగైరాలతో అన్నదాతలకు కొండంత భరోసాను కలిగించారు. తద్వారా తొమ్మిదేండ్లలో ఆకలి తెలంగాణను 'అన్నపూర్ణ'గా, భారత ధాన్యాగారంగా రూపొందించారు. అంతేకాదు, ప్రపంచంలోని వ్యవసాయాధారిత దేశాల అభివృద్ధి మార్గాలను అధ్యయనం చేస్తూ, స్వామినాథన్ వంటి సుప్రసిద్ధ వ్యవసాయ శాస్త్రవేత్తల సహకారంతో, తెలంగాణ ప్రగతి సాధనకు తనదంటూ ఒక ప్రణాళికను రూపొందించుకున్నారు కేసీఆర్. అదే 'వ్యవసాయాధారిత తెలంగాణ సర్వతోముఖాభివృద్ధి ప్రణాళిక'. ఈ ప్రణాళికతోనే రష్యాను స్టాలిన్, చైనాను డెంగ్ సియావో పింగ్ అమెరికాకు దీటైన అగ్రరాజ్యాలుగా రూపొందించారు. అలాగే తెలంగాణను భారతాగ్ర రాష్ర్టాల్లో ఒకటిగా కేసీఆర్ తీర్చిదిద్దారు. దటీజ్ కేసీఆర్.

అందువల్లనే దేశవ్యాప్తంగా సామాజిక స్పృహ గల మేధావులంతా 'ది ప్రోగ్రెసివ్ పార్టీ బీఆర్‌ఎస్', 'ది బెస్ట్ ప్లానింగ్ లీడర్ కేసీఆర్' అంటూ ప్రశంసలు కురిపించారు. భారతీయ అన్నదాతలంతా 'దేశ్‌కీ నేత కేసీఆర్' అంటూ ఆత్మీయంగా స్వాగతించారు. కానీ, పరిస్థితి మారింది. 'అభాండాల, అబద్ధాల వాగ్దాన కర్ణుని హామీలకు ఆశపడి, తినే అన్నం పళ్లెంలో చేతులు కడుక్కున్న దురదృష్టవంతులం' అంటూ తెలంగాణ ప్రజలు నేడు వాపోతున్నారు.

ప్రస్తుతం కష్టాల్లో కూరుకుపోయిన అన్నదాతలతో సహా వివిధ రంగాల తెలంగాణ ప్రజలకు అండగా నిలుస్తున్న ఏకైక పార్టీ బీఆర్‌ఎస్ మాత్రమే. 1.కార్మికులు, కర్షకుల కోసం పోరాడే కమ్యూనిస్టులను ముందుచూపుతో లోబరుచుకుంది రేవంత్ ప్రభుత్వం. అందుకే కనీసం నోరు మెదుపలేకపోతున్నారు కమ్యూనిస్టులు. 2.ఇక బీజేపీని సవాలు చేసే సత్తా గల కేసీఆర్, కేటీఆర్, కేజ్రీవాల్ వగైరాలను తొక్కేయాలన్నదే మోదీ ఆంతర్యం. అందుకే గత ఎన్నికల్లో తానోడి, పరోక్షంగా రేవంత్ గెలుపునకు కృషిచేసింది బీజేపీ. ఇప్పటికీ ప్రత్యక్షంగా చంద్రబాబుతో, పరోక్షంగా రేవంత్‌తో రాజకీయ వ్యాపారం చేస్తున్నది బీజేపీ.

తెలంగాణలో రేవంత్, ఏపీలో బాబు ఏం చేస్తున్నా బీజేపీ మౌనంగా ఉండటమే అందుకు నిదర్శనం. 3.జాతీయ కాంగ్రెస్‌కు భిన్నంగా రేవంత్ అదానీని చేరదీసినా కాంగ్రెస్ మ్యానిఫెస్టోకు భిన్నంగా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలను లాగేసుకుంటున్నా, హైడ్రాతో సామాన్య ప్రజలతో హాహాకారాలు పెట్టిస్తున్నా సరే, కాంగ్రెస్ అధిష్ఠానం చేష్టలుడిగి చూస్తున్నది. ఉత్తర భారతాన ఎన్నికల కోసం కాంగ్రెస్‌కు నిధులను రేవంత్ సమకూర్చుతుండటమే అందుకు కారణం. ప్రస్తుత దురదృష్టకర పరిస్థితికి తల్లడిల్లిపోతున్న అన్నదాతలతో సహా వివిధ వర్గాల ప్రజలందరికీ ఆశాజ్యోతిలా కనిపిస్తున్నది బీఆర్‌ఎస్. అందుకే బీఆర్‌ఎస్‌ను మరింత బలోపేతం చేసుకోవటమే తెలంగాణ ప్రజల ముందున్న ఏకైక పరిష్కారం.


(వ్యాసకర్త: సీనియర్ జర్నలిస్టు)

ప్రపంచ వాణిజ్యంలో పర్యాటకరంగం ఎంతో కీలకమైనది. కొన్ని దేశాల ఆర్థికవ్యవస్థలు పూర్తిగా పర్యాటకరంగంపైనే ఆధారపడి ఉన్నాయి. ఈ రంగం ద్వారానే పలు దేశాలకు విదేశీ మారక ద్రవ్యం కూడా సమకూరుతున్నది. అయితే, గత కొన్నేండ్లుగా ప్రపంచవ్యాప్తంగా పర్యాటకం తన స్థాయిని మార్చుకుంటున్నది. ఒకప్పుడు పర్యాటకం ఒక విలాసం కాగా.. ఇప్పుడు అది నిత్యావసరం. ప్రజల జీవన స్థాయిల్లో వచ్చిన మార్పులే అందుకు ప్రధాన కారణం.

పర్యాటకం.. దేశాభివృద్ధికి ఊతం



డాక్టర్ రామకృష్ణ బండారు
79057 51940



నేటి సమాజంలో మనిషి నిత్యం ఎన్నో సమస్యలు, ఆలోచనలు, ఒత్తిడితో కూడుకున్న జీవితాన్ని గడుపుతున్నాడు. ముఖ్యంగా బ్యాంకింగ్, ఫైనాన్స్, బీమా, ఐటీ వంటి రంగాల్లో పనిచేసేవారి జీవితం ఎంతో ఒత్తిడితో కూడుకున్నది. అందుకే, అలాంటివారు ఒత్తిడి, సమస్యలకు దూరంగా ఏదో ఒక ప్రదేశానికి వెళ్లి సేద తీరుతున్నారు. గత కొన్నేండ్లుగా పర్యాటక రంగంలో నమోదవుతున్న వృద్ధే అందుకు నిదర్శనం.

వరల్డ్ బ్యాంకు డేటా ప్రకారం.. 1995లో ప్రపంచవ్యాప్తంగా పర్యాటకుల సంఖ్య 1.08 బిలియన్లు ఉండగా.. 2019 నాటికి అది 2.4 బిలియన్లకు చేరుకున్నది. ఇక ఆదాయపరంగానూ పర్యాటకరంగం ముందంజలో ఉన్నది. 1995లో ప్రపంచవ్యాప్తంగా పర్యాటక ఆదాయం 427.57 బిలియన్ డాలర్లు కాగా.. 2019 నాటికి అది 1.47 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ప్రపంచ పర్యాటక, ప్రయాణ మండలి ప్రకారం.. 1995లో ప్రపంచ స్థూల జాతీయోత్పత్తిలో ట్రావెల్ అండ్ టూరిజం రంగం వాటా సుమారు 1.5 శాతం ఉండగా అది 2019 నాటికి 10.3 శాతానికి చేరుకున్నది. 2019 నాటికి ప్రపంచవ్యాప్తంగా సుమారు 330 మిలియన్ల మందికి పర్యాటకరంగంలో ఉపాధి లభించింది. ప్రతీ పది మందిలో ఒకరు పర్యాటకరంగంలో ఉపాధి పొందుతున్నవారే. ఇక పెట్టుబడుల విషయానికి వస్తే.. 2010లో ఈ రంగంలో సుమారు 754.6 బిలియన్ డాలర్ల పెట్టుబడుల ప్రవాహం ఉండగా.. అది 2019 నాటికి 1.1 ట్రిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇది మొత్తం ప్రపంచవ్యాప్తంగా అన్నిరంగాల పెట్టుబడుల ప్రవాహంలో 4.5 శాతం. ఈ గణాంకాలు చాలు పర్యాటకరంగం ప్రాముఖ్యాన్ని చెప్పడానికి. ఇక, మన దేశంలోనూ పర్యాటకరంగం చాలా కీలకమైనది. 2001లో విదేశీ పర్యాటకుల రాక కేవలం 2.54 మిలియన్లు ఉండగా అది 2019 నాటికి 10.93 మిలియన్లకు చేరుకున్నది. అదేవిధంగా, విదేశీ మారక ద్రవ్యం 2001లో 3,198 మిలియన్ డాలర్లు రాగా.. 2019 నాటికి అది సుమారు 30,058 మిలియన్ డాలర్లకు చేరుకున్నది.

2019 వరకు దూసుకుపోయిన పర్యాటకరంగం కరోనా మహమ్మారి కారణంగా దారుణంగా దెబ్బతిన్నది. మన దేశంతో పాటు, ప్రపంచవ్యాప్తంగా టూరిజం, ట్రావెల్ సంస్థలు ఎన్నడూ లేని గడ్డు పరిస్థితిని ఎదుర్కొన్నాయి. ప్రత్యక్షంగా, పరోక్షంగా ఈ రంగంపై ఆధారపడిన లక్షల మంది రోడ్డునపడ్డారు. పర్యాటకానికి అనుబంధంగా ఉన్న హోటల్, ట్రావెల్, ఇతర సంస్థలు నష్టపోయాయి.

అయితే, 2021 నుంచి పర్యాటకరంగం గాడిన పడుతున్నది. ప్రపంచవ్యాప్తంగా టూరిజం పరుగులు పెడుతున్నది. వరల్డ్ టూరిజం బారోమీటర్-2024 నివేదిక ప్రకారం.. అంతర్జాతీయ పర్యాటకుల సంఖ్య 2020లో 407 మిలియన్లు, 2021లో 457 మిలియన్లు, 2022లో 960 మిలియన్లు, 2023లో 1286 మిలియన్లకు చేరుకున్నది. కానీ, 2019కి ముందర వృద్ధితో పోలిస్తే ఇది చాలా తక్కువ. ఇక అంతర్జాతీయ పర్యాటక ఆదాయం కూడా 2020లో 558 బిలియన్ డాలర్లు, 2021లో 638 బిలియన్ డాలర్లు, 2022లో 1120 బిలియన్ డాలర్లు, 2023లో 1380 బిలియన్ డాలర్లకు ఎగబాకింది. ఇక భారత్ విషయానికి వస్తే.. 2020లో 2.74 మిలియన్లు, 2021లో 1.52 మిలియన్ల మంది విదేశీ పర్యాటకులే వచ్చారు. ఆ తర్వాత 2022లో 6.44 మిలియన్లు, 2023లో 9.2 మిలియన్లకు ఈ సంఖ్య చేరుకోవడంతో పర్యాటకం తిరిగి పట్టాలెక్కింది. విదేశీ మారక ఆదాయంలోనూ 2020లో 50,136 కోట్ల నుంచి 2023 నాటికి సుమారుగా 1,75,000 కోట్లకు చేరుకున్నది.

కరోనా తర్వాత భారత్‌లో పర్యాటక రంగం గాడినపడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకున్నాయి. 2022లో స్వదేశ్ దర్శన్ పథకం కింద 71 ప్రాజెక్టుల అభివృద్ధి కోసం రూ.5,500 కోట్లను కేంద్రం కేటాయించింది. 500కు పైగా పర్యాటక ప్రదేశాల్లో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచింది. హెరిటేజ్ సర్క్యూట్ థీమ్ కింద 10 కొత్త ప్రాజెక్టులను మంజూరు చేసింది.

పర్యాటకం అంటే కేవలం అందమైన ప్రదేశాలు చూడటమే కాదు. వైద్యం, విద్య, వ్యాపార అవసరాలు, విశ్రాంతి తీసుకోవడానికి వివిధ ప్రాంతాలకు వెళ్లేవారిని కూడా పర్యాటకులనే అంటారు. ఇప్పటికే హెల్త్ టూరిజంలో భారత్ ప్రపంచంలోనే 5వ స్థానంలో ఉన్నది. 2023లో భారత హెల్త్ టూరిజం మార్కెట్ 6.79 బిలియన్ డాలర్లకు చేరుకున్నది. ఇలా పర్యాటకం ద్వారా సమకూరే విదేశీ మారక ద్రవ్యం వల్ల రూపాయి బలపడుతున్నది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చర్యల వల్ల పర్యాటకం, దాని అనుబంధ రంగాలు వృద్ధి చెందుతూ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నాయి.

(వ్యాసకర్త: అసిస్టెంట్ ప్రొఫెసర్, సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కేరళ)

(నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం)


క్వీన్ సిటీస్ స్కామ్.. సేమ్ టు సేమ్


- కర్ణాటకలో కొత్త సిటీకి కాంగ్రెస్ శ్రీకారం
- 5,800 ఎకరాల విస్తీర్ణంలో నగర నిర్మాణం
- వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో ఫండింగ్ కోసమా?
- 'క్విన్' సిటీని పోలినట్టే 'ఫోర్త్' సిటీ నిర్మాణం

పక్కపక్కనే ఉండే రాష్ట్రాలవి.
దేశ జీడీపీలో వాటిదే అగ్రస్థానం.
రెండింట్లోనూ కాంగ్రెస్‌దే అధికారం.
ఇంకేముంది..?!
ఢిల్లీలోని కాంగ్రెస్ పెద్దల
కన్ను వీటిపై పడింది.
ఏ రాష్ట్రాల్లో ఎన్నికలు జరిగినా ఇక్కడి నుంచే
సూట్‌కేసులు రావాలి.
చిన్న ప్రాజెక్టులతో ముట్టేది కొంతే.. అందుకే
భారీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులు కావాలి.
అందుకే.. ఏకంగా కొత్త సిటీనే నిర్మిస్తే
అయిపోలా?? అనుకొన్నారు
పేరుకు పేరు.. డబ్బుకు డబ్బు..!
ఆలోచన వచ్చిందే తడువుగా.. తొలుత
అధికారంలోకి వచ్చిన కర్ణాటక సీఎంకు
మతలబు అందించారు.
అదే ఫార్ములాను తెలంగాణలోనూ అమలు
చేయమని ఇక్కడా ఆదేశించారు.
అధిష్ఠానం ఆదేశాలతో.. కర్ణాటకలో 'క్విన్'
సిటీకి, తెలంగాణలో 'ఫోర్త్' సిటీకి
అంకురార్పణ జరిగింది.
ఇక్కడ మరో గమ్మత్తైన విషయమేమంటంటే..
రెండు సిటీలకు ఒకటే బ్లూప్రింట్..! అదీ
అధిష్ఠానం డైరెక్షన్‌లోనే..!

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

బెంగళూరు, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): కర్ణాటక రాజధాని బెంగళూరు శివారుల్లో క్విన్ సిటీ (నాలెడ్జ్, వెల్‌బీయింగ్ అండ్ ఇన్నోవేషన్ సిటీ) పేరిట సిద్ధరామయ్య సర్కారు గురువారం కొత్త నగరానికి శ్రీకారం చుట్టింది. బెంగళూరుకు ఉత్తరదిశగా ఉన్న దొడ్డబల్లాపూర్ ప్రాంతాల్లో 5,800 ఎకరాల విస్తీర్ణంలో ఈ సిటీని నిర్మించనున్నారు. 'క్విన్ సిటీతో రాష్ట్రాభివృద్ధితో పాటు, పరిశ్రమలకు కావాల్సిన కొత్త పరిశోధనలకు ఊతం లభిస్తుంది. ఏఐ, బయోటెక్నాలజీ తదితర వినూత్న రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయి' అని సీఎం సిద్ధరామయ్య ఆశాభావం వ్యక్తం చేశారు. తొలి దశలో భాగంగా వచ్చే మూడేండ్లలో పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యంతో 2 వేల ఎకరాల్లో సిటీ నిర్మాణాన్ని చేపడుతామని చెప్పారు.





హైదరాబాద్‌లో శివారులో ప్రతిపాదిత ఫోర్త్ సిటీ.. కర్ణాటకలోని ప్రతిపాదిత క్విన్ సిటీ మధ్య పోలికలు

ఆ సిటీని రద్దు చేసి..

కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం క్విన్ సిటీ పేరిట పెద్దఎత్తున భూ పందేరానికి తెగబడుతున్నదని స్థానికులు ఆరోపిస్తున్నారు. గత ప్రభుత్వం ఇదే ప్రాంతంలో హెల్త్ సిటీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని రద్దు చేసినట్టు గుర్తు చేశారు. దీంతో 'హెల్త్ సిటీ' నిర్మాణ ప్రతిపాదనలు ఉన్న దబాస్‌పేట, దొడ్డబల్లాపూర్ తదితర ప్రాంతాల్లో భూముల విలువ అమాంతం పడిపోయిందని, ఇదే అదునుగా అధికార పార్టీ నేతలు చవగ్గా మెజారిటీ భూములను కొనుగోలు చేసినట్టు స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇది జరిగిన ఆరునెలలకు మళ్లీ 'క్విన్' సిటీ పేరిట ప్రభుత్వం ప్రకటన వెలువరించిందని, దీంతో భూముల ధరలు అమాంతం పెరిగాయని మండిపడ్డారు. అంతిమంగా తామే నష్టపోయామని పలువురు గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, గతంలో 'ఖీర్' సిటీ (నాలెడ్జ్, హెల్త్, ఇన్నోవేషన్, రీసెర్చ్ సిటీ) పేరిట ప్రతిపాదనలు ఉన్నమాట వాస్తవమేనని, అయితే, ఆ పేరునే తాము 'క్విన్' సిటీగా మార్చామని ప్రభుత్వవర్గాలు చెప్తున్నాయి.

ఒకేవిధంగా నిర్మాణాలు

బెంగళూరు శివారుల్లో నిర్మిస్తున్న 'క్విన్' సిటీని అనుకరిస్తూనే హైదరాబాద్ శివారుల్లో 'ఫోర్త్' సిటీ నిర్మాణ ప్రతిపాదనలు చేశారా? అంటే అవుననే సమాధానాలు వినిపిస్తున్నాయి. బెంగళూరు ప్రధాన నగరానికి 56 కిలోమీటర్ల దూరంలోని దొడ్డబల్లాపూర్ పరిసర ప్రాంతాల్లో క్విన్ సిటీని ప్రతిపాదించగా, హైదరాబాద్‌కు 57 కిలోమీటర్ల దూరంలో కందకూరు సమీపంలో 'ఫోర్త్' సిటీ నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. బెంగళూరు నగరంలోని కెంపెగౌడ ఎయిర్‌పోర్ట్‌కు 'క్విన్' సిటీ 33 కిలోమీటర్ల దూరంలో ఉంటే, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు 'ఫోర్త్' సిటీ 37 కిలోమీటర్ల దూరంలో ఉన్నది. 'క్విన్' సిటీకి మెట్రో, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లను రవాణా సదుపాయాలుగా ప్రతిపాదించగా, 'ఫోర్త్' సిటీకి కూడా మెట్రో, గ్రీన్‌ఫీల్డ్ రోడ్లనే సెలెక్ట్ చేశారు. ఈ రెండు సిటీల్లోనూ ఏఐ వర్సిటీ కామన్‌గా ఉండటం గమనార్హం. 'క్విన్' సిటీ కోసం దబాస్‌పేట, దొడ్డబల్లాపూర్ మధ్య ఏర్పాటు చేయబోతున్న శాటిలైట్ ఆర్‌ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చినట్టే, హైదరాబాద్ చుట్టూరా నిర్మించతలపెట్టిన ఆర్‌ఆర్‌ఆర్ (రీజినల్ రింగ్ రోడ్డు) అలైన్‌మెంట్‌ను ఉద్దేశపూర్వకంగా పెంచారు. కర్ణాటకలో 'హెల్త్' సిటీని రద్దు చేసి 'క్విన్' సిటీని తీసుకొస్తున్నట్టే.. ఇక్కడ 'ఫార్మా' సిటీని రద్దు చేసి 'ఫోర్త్' సిటీని తీసుకొస్తున్నారు.

రెండు సిటీల్లోనూ పెద్ద స్కామ్

'క్విన్' సిటీ నిర్మాణం చేపడుతున్నామని కాంగ్రెస్‌కు చెందిన కొందరు నాయకులు దబాస్‌పేట, దొడ్డబల్లాపూర్ తదితర ప్రాంతాల్లో భూమాయాజాలానికి తెగబడుతున్నారు. రైతుల నుంచి అప్పటికే అగ్గువకు సొంతం చేసుకొన్న విలువైన భూముల్లో క్రయవిక్రయాలు, నిర్మాణాలు జరిపి వేలకోట్లు దండుకొంటున్నారు. ఇక, 'ఫోర్త్' సిటీ నిర్మాణం పేరిట హైదరాబాద్ శివారుల్లోని కందుకూరు, మచ్చర్ల, తుక్కుగూడ మొదలు యాచారం వరకూ వేల కోట్ల విలువైన భూదందా కొనసాగుతున్నది. 'ఫ్యూచర్' పేరిట ఇన్‌సైడ్ ట్రేడింగ్ నిత్యకృత్యంగా మారింది. ప్రతీ రోజూ కోట్ల రూపాయలు చేతులు మారుతున్నాయి.

కొత్త సిటీల నిర్మాణాలు ఎందుకు?

కొద్దిరోజుల్లో మహారాష్ట్ర, జార్ఖండ్, హర్యానా అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్నాయి. వచ్చేఏడాది ఢిల్లీ, బీహార్‌లో, ఆ మరుసటి ఏడాది బెంగాల్, తమిళనాడు, కేరళ అసెంబ్లీలకు ఎన్నికలు జరుగనున్నాయి. అయితే, కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కర్ణాటక, తెలంగాణ, హిమాచల్ ప్రదేశ్ మినహా మరేఇతర రాష్ట్రంలో సొంతంగా అధికారంలో లేదు. హిమాచల్ ఆర్థిక పరిస్థితి, రెవెన్యూ రాబడులు అంతంత మాత్రమే. దీంతో తలసరి ఆదాయంలో, పారిశ్రామిక ప్రగతి, జీఎస్డీపీలో స్వావలంబన సాధించిన తెలంగాణ, కర్ణాటకను కాంగ్రెస్ అధిష్ఠానం బంగారుబాతులుగా మార్చుకొన్నట్టు వాదనలు వినిపిస్తున్నాయి. చిన్న ప్రాజెక్టులతో పోలిస్తే, భారీ ఇన్‌ఫ్రా ప్రాజెక్టులతో ఆర్థికలబ్ధి ఉంటుందని భావించిన ఢిల్లీ పెద్దలు.. తొలుత కర్ణాటకలో, ఆ తర్వాత తెలంగాణలో కొత్త సిటీల నిర్మాణానికి ఆదేశాలు ఇచ్చినట్టు తెలిసింది.

ఫోర్త్ సిటీ.. 'ఫ్యూచర్' ట్రేడింగ్!

అది ఉత్తరం.. ఇది దక్షిణం అందుకే!

బెంగళూరుకు 'క్విన్' సిటీ ఉత్తర దిశగా ఉన్నట్టే, హైదరాబాద్‌కు కూడా 'ఫోర్త్' సిటీని ఉత్తర దిశగానే నిర్మించాలని తొలుత ఢిల్లీ పెద్దలు రాష్ట్ర కాంగ్రెస్‌కు ఆదేశాలు ఇచ్చారట. హైదరాబాద్‌కు ఉత్తరాన కంటోన్మెంట్, హకీంపేట ప్రాంతాల్లోని మెజారిటీ భూములు రక్షణ శాఖ ఆధీనంలో ఉన్నట్టు రాష్ట్ర నాయకులు ఢిల్లీ పెద్దల దృష్టికి తీసుకెళ్లడంతో ఉత్తరాన కొత్త సిటీ ప్రతిపాదనను పక్కనబెట్టిన అధిష్ఠానం.. పశ్చిమాన ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్, తూర్పున ఉప్పల్ పారిశ్రామికవాడ ఉండటంతో.. దక్షిణ భాగంలోని కందుకూరు, ముచ్చర్ల, తుక్కుగూడ ప్రాంతంలో 'ఫోర్త్' సిటీ కోసం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్టు భోగట్టా.

బ్లూప్రింట్ కాకపోతే మరేంటి?

- బెంగళూరు శివారుల్లో నిర్మిస్తున్న 'క్విన్' సిటీలో ఉండే వసతులు, నిర్మాణాలు.. హైదరాబాద్ శివారుల్లో నిర్మిస్తున్న 'ఫోర్త్' సిటీలోని వసతులు, నిర్మాణాలు ఒకేలా ఉన్నాయి. అదెలా?
- 'క్విన్' సిటీకి మెట్రో రైలు, గ్రీన్‌ఫీల్డ్ కనెక్టివిటీ ప్రతిపాదించినట్టే, ఫోర్త్ సిటీకి కూడా సరిగ్గా అలాగే.. మెట్రో రైలు, గ్రీన్‌ఫీల్డ్ కనెక్టివిటీ ఎలా ప్రతిపాదించారు?
- హెల్త్ సిటీని రద్దు చేసి 'క్విన్' సిటీని తీసుకొస్తున్నట్టే, 'ఫోర్త్' సిటీ కోసం ఫార్మా సిటీని రద్దు చేశారా?
- 'క్విన్' సిటీలో నాలెడ్జ్ వర్సిటీ, ఏఐ సిటీ నిర్మాణాలను ప్రతిపాదించినట్టే, 'ఫోర్త్' సిటీలో స్కిల్ వర్సిటీ, ఏఐ సిటీని అచ్చంఅలాగే ఎలా ప్రతిపాదించారు?
- 'క్విన్' సిటీ కోసం శాటిలైట్ ఆర్‌ఆర్ రూట్ మ్యాప్‌ను మార్చినట్టే.. 'ఫోర్త్' సిటీకి ఆర్‌ఆర్‌ఆర్ రూట్‌ను ఎందుకు మార్చారు?
- బెంగళూరులోని కెంపెగౌడ ఎయిర్‌పోర్ట్‌కు 'క్విన్' సిటీ ఎంత దూరంలో ఉన్నదో, శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు కూడా 'ఫోర్త్' సిటీ అంతే దూరంలో ఉన్నది. ప్రధాన నగరాలకు కూడా ఈ రెండు కొత్త సిటీలు సమాన దూరాల్లో ఉన్నాయి. ఇది యాదృచ్ఛికమా?

ట్రిపుల్ ఆర్ కమిటీ సమావేశం

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు కోసం ఆర్‌అండ్‌బీ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ నేతృత్వంలో ప్రభుత్వం నియమించిన కమిటీ గురువారం సచివాలయంలో మొదటిసారిగా సమావేశమైంది. ప్రభుత్వ సలహాదారు (ఇన్‌ఫ్రా) శ్రీనివాసరాజు, కమిటీ సభ్యులుగా ఉన్న ట్రిపుల్ ఆర్ ప్రాజెక్టు పరిధిలోని ఏడు జిల్లాల కలెక్టర్లు, రెవెన్యూ, మున్సిపల్, ఆర్‌అండ్‌బీ శాఖల కార్యదర్శులు, ఆర్‌అండ్‌బీ ఈఎన్సీ, చీఫ్ ఇంజినీర్ తదితరులు పాల్గొన్నారు. సీఎం సూచనలకు అనుగుణంగా ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ రూపకల్పనపై చర్చించారు. అలైన్‌మెంట్‌పై రైతుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. కొందరి రియల్ ఎస్టేట్ ప్రయోజనాల కోసం ట్రిపుల్ ఆర్ అలైన్‌మెంట్ మారుస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అలైన్‌మెంట్‌ను ఖరారు చేసేందుకు 12మంది సభ్యులతో కమిటీ వేసింది.

ట్రిపుల్ ఆర్ గేమ్ చేంజర్

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 26(నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ప్రతిపాదిత రీజనల్ రింగు రోడ్డు (ట్రిపుల్ ఆర్) గేమ్ చేంజర్ వంటిదని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వ్యాఖ్యానించారు. ట్రిపుల్ ఆర్‌తోపాటు టిమ్స్ దవాఖానలు, జిల్లాల్లో పరిపాలనా పరమైన భవనాల నిర్మాణం కొనసాగుతున్నదని చెప్పారు. కొత్త ఇంజినీర్లు తాము నిర్మించేవి రోడ్లో, భవనాలో అనుకోకుండా లక్షల మంది అవసరాలను తీర్చే కట్టడాలుగా భావించి పనిచేయాలని సూచించారు. గురువారం హైటెక్స్ ప్రాంగణంలోని న్యాక్ (నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్)లో టీజీపీఎస్సీ ద్వారా ఎంపికైన 156 మంది ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లకు శాఖపరమైన అవగాహన కల్పించేందుకు నిర్వహిస్తున్న 5 రోజుల ఒరియంటేషన్ కార్యక్రమానికి మంత్రి కోమటిరెడ్డి హాజరై ఇంజినీర్లకు మార్గనిర్దేశనం చేశారు. ఇంజినీర్ల రిక్రూట్‌మెంట్ ద్వారా ఆర్‌అండ్‌బీని పటిష్ఠం చేస్తున్నట్టు వివరించారు. తాను 24 గంటలు అందుబాటులో ఉంటానని, ఏదైనా సమస్య వస్తే తనతో చెప్పాలని ఇంజినీర్లకు సూచించారు. కొత్త ఇంజినీర్లు మోక్షగుండం విశ్వేశ్వరయ్యను ఆదర్శంగా తీసుకొని తమ కెరీర్లను నిర్మించుకోవాలని చెప్పారు.

ట్రిపుల్ ఆర్ నిర్వాసితుల ఆందోళన

- జంక్షన్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్

చౌటుప్పల్, సెప్టెంబర్ 26 : రీజినల్ రింగ్ రోడ్డు జంక్షన్ అలైన్‌మెంట్ మార్చాలని డిమాండ్ చేస్తూ ట్రిపుల్ ఆర్ బాధితుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో గురువారం చౌటుప్పల్‌లో భూ నిర్వాసితులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఓఆర్ఆర్ నుంచి ట్రిపుల్ ఆర్‌కు నాలుగు రహదారులను 40 కిలోమీటర్ల దూరంలో జంక్షన్లు ఏర్పాటు చేశారని, కానీ.. చౌటుప్పల్, భువనగిరి ప్రాంతాల్లో కేవలం 28 కిలోమీటర్ల దూరంలోనే నిర్మిస్తున్నారని మండిపడ్డారు. చౌటుప్పల్ జంక్షన్ ఏర్పాటు వల్ల మున్సిపాలిటీ రెండుగా విడిపోతుందని ఆవేదన చెందారు. దీనికితోడు ఏటా మూడు పంటలు పండే భూములు, హెచ్ఎండీఏ ప్లాట్లలోని ఇండ్లు కోల్పోతున్నట్టు ఆందోళన వ్యక్తం చేశారు. 2013 భూసేకరణ చట్టం ప్రకారం తక్షణమే సవరణ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిరసనలో సింగిల్‌విండో చైర్మన్ చింతల దామోదర్‌రెడ్డి, రైతు సంఘం నాయకులు బూర్గు కృష్ణారెడ్డి, బండారు నర్సింహ, గుజ్జుల సురేందర్ రెడ్డి, దబ్బేటి రాములు గౌడ్, సందగళ్ల మల్లేశ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టుకు వర్కట్‌పల్లి ట్రిపుల్ ఆర్ బాధితులు

వలిగొండ, సెప్టెంబర్ 26 : తమకు న్యాయం చేయాలని కోరుతూ యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం వర్కట్‌పల్లి గ్రామ రెవెన్యూ పరిధిలోని ట్రిపుల్ ఆర్ బాధితులు గురువారం హైకోర్టును ఆశ్రయించారు. ఈ సందర్భంగా రైతులు నాగెల్లి దశరథ, సోలిపురం జనార్దన్‌రెడ్డి, మెట్టు రవీందర్‌రెడ్డి, నాగెల్లి సత్యనారాయణ, మాడ్గుల వెంకటేశ్ తదితరులు మాట్లాడుతూ.. ట్రిపుల్ ఆర్ రోడ్డు నిర్మాణంలో చిన్న, సన్నకారు రైతులు, ఎకరం, రెండు, మూడు ఎకరాల భూములున్న రైతులే ఎక్కువ మంది ఉన్నారని, ఈ భూములను కోల్పోతే తమకు జీవనోపాధి లేకుండా పోతుందని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం మొదట నిర్ణయించిన అలైన్‌మెంట్ కాకుండా రెండో అలైన్‌మెంట్‌తోనే రైతుల భూములు ఎక్కువగా పోతున్నాయని పేర్కొన్నారు. మొదటి అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ చేయాలని, రెండో అలైన్‌మెంట్ ప్రకారం భూసేకరణ చేస్తే మార్కెట్ ధరకు అనుగుణంగా నష్టపరిహారం ఇవ్వాలని కోరారు.



రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలంలోని కొదురుపాక పాఠశాల భవనాన్ని ప్రారంభిస్తున్న బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తదితరులు



రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్యే కేటీఆర్

ఫోర్త్ సిటీకి ఎకరమైనా సేకరించినవా?

- అన్న ఇంటికి నోటీసులు.. పేదలపైకి బుల్డోజర్లా?
- ఫార్మా భూములను బ్రదర్స్ కోసం, రియల్ ఎస్టేట్ కోసం వాడుతామంటే రైతులు తోలు తీస్తరు
- సమయానుకూలంగా అన్నింటినీ బయటపెడతం
- ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి: కేటీఆర్

> సిరిసిల్లను తిరుపూరుగా తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతోనే వస్త్ర ఉత్పత్తిదారులను స్టడీ టూర్‌కు బస్సుల్లో తమిళనాడు పంపించాం. ఆత్మహత్యలు, ఆకలి చావుల నుంచి బయటపడి ఇప్పుడిప్పుడే ముఖం తెలివికొస్తుందన్న సమయంలో దురదృష్టవశాత్తు దిక్కుమాలిన కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది. ఇక్కడి ప్రజలు నన్ను ఐదుసార్లు గెలిపించారన్న కోపంతో కాంగ్రెస్ ప్రభుత్వం నేతన్నలపై పగబట్టింది. బతుకమ్మ చీరల ఆర్డర్లు బంద్ చేసింది. మూతపడిన సాంచాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తెచ్చి వేలాదిమంది కార్మికుల కడుపు నింపిన మహానుభావుడని కేసీఆర్. -కేటీఆర్

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, ఏఐ సిటీ, జూపార్క్ అని మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి అందుకోసం ఒక్క ఎకరమైనా సేకరించారా? అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. గతంలో తమ ప్రభుత్వం ప్రతిపాదించిన భూమిని ఇతర అవసరాలకు ఎలా మళ్లిస్తారని ప్రశ్నించారు. బ్రదర్స్‌కు, రియల్ ఎస్టేట్‌కు వాడుతానంటే భూములిచ్చిన రైతులు ఊరుకోబోరని హెచ్చరించారు. ఫార్మాసిటీ విషయంలో ప్రభుత్వం అయోమయానికి గురిచేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇబ్రహీంపట్నంలో ఏ రైతులైతే ఓట్లేసి గెలిపించారో వాళ్లే కాంగ్రెస్ పార్టీ అంతు చూస్తారని హెచ్చరించారు. ఫార్మాసిటీ కోసం సేకరించిన 14 వేల ఎకరాల భూమి కండిషనల్ ల్యాండ్ అక్విజేషన్ అని తెలిపారు. ఆ భూములను రియల్ ఎస్టేట్ దందాల కోసం, ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ అనే హంగామా కోసం మళ్లించి వేలకోట్లు నొక్కెయ్యాలనే ఆలోచన, ప్రభుత్వం చేస్తున్న కుట్రలను న్యాయమూర్తులు గమనించాలని విజ్ఞప్తి చేశారు. సమయానుకూలంగా ఇందులో ఎవరెవరు జోక్యం చేసుకుంటున్నారో ఏమి జరుగుతున్నదో బయటపెడతామని చెప్పారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లాలో కేటీఆర్ పర్యటించారు. చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా సిరిసిల్ల పట్టణంలోని పోలీస్ స్టేషన్ పక్కనున్న ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం బోయినిపల్లి మండలంలోని కొదురుపాకలో తన అమ్మమ్మ, తాతయ్య జోగినిపల్లి లక్ష్మి-కేశవరావు జ్ఞాపకార్థం నిర్మించిన పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. తాను నాయకుడిగా రాలేదని, కేశవరావుకు మనవడిగా ఇక్కడకు వచ్చానని చెప్పారు. అనంతరం సిరిసిల్లకు చేరుకుని తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్టీ మారినోళ్లంతా ఉప ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. ఉప ఎన్నికలు పక్కాగా వస్తాయని చెప్పారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న రాహుల్‌గాంధీ ప్రతిపక్ష నేత, రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యారు కానీ, ఉద్యోగాల సంగతి మర్చిపోయారని విమర్శించారు.

కక్ష నాపై తీర్చుకోండి

ఈ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కక్ష తీర్చుకోదల్చుకుంటే తాను దానికి సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ పేర్కొన్నారు. 'తొమ్మిదిన్నర నెలల నుంచి చూస్తున్నా. ప్రజలకు పనికొచ్చే ఒక్క పథకం తెచ్చారా? చెప్పిన డైలాగులేమో అనంతంగా చెప్పిండ్రు. వానకాలం నాట్లు పడ్డా ఇంతవరకు రైతు భరోసా దిక్కులేదు. రూ.10 వేలు కాదు, రూ.15 వేలు ఇస్తమన్నరు. రైతు రుణమాఫీ చెయ్యలేదు. క్షీరాభిషేకాలు అయిపోయాయి. ఊళ్లల్లోకెళ్తే కాంగ్రెసోళ్లను తన్నేటట్టున్నరు. ఎల్లకాలం మోసం నడవది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వ డ్రామాలు నడవవు. నేతన్న విషయంలో డ్రామాలు బంద్ పెట్టి చీరల తయారీ మొత్తం సిరిసిల్లకే ఇవ్వాలి' అని డిమాండ్ చేశారు. 'బతుకమ్మ బంద్, క్రిస్మస్ దుస్తులు, రంజాన్ తోఫా ఎందుకు బంద్ పెట్టారో ఎవని అయ్యకు తెలువది. చెప్పేటోడు లేడు. అడిగేటోడు అంతకంటే లేడు' అని విమర్శించారు. ఇది దివాలాకోరు రాజకీయం అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'రోజుకొక్క పుకారు పుట్టించాలె. హెడ్‌లైన్ మేనేజ్‌మెంట్, డెడ్‌లైన్ మేనేజ్‌మెంట్.. అది తప్ప సర్కారు పీకిందేమీలేదు' అని ధ్వజమెత్తారు.

అన్న ఇంటికి నోటీసులు.. పేదల గుండెల్లో బుల్డోజర్లా

'అన్నకు 40 రోజుల నోటీసులిచ్చి వెసలుబాటు కల్పిస్తవ్. పేదల ఇండ్లను మాత్రం కూలుస్తవా' అంటూ రేవంత్‌రెడ్డిపై కేటీఆర్ ఫైర్ అయ్యారు. దళితులు, మైనార్టీలు, బీసీలను బజారుకీడ్చి బుల్డోజర్‌తో తొక్కిస్తావా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. 'ఈ ప్రభుత్వంలో కుడి చేయి ఏం చేస్తుందో ఎడమ చేయికి తెలవడం లేదు. మూడు రోజుల కింద రిజిస్ట్రేషన్ అయినది, కోటిన్నర పెట్టి కొనుక్కున్న ఇంటిని కూల్చేస్తున్నారు. వీళ్లు ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారా? లేకుంటే సర్కస్ నడిపిస్తున్నారా? నీ ఖజానాకు ఓ చేయి నుంచి పైసలు తీసుకుంటవ్. ఇంకో చేత్తో కూలగొడవతారా? నీ అన్న ఇల్లు ముట్టనివ్వవు, అది భద్రంగా ఉండాలె. బడుగుల బతుకులు మాత్రం ఛిద్రం కావాలె. ఇదేనా? నీతి' అని విరుచుకుపడ్డారు. చిత్తశుద్ధి ఉంటే హైడ్రాలో ఇండ్లు కోల్పోయిన పేదలకు కేసీఆర్ కట్టించిన 40 వేల డబుల్ బెడ్రూం ఇండ్లను ఇవ్వాలని కోరారు. మూసీ నదిపై పెద్దపెద్ద బిల్డింగ్‌లు కడుతున్నారని, దమ్ముంటే వాటిని కూల్చాలని సవాల్ చేశారు. కేవీపీ రాంచందర్‌రావు, పట్నం మహేందర్‌రెడ్డిని విడిచి పెట్టి పేదలపై ప్రతాపం చూపడం న్యాయమా? అని నిలదీశారు. బాధితులకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఇన్నోవేట్ థింకింగ్

ఇయ్యని ఉద్యోగాలను ఇచ్చినట్టు చెప్పుకుంటూ, నోటిఫికేషన్ ఇవ్వకున్నా 30 వేల ఉద్యోగాలు ఇచ్చానని ఊదరగొడుతూ, అర్హత లేని బావమరిదికి రూ.1,137 కోట్ల కాంట్రాక్టు ఇచ్చి ఇన్నోవేట్ థింకింగ్ అని ముఖ్యమంత్రి మాట్లాడుతున్నాడని కేటీఆర్ ధ్వజమెత్తారు. ఇన్ని రోజులు అడ్రస్ లేని అన్నదమ్ములు రూ. వెయ్యి కోట్ల పెట్టుబడులతో మూటముల్లెతో వచ్చుడు ఇన్నోవిట్ థింకింగ్‌కు నిదర్శనమా? అని ప్రశ్నించారు.

ఐలమ్మ పోరాటం స్ఫూర్తిదాయకం

'తెలంగాణ సాధన కోసం చాకలి ఐలమ్మ చేసిన పోరాటం భవిష్యత్తు తరాలకు స్ఫూర్తిదాయకం. తెలంగాణ సాయుధ పోరాటంలో నియంతృత్వాన్ని నిరసించి తెలంగాణకు స్ఫూర్తినిచ్చిన వీర వనిత ఐలమ్మను ఆడబిడ్డలందరూ ఆదర్శంగా తీసుకోవాలి' అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

> నేనే రాజు, నేనే మంత్రి, అక్కడ రేవంత్‌రెడ్డి, ఇక్కడ నేనే ప్రభుత్వాన్ని నడుపుతానంటూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న కేకే మహేందర్‌రెడ్డికి అధికారులు వంత పాడుతున్నారు. అధికారులకు ఒకటే చెప్తున్నా. మొన్న ఆంధ్రప్రదేశ్‌లో ఆలిండియా సర్వీస్ ఆఫీసర్లు సైతం సస్పెండ్ అయ్యారు. చట్ట ప్రకారం కాకుండా ఇష్టం వచ్చినట్టు పని చేస్తమంటే మాత్రం తప్పకుండా దానికి ఫలితం అనుభవిస్తారు. ఎవరైనా సరే తప్పకుండా ఫలితం అనుభవిస్తారు. మూడున్నర, నాలుగేండ్లలో కేసీఆర్ తిరిగి వస్తారు. మీ సంగతి తప్పకుండా చూస్తారు. -కేటీఆర్

ఫార్మా సిటీ ఉందా.. లేదా?

మొదటిపేజీ తరువాయి...

విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలనే కాకుండా రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానాన్ని కూడా మోసం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ మేరకు ఆయన రాష్ట్ర ప్రభుత్వానికి బహిరంగ లేఖ రాశారు. ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ ఫార్మాసిటీని రద్దు చేసి రైతులకు భూమిని తిరిగి ఇస్తామని హామీ ఇచ్చింది నిజం కాదా? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే ఫార్మా సిటీని రద్దుచేస్తున్నామని, ఆ స్థానంలో ఫార్మా విలేజీలు, ఫార్మా క్లస్టర్లు ఏర్పాటుచేస్తామని అనేక వేదికలతో పాటు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించారని గుర్తుచేశారు. ఫార్మాసిటీ రద్దు విషయంలో మాయమాటలతో మభ్యపెట్టి, అనేక ఆర్థిక అవకతవకలకు, భూదందాలకు ప్రభుత్వం తెరలేపుతున్నదని విమర్శించారు. హైదరాబాద్ ఫార్మాసిటీ పేరు మార్చి ఫ్యూచర్ సిటీ, ఫోర్త్ సిటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సిటీ అని రకరకాల కొత్త పేర్లను తెరపైకి తెచ్చి అతి పెద్ద కుంభకోణానికి కాంగ్రెస్ సర్కార్ స్కెచ్ వేసిందని ఆరోపించారు. సర్కార్ చేస్తున్న ఈ మాయాజాలం రాష్ట్ర ప్రజలకు ఇప్పటికే అర్థమైందని పేర్కొన్నారు.

హైకోర్టు ముందు వాస్తవాలు దాచే కుట్ర

కాంగ్రెస్ పార్టీ చేసిన భూసేకరణ చట్టం ప్రకారం ఫార్మాసిటీ భూములను ఇతర అవసరాలకు వాడుకునే అవకాశం లేనేలేదని తెలిసిన తర్వాత కూడా వాటన్నింటినీ తుంగలో తొక్కి హైకోర్టు ముందు వాస్తవాలను దాచే కుట్ర చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. అధికారంలోకి వచ్చిన తర్వాత హైదరాబాద్ ఫార్మాసిటీని రద్దు చేస్తున్నట్టు పరిశ్రమలశాఖ మంత్రి శ్రీధర్ బాబుతో సహా పలు మీడియా సమావేశాల్లో సీఎం, మంత్రులు ప్రకటించిన విషయం వాస్తవం కాదా? అని ప్రశ్నించారు. కాగితాలపైన హైదరాబాద్ ఫార్మాసిటీని రద్దు చేయడం లేదనే మాట చెప్తూ మరోవైపు తమ భూదందాల కోసం అదే స్థానంలో పేర్లు మార్చి ఫార్మాసిటీ భూములను అప్పనంగా వాడుకునే కుతంత్రం నడుస్తున్నదని దుయ్యబట్టారు.

> ఫార్మాసిటీ విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం హైకోర్టును, న్యాయమూర్తులను కూడా తప్పుదోవ పట్టిస్తూ అబద్ధాలు చెప్తున్నది. ఇది ఎంతోకాలం సాగదు. ఒక్క ఎకరం సేకరించకుండా, హైకోర్టుకు చెప్పినట్టు ఫార్మాసిటీని రద్దు చేయకుండా కాంగ్రెస్ సర్కారు చెప్తున్న ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ, ఫోర్త్ సిటీ, ఫ్యూచర్ సిటీలను ఎక్కడ కడతారో చెప్పాలి? - కేటీఆర్

> కాంగ్రెస్ పార్టీ అవినీతి ఆలోచనలతో ఫార్మాసిటీ భూములను అప్పనంగా వాడుకొని వేలకోట్లు సంపాదించాలని చేస్తున్న ప్రయత్నం రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి గొడ్డలిపెట్టుగా మారుతుంది. ఫార్మాసిటీ పూర్తయితే లక్షలాది మంది తెలంగాణ యువతకు ఉద్యోగాలతో పాటు రాష్ట్ర ఖజానాకు భారీగా ఆదాయం వస్తుంది. అలాకాకుండా ప్రాజెక్టును రద్దు చేస్తే రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిన వాళ్లవుతారు. - కేటీఆర్

ఫార్మా భూములను 'రియల్'పరం కానివ్వం

బీఆర్‌ఎస్ ప్రభుత్వం 14 వేల ఎకరాల్లో రూ. 64 వేల కోట్ల పెట్టుబడులతో ఫార్మా సిటీని ప్రతిపాదించినట్టు కేటీఆర్ తెలిపారు. రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి కోసం హైదరాబాద్ ఫార్మాసిటీకి భూములు ఇచ్చి ముందుకు వచ్చిన వేలాదిమంది రైతులకు తమ భూమిని ప్రభుత్వం ఏ విధంగా ఉపయోగిస్తున్నదో తెలుసుకునే హక్కు ఉన్నదని స్పష్టం చేశారు. సదుద్దేశంతో ఇచ్చిన భూములను దుర్వినియోగం చేస్తామంటే కుదరదని, ముఖ్యమంత్రి, తన కుటుంబ సభ్యులు ఆ భూములతో రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేసుకుంటామంటే చూస్తూ ఊరుకోవడానికి ప్రజలు సిద్ధంగా లేరని చెప్పారు. ఫార్మాసిటీ తాము ప్రతిపాదించిన 14 వేల ఎకరాల్లో ఉండాలని, లేదంటే రైతులకు వారిచ్చిన భూములను తిరిగి ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ తన అవినీతి విధానాలను, అసంబద్ధ ప్రకటనలను పక్కన పెట్టాలని సూచించారు. రాష్ట్రాన్ని ఫార్మా క్యాపిటల్ ఆఫ్ వరల్డ్ గా తీర్చిదిద్దాలన్న సమున్నత లక్ష్యంతో చేపట్టిన ఈ ప్రాజెక్టును యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. హైకోర్టును, న్యాయమూర్తులను రేపు కోర్టులో సమర్పించే అఫిడవిట్ లేదా వినిపించే వాదనల ద్వారా మోసం చేయడానికి ప్రయత్నిస్తే అందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు.

50కి పైగా మందులు నాసిరకం

న్యూఢిల్లీ: దేశంలో పారాసిటమాల్, పాన్ డి, కాల్షియం, విటమిన్ డీ3 సప్లిమెంట్స్, యాంటీ-డయాబెటిక్ సహా 50కి పైగా మందులు నాసిరకంగా ఉన్నాయని కేంద్ర ఔషధాల ప్రమాణాల నియంత్రణ సంస్థ (సీడీఎస్‌సీవో) తాజా నివేదిక వెల్లడించింది. ఆగస్టు నెలకు గాను విడుదల చేసిన ఈ నివేదికలో షెల్కాల్, విటమిన్ సి సాఫ్ట్‌జెల్స్‌తో కూడిన విటమిన్ బి కాంప్లెక్స్, విటమిన్ సి అండ్ డీ3, సిప్రోఫ్లోక్సాసిన్ తదితర ఔషధాలూ తగిన నాణ్యత లేనివిగా తేలాయి. అధిక రక్తపోటుకు వాడే టెల్మిసర్టాన్, ఆట్రోపైన్ సల్ఫేట్, అమోక్సిసిల్లియన్, పొటాషియం క్లావులనేట్ కూడా నాసిరకంగా ఉన్నట్టు తెలిసింది. నాణ్యత లేని ఔషధాల అలర్ట్ డాటాను ఆగస్టు నెలకు తెలంగాణతో పాటు పలు రాష్ట్రాలు సమర్పించలేదని సీడీఎస్‌సీవో తెలిపింది.

షేక్ హసీనాను గద్దె దింపడం వెనక కుట్ర

బంగ్లాదేశ్ తాత్కాలిక చీఫ్ యూనస్ సంచలన వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా గద్దె దిగడం యాదృచ్ఛికంగా జరగలేదని, దీని వెనక కుట్ర ఉందని ఆ దేశ తాత్కాలిక చీఫ్ మహమ్మద్ యూనస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికాలో క్లింటన్ గ్లోబల్ ఇనిషియేటివ్ వార్షిక సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. హసీనా గద్దె దిగి దేశాన్ని విడిచిపెట్టడంలో మాఫజ్ అబ్దులా హస్తం ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. రిజర్వేషన్ల అంశం దేశాన్ని కుదిపేసి హింసకు దారితీయడంతో మరో దారిలేక హసీనా ప్రధాని పీఠం వదలి దేశం విడిచి భారత్ చేరుకుని ఆశ్రయం పొందుతున్నారు.

కాలిఫోర్నియాలో హిందూ ఆలయంపై దాడి!

గత 10 రోజుల్లో రెండో ఘటన

వాషింగ్టన్, సెప్టెంబర్ 26: అమెరికాలో హిందూ దేవాలయాలే లక్ష్యంగా విద్వేష మూకలు దాడులకు తెగబడుతున్నాయి. కాలిఫోర్నియా రాష్ట్రంలో దుండగులు ఓ హిందూ ఆలయంలో చొరబడి విధ్వంసం సృష్టించారు. శాక్రమెంటోలోని 'బీఏపీఎస్ హిందూ ఆలయం'పై రంగులు జల్లి, ఆలయం పవిత్రతను దెబ్బతీశారు. 'హిందూస్ గో బ్యాక్' అంటూ దేవాలయం గోడలపై పెయింటింగ్‌తో రాశారు. బుధవారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకుందని తెలిసింది. గత పది రోజుల్లో ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం ఇది రెండోసారి.

చెఫ్‌లు, వెయిటర్లు మాస్కులు, గ్లౌజులు ధరించాల్సిందే

యూపీ సర్కార్ ఆదేశం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: హోటళ్లు, రెస్టారెంట్లలో కఠిన శుభ్రత ప్రమాణాలను అమలు చేయడంలో భాగంగా చెఫ్‌లు, వెయిటర్లు తప్పనిసరిగా మాస్కులు, గ్లౌజులు ధరించాలని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం ఆదేశించింది. అలాగే సీసీటీవీ కెమెరాలు కలిగి ఉండటం తప్పనిసరి అని చెప్పింది. రాష్ట్రంలో ఉమ్మి, మూత్రంతో ఆహార కల్తీ జరిగిన ఘటనలు వెలుగులోకి వచ్చిన నేపథ్యంలో ఈ చర్యలు చేపట్టింది. మానవ వ్యర్థాలు లేదా అపరిశుభ్ర పదార్థాలతో ఆహార కల్తీకి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది.

పెరగనున్న చక్కెర ధరలు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: దేశంలో చక్కెర ధరలు పెరగనున్నాయి. 2024-25 సీజన్ (అక్టోబర్-సెప్టెంబర్)కు సంబంధించి చక్కెర, ఇథనాల్ కనీస విక్రయ ధర (ఎంఎస్‌పీ) పెంచాలని కేంద్రం నిర్ణయించడంతో చక్కెర ధర పెరగనుంది. 'చక్కెర కనీస విక్రయ ధరను పెంచాలన్న ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్నాం. అలాగే ఇథనాల్ ధరను కూడా పెంచుతాం. ఈ విషయం పెట్రోలియం శాఖ పరిశీలిస్తుంది' అని కేంద్ర ఆహార శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం తెలిపారు.

'రిజర్వేషన్ల రద్దుకు బీజేపీ వెనుకాడదు'

ముంబై, సెప్టెంబర్ 26: దేశంలో రిజర్వేషన్ల రద్దుకు మోదీ సర్కార్ వెనుకాడబోదని, దీనిపై బీజేపీ వర్గాలు ఇప్పటికే కసరత్తు మొదలుపెట్టాయని కాంగ్రెస్ నాయకుడు పీ చిదంబరం సంచలన వ్యాఖ్యలు చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి పూర్తి మెజార్టీ రాకున్నా.. రిజర్వేషన్లను దెబ్బతీయడానికి మోదీ సర్కార్ ప్లాన్ చేస్తున్నదని, ఇందుకోసం రాజ్యాంగ సవరణ చేపడుతుందని అన్నారు.

జాబ్‌లెస్ నుంచి జాబ్ లాస్ వైపు!

దేశంలో ఉద్యోగ సంక్షోభం

- గతంలో కొత్త కొలువుల కోసం ఎదురుచూపులు
- ఇప్పుడు ఉన్న కొలువులు ఊడుతాయనే భయాలు
- ఎంఎన్‌సీల్లో వేలాది ఉద్యోగులకు లేఆఫ్‌లు
- చిన్న కంపెనీల్లో సైలెంట్ లేఆఫ్‌ల సంస్కృతి
- దినదిన గండంగా ప్రైవేటు ఉద్యోగుల జీవితాలు
- లాభాలున్నా ఉద్యోగాలు పెంచని పెద్ద కంపెనీలు
- ఐఐటీల్లో చదివినా ఉద్యోగాలు దొరకని పరిస్థితి



హైదరాబాద్, సెప్టెంబర్ 26: దేశంలో ప్రైవేటు ఉద్యోగి జీవితం దినదిన గండంగా మారుతున్నది. ఎంత పెద్ద కంపెనీ అయినా ఉద్యోగానికి గ్యారెంటీ లేకుండా పోతున్నది. లాభాలు లేవనో, ఖర్చులు తగ్గించాలనో, ఏఐతో ఉద్యోగుల అవసరం తగ్గిందనో ప్రతీనెలా పదుల సంఖ్యలో కంపెనీలు వేలాది మందికి లేఆఫ్‌లు ప్రకటిస్తున్నాయి. గతంలో చదువు పూర్తి చేసుకున్న వారికి ఉద్యోగాలు దొరకకపోవడం, చదువుకు తగ్గ ఉద్యోగాలు లభించకపోవడమే భారత్‌లో సమస్యగా ఉండేది. ఇప్పుడు ఉద్యోగాలు ఉన్నా ఏ సమయాన లేఆఫ్ జాబితాలో ఉంటామో అనే బెంగ ఉద్యోగులను కలవరపరుస్తున్నది. ఒక్కమాట చెప్పాలంటే.. ఇప్పటివరకు జాబ్‌లెస్ ఇండియాగా ఉన్న మన దేశంలో ఇప్పుడు జాబ్‌లాస్ ఇండియాగా కొనసాగుతున్నది. మరోవైపు దేశంలో నిరుద్యోగుల కష్టాలూ తీరడం లేదు. చదువుకు తగ్గ ఉద్యోగాలు లేక గిగ్ వర్కర్లుగా మారుతున్న వారి సంఖ్య వేలల్లో ఉంటున్నది. ఐఐటీల్లో చదివిన వారికి సైతం ఉద్యోగాలు దొరకడం లేదు. దేశంలోని అనేక పెద్ద కంపెనీల ఆదాయాలు పెరుగుతున్నా.. ఆ సంస్థలు కల్పించే కొత్త ఉద్యోగుల సంఖ్య మాత్రం పెరగడం లేదు. యువతకు కొత్త ఉద్యోగాలు దొరక్కపోవడం, ఉద్యోగాలు చేస్తున్న వారిలో అభద్రతాభావం అన్ని రంగాల్లోనూ ప్రభావం చూపిస్తున్నది.

ప్రతినెలా వేల మంది ఉద్యోగాల కోత

దేశంలో ఐటీ రంగంలోని ఉద్యోగులు గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. 2023 ఆరంభంలో మొదలైన లేఆఫ్‌ల సీజన్ ఇప్పుడు తీవ్రంగా మారింది. లేఆఫ్స్.ఎఫ్‌వైఐ డాటా ప్రకారం ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకు 445 కంపెనీల్లో 1,37,460 మంది ఉద్యోగుల కొలువులు పోయాయి. ఇందులో భారతీయుల వాటానే అధికం. అనేక బహుళ జాతి సంస్థలు ఖర్చులు తగ్గించుకునేందుకు లేఆఫ్‌ల బాట పడుతున్నాయి. అయితే, పెద్ద కంపెనీలు ప్రకటించే లేఆఫ్‌లు మాత్రమే వెలుగులోకి వస్తున్నాయి. చిన్న సంస్థలు నిత్యం వందలాది మంది ఉద్యోగులను ఇంటికి పంపిస్తున్నప్పటికీ ఈ లెక్కలు బయటకు రావడం లేదు. అనేక కంపెనీలు 30 రోజుల గడువు ఇచ్చి కొత్త ఉద్యోగం చూపుకోమని సూచిస్తూ 'సైలెంట్ లేఆఫ్' చెప్తున్నాయి. ఈ లెక్కలు బయటకు రావడం లేదు. సహజంగా ఒక ఉద్యోగం నుంచి మరో ఉద్యోగంలోకి మారినప్పుడు వేతనంలో 'హైక్' అడిగే పద్ధతి ఉంది. ఇప్పుడు మాత్రం ఏదో ఓ ఉద్యోగం దొరికితే చాలనే భావనతో అనేక మంది ప్రస్తుతం పొందుతున్న దాని కంటే తక్కువ వేతనానికి కూడా ఉద్యోగంలో చేరుతున్నారు. చాలామందికి కొత్త ఉద్యోగాలు దొరకక ఖాళీగా ఉండాల్సి వస్తున్నది.

దేశంలోని 6 పెద్ద వ్యాపార సంస్థలు - ఉద్యోగుల లెక్కలు

ఆధారం: ఫైనాన్షియల్ ఎక్స్‌ప్రెస్

గ్రూప్ పేరు	సంస్థలు	ఉద్యోగుల సంఖ్య 2022-23	ఉద్యోగుల సంఖ్య 2023-24	రెవెన్యూ(రూ. లక్షల కోట్లు) 2022-23	రెవెన్యూ(రూ. లక్షల కోట్లు) 2023-24	లాభం(లక్షల కోట్లు) 2022-23	లాభం(లక్షల కోట్లు) 2023-24
టాటా	23	8,24,389	8,24,344	9.86	11.07	0.67	0.90
రిలయన్స్	10	4,12,130	3,67,507	8.99	9.30	0.66	0.70
అదానీ	11	34,944	35,991	3.33	3.09	0.27	0.41
బజాజ్	10	1,24,259	1,56,834	1.69	2.21	0.30	0.38
ఏవీ బిర్లా	7	1,33,808	1,46,477	4.45	4.68	0.25	0.27
మహీంద్ర	8	2,12,436	2,07,667	1.97	2.16	0.17	0.16

లాభాలున్నా.. కొలువుల్లేవు

దేశంలోని అనేక సంస్థలు ప్రతియేటా లాభాలను, వ్యాపారాన్ని పెంచుకుంటున్నా.. ఉద్యోగుల సంఖ్యను మాత్రం పెంచడం లేదు. వివిధ రంగాల్లో వ్యాపారాలను విస్తరించిన టాటా, రిలయన్స్, అదానీ, బజాజ్, ఏవీ బిర్లా, మహీంద్ర ఇలా అన్ని కంపెనీలదీ ఈ విషయంలో ఒకే తీరు. 2022-23 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ ఆరు సంస్థలు రెవెన్యూను 7.3 శాతం, లాభాలను 22.3 శాతం, మార్కెట్ కాపిటలైజేషన్‌ను 43.8 శాతం పెంచుకున్నాయి. అయితే, ఈ సంస్థల్లో ఉద్యోగుల సంఖ్య మాత్రం పెరగకపోగా 0.2 శాతం తగ్గింది. ఈ ఆరు గ్రూప్‌లకు కలిసి 69 లిస్టెడ్ కంపెనీలు ఉన్నాయి. బ్లూమ్‌బర్గ్ డాటా ప్రకారం.. వీటిల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 17.4 లక్షల మంది ఉద్యోగులు ఉండగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ సంఖ్య 17.3 లక్షలకు తగ్గింది. ఇటీవల దేశంలోని 1,196 కంపెనీలకు సంబంధించి బ్యాంక్ ఆఫ్ బరోడా ఒక సర్వే చేయగా ఈ సంస్థల్లో ఉద్యోగ కల్పనలో వృద్ధి 2022-23 ఆర్థిక సంవత్సరంలో 5.7% ఉండగా, 2023-24లో కేవలం 1.5% మాత్రమే ఉంది. ఈ కంపెనీల్లో 2022-23 ఆర్థిక సంవత్సరంలో 3,33,000 కొత్త ఉద్యోగాలు వస్తే, 2023-24 ఆర్థిక సంవత్సరంలో మాత్రం 90,840 ఉద్యోగాలు మాత్రమే వచ్చాయి.

ఐఐటీల్లో చదివినా కొలువు గ్యారెంటీ లేదు

చదువు పూర్తి చేసుకున్న యువతకు ఉద్యోగాలు లభించడం ఏటేటా కష్టంగా మారుతున్నది. గతంలో ఐఐటీల్లో చదివితే క్యాంపస్ రిక్రూట్‌మెంట్‌లోనే కచ్చితంగా మంచి ఉద్యోగం లభిస్తుందనే భరోసా ఉండేది. ఇటీవలి కాలంలో ఈ నమ్మకం కూడా పోతున్నది. దేశంలోని 23 ఐఐటీల్లో దాదాపు 8 వేల మంది విద్యార్థులకు ఈ ఏడాది క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌లో ఉద్యోగాలు లభించలేదని లెక్కలు చెప్తున్నాయి. 2024లో ఐఐటీల్లో క్యాంపస్ ప్లేస్‌మెంట్స్ కోసం 21,500 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా 13,410 మందికి మాత్రమే ఉద్యోగాలు లభించాయి. ఐఐటీల్లో చదివిన వారి పరిస్థితే ఇలా ఉంటే మిగతా విద్యాసంస్థల్లో పట్టభద్రులైన వారికి ఉద్యోగాలు లభించడం మరింత కష్టంగా మారింది. చాలామంది యువతకు చదువుకు తగ్గ ఉద్యోగాలు దొరకక ఏదో ఒక పని చేస్తూ జీవితాన్ని గడుపుతున్నారు.

ఐఐటీ విద్యార్థులకు ఉద్యోగాలు(2024లో)
క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌కు నమోదు చేసుకున్న వారి సంఖ్య: 21,500
ఉద్యోగాలు పొందిన వారు: 13,410
ఉద్యోగాలు లభించని వారు: 8,090



ఇజ్రాయెల్ దాడి వల్ల దక్షిణ లెబనాన్‌లో నేలమట్టమైన ఓ భవనం

లెబనాన్‌పై భూతల దాడులు!

- సిద్ధమవుతున్న ఇజ్రాయెల్ సైన్యం
- 21 రోజుల కాల్పుల విరమణకు అమెరికా, మిత్రపక్షాల ప్రతిపాదన
- తోసిపుచ్చిన ఇజ్రాయెల్ ప్రభుత్వం
- తక్షణం లెబనాన్‌ను వీడాలని భారత పౌరులకు ఎంబసీ సూచన

బీరుట్, సెప్టెంబర్ 26: పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్-హెజ్బొల్లా మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్నది. లెబనాన్‌పై గ్రౌండ్ ఆపరేషన్‌కు (భూతల దాడులకు) ఇజ్రాయెల్ సైన్యం సిద్ధమవుతున్నది. 21 రోజుల కాల్పుల విరమణ పాటించాలని అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాలు చేసిన ప్రతిపాదనను ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. పూర్తిస్థాయిలో హెజ్బొల్లాపై దాడులు చేయాలని సైన్యాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో లెబనాన్ మరో గాజాలా మారనుందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి.

హెజ్బొల్లా అంతానికి పంతం

మొన్నటి వరకు గాజాపై విరుచుకుపడిన ఇజ్రాయెల్ తన లక్ష్యాన్ని ఇప్పుడు లెబనాన్ వైపు మార్చింది. హెజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా గత కొద్ది రోజులుగా ఆ దేశంపై గగనతల, రాకెట్ల దాడులతో విరుచుకుపడుతున్నది. సోమవారం నుంచి లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 630 మంది మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. లెబనాన్ ఉత్తర, తూర్పు ప్రాంతాలపై ఇజ్రాయెల్ 75 లక్షిత దాడులు చేసింది. దీనికి ప్రతిగా లెబనాన్ చేసిన 45 దాడులను తాము సమర్థంగా తిప్పికొట్టినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. తాజాగా ఇజ్రాయెల్ బుధవారం రాత్రి లెబనాన్‌లోని ఒక భవనంపై జరిపిన దాడిలో సిరియా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు 23 మంది మరణించారని లెబనాన్ అధికారి తెలిపారు.

కాల్పుల విరమణకు అగ్రదేశాల యత్నం

రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నివారణకు పలు అగ్రరాజ్యాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలు ఇవ్వడం లేదు. 21 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలంటూ యూఎస్, యూకే, ఈయూ విజ్ఞప్తి చేశాయి. అయితే దీనిని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తోసిపుచ్చారు. హెజ్బొల్లాపై పూర్తిస్థాయిలో దాడి చేయాలని ఆదేశించారు. అదే సమయంలో ప్రస్తుతం లెబనాన్‌పై దాడులు జరుపుతున్నప్పటికీ తమ యుద్ధ లక్ష్యం నెరవేరే వరకు గాజాపై కూడా దాడులు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించాలని లెబనాన్ ప్రధాని నజీబ్ మికాటి కోరారు. న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ గగన దాడులతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలతో జరుగుతున్న దాడుల వల్ల లెబనాన్ పౌరులలో భయం నెలకొందని అన్నారు

లెబనాన్ వీడండి

లెబనాన్‌లో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా అక్కడ నివసిస్తున్న భారత పౌరులు దేశాన్ని విడిచివెళ్లాలని, అక్కడే ఉండాలనుకునే వారు జాగ్రత్తలు పాటించాలని బీరుట్‌లోని భారత ఎంబసీ కార్యాలయం విజ్ఞప్తి చేసింది. ఏదైనా అవసరమైతే బీరుట్‌లోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించాలని కోరింది.

లైవ్ ఇంటర్వ్యూ చేస్తుండగా ఇంటిపై పడ్డ క్షిపణి

లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో లైవ్ టీవీ ఇంటర్వ్యూ జరుపుతున్న లెబనాన్ జర్నలిస్టు ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. మిరయా ఇంటర్నేషనల్ నెట్‌వర్క్ ఎడిటర్-ఇన్-చీఫ్ ఫడీ బౌండ్య ఒక లైవ్ ఇంటర్వ్యూలో ఉండగా, ఇజ్రాయెల్ ప్రయోగించిన మిస్సైల్ ఒకటి అతని ఇంటిని తాకింది. దీంతో ఆయన బిగ్గరగా అరుస్తూ స్క్రీన్‌కు దూరంగా పడ్డారు.

అదానీతో కెన్యా ఒప్పందం రద్దు

- నైరోబీ విమానాశ్రయ విస్తరణకు అగ్రిమెంట్
- వ్యతిరేకిస్తూ పెద్ద ఎత్తున కార్మికుల ఆందోళన
- నిరసనలతో తలొగ్గి ఒప్పందం రద్దు చేసిన కెన్యా



నైరోబి: నైరోబీ ఎయిర్‌పోర్టు విస్తరణ, నిర్వహణ కోసం అదానీ సంస్థతో కుదుర్చుకున్న ఒప్పందాన్ని రద్దు చేయాలని కెన్యా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కెన్యా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ(కేఏఏ)ని కెన్యా జాతీయ అసెంబ్లీ ప్రజా పెట్టుబడుల కమిటీ ఆదేశించింది. టెండరు ప్రక్రియపై ప్రత్యేక ఆడిట్ జరిపే వరకు అదానీ గ్రూప్‌తో తదుపరి ప్రక్రియలను నిలిపివేయాలని సూచించింది. కెన్యా రాజధాని నైరోబీలోని జోమో కెన్యట్ట అంతర్జాతీయ ఎయిర్‌పోర్టు(జేకేఐఏ) ఆధునికీకరణ, 30 ఏండ్ల పాటు నిర్వహణ కోసం అదానీ సంస్థ కెన్యా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీతో ఒప్పందం కుదుర్చుకున్న సంగతి తెలిసిందే. ఈ ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఎయిర్‌పోర్టు కార్మికులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేపట్టారు. దీంతో ఎయిర్‌పోర్టు కార్యకలాపాలు సైతం స్తంభించాయి. పలువురు కెన్యా జాతీయ అసెంబ్లీ సభ్యులు సైతం ఈ ఒప్పందాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అదానీ కంటే ఏఎల్‌జీ అనే స్థానిక సంస్థ మరింత మెరుగైన ప్రతిపాదన చేసినప్పటికీ అదానీకే ఎయిర్‌పోర్టును అప్పగించాలనే నిర్ణయాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. దీంతో ప్రజా పెట్టుబడుల కమిటీ ఈ ఒప్పందాన్ని రద్దు చేయాలని ఆదేశించింది.

పీఎంఎల్‌ఏ నిబంధనలు ఈడీకి ఆయుధాలు కారాదు

రాజ్యాంగ కోర్టులు ఆ అవకాశం ఇవ్వరాదు: సుప్రీం కోర్టు

న్యూఢిల్లీ: హవాలా చట్టంలోని నిబంధనలను అడ్డం పెట్టుకొని నిందితులను దీర్ఘకాలం పాటు నిర్బంధంలో ఉంచుకొనే విధంగా ఈడీని అనుమతించరాదని సుప్రీం కోర్టు ఉన్నత న్యాయస్థానాలకు సూచించింది. బెయిల్ మంజూరు చేసే విషయంలో తమకున్న అధికారాలను వినియోగించాలని సూచించింది. హవాలా చట్టంలోని నిబంధనలు ఈడీకి ఆయుధంగా మారకుండా చూసే బాధ్యత రాజ్యాంగ కోర్టుల (సుప్రీంకోర్టు, హైకోర్టు)దేనని స్పష్టంచేసింది. హవాలా చట్టం కింద ఓ నిందితుడిపై దర్యాప్తు.. పరిమితికి మించి దీర్ఘకాలంపాటు కొనసాగుతున్నప్పుడు, బెయిల్ మంజూరుచేసే విషయంలో రాజ్యాంగ కోర్టులు తమకున్న విచక్షణాధికారాన్ని వినియోగించాలని సూచించింది. డీఎంకే నేత, తమిళనాడు మాజీ మంత్రి సెంథిల్ బాలాజీకి సంబంధించిన హవాలా కేసుపై విచారణ సందర్భంగా కోర్టు పై వ్యాఖ్యలు చేసింది.

కర్ణాటకలో సీబీఐకి నో ఎంట్రీ

- సాధారణ సమ్మతి ఉపసంహరించుకున్న కాంగ్రెస్ సర్కారు
- ముడా స్కామ్ నేపథ్యంలో సిద్ధూ 'ముందుచూపు'
- గవర్నర్‌కు సమాచారం అందకుండా జాగ్రత్తలు



బెంగళూరు, సెప్టెంబర్ 26: ముడా కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యపై విచారణ జరగనున్న నేపథ్యంలో కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో కేసుల విచారణ చేసేందుకు వీలు లేకుండా సీబీఐకి సాధారణ సమ్మతిని గురువారం ఉపసంహరించుకుంది. సిద్ధరామయ్య నేతృత్వంలో జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. సీబీఐ పక్షపాతంతో వ్యవహరిస్తున్నందునే ఈ నిర్ణయం తీసుకున్నట్టు న్యాయశాఖ మంత్రి హెచ్‌కే పాటిల్ ప్రకటించారు. సాధారణ సమ్మతిని ఉపసంహరించుకున్నప్పటికీ కేసును బట్టి సీబీఐ విచారణకు సమ్మతిస్తామని తెలిపారు. ముడా స్థలాల కేటాయింపులో అవకతవకలు జరిగాయనే ఆరోపణలపై సీబీఐ ద్వారానే విచారణ జరిపించాలని ఆర్టీఐ కార్యకర్త స్నేహమయి కృష్ణతో పాటు బీజేపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. ఇందుకోసం హైకోర్టును ఆశ్రయిస్తానని స్నేహమయి కృష్ణ ప్రకటించారు. ఈ నేపథ్యంలోనే సాధారణ సమ్మతిని ఉపసంహరించుకోవడం ద్వారా రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా ప్రభుత్వం తలుపులు మూసేసింది.

మంత్రివర్గ అనుమతి తర్వాతే గవర్నర్ వద్దకు..

ఇక నుంచి మంత్రివర్గ సమ్మతి తర్వాతనే గవర్నర్‌తో ఉత్తర, ప్రత్యుత్తరాలు జరపాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, కార్యదర్శులను మంత్రివర్గం ఆదేశించింది. పలు అంశాలపై తనకు వివరాలు పంపించాల్సిందిగా ఇటీవల సీఎస్‌కు గవర్నర్ లేఖ రాసిన నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది. గవర్నర్ అడిగే వివరాలను ముందుగా మంత్రివర్గానికి సమర్పించి, మంత్రివర్గ నిర్ణయాన్ని అనుసరించి గవర్నర్‌కు వివరాలను పంపించాలని అధికారులకు సూచించినట్టు హెచ్‌కే పాటిల్ తెలిపారు.

గోద్రా అల్లర్ల తర్వాత మోదీ రాజీనామా చేశారా?

తాను రాజీనామా చేసే ప్రసక్తే లేదని కర్ణాటక సీఎం సిద్ధరామయ్య స్పష్టం చేశారు. ప్రధాని మోదీ 2002లో గోద్రా అల్లర్ల తర్వాత రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. సిద్ధరామయ్య రాజీనామా చేయాలని విధాన సౌధ వద్ద బుధవారం బీజేపీ చేసిన నిరసనపై స్పందిస్తూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

సిద్ధరామయ్య తప్పుకోవాల్సిందే

ముడా కుంభకోణంలో పీకల్లోతు కూరుకుపోయిన కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్యకు సొంత పార్టీ నుంచే మరో ఎదురుదెబ్బ తగిలింది. ముఖ్యమంత్రి పదవి నుంచి తప్పుకోవాలని కర్ణాటక కాంగ్రెస్ క్రమశిక్షణా సంఘం అధ్యక్షుడు, మాజీ స్పీకర్ కేబీ కొలివాడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో పార్టీకి ఇబ్బందికర పరిస్థితులు రాకుండా సిద్ధరామయ్య ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని సూచించారు. ఈ కేసులో విచారణను ఎదుర్కోవాలని సిద్ధరామయ్యకు స్పష్టంచేశారు. విచారణ తర్వాత ఆయన మళ్లీ సీఎం కావొచ్చని పేర్కొన్నారు. విపక్ష బీజేపీ, జేడీఎస్‌లు కుమ్మక్కై సిద్ధూను పదవి నుంచి దించడానికి ఒక ప్రైవేట్ వ్యక్తితో ఫిర్యాదు చేయించారని కొలివాడ్ ఆరోపించారు.

5 కోట్ల భూమి బీజేపీ నేతకు ధారాదత్తం

మహాసర్కారు కేటాయింపు

ముంబై: కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని బీజేపీ అధికారంలోని మహారాష్ట్ర ప్రభుత్వం తమ పార్టీ నేతకు అప్పనంగా కట్టబెట్టడంపై రాజకీయ పార్టీలు మండిపడుతున్నాయి. మహారాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు చంద్రశేఖర్ బవాంకులే అధ్యక్షుడిగా ఉన్న శ్రీ మహాలక్ష్మి జగదాంబ సంస్థాన్‌కు నాగపూర్‌లోని కొరాడి ప్రాంతంలో రూ.4.8 కోట్ల విలువైన 5 హెక్టార్ల భూమిని ఉచితంగా కేటాయించారు. సోమవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో ఎలాంటి అజెండా, చర్చ జరపకుండా ఏకగ్రీవంగా దీనిని ఆమోదించారు. ఈ భూమి ధారాదత్తంపై ఆర్థిక, రెవెన్యూ శాఖలు అభ్యంతరం చెప్పినా ప్రభుత్వం పట్టించుకోలేదు. పైగా భూమిని పొందేందుకు ఉండాల్సిన అర్హత, అనుభవం ఆ ట్రస్టుకు లేకపోయినా భూమిని కేటాయించారు. ప్రభుత్వ చర్యపై ప్రతిపక్షాలు మండిపడ్డాయి.

ఏటా వెయ్యి హాలిడే, వర్క్ వీసాలు

ఇండియన్స్‌కు ఆస్ట్రేలియా ఆఫర్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: భారత్‌తో ద్వైపాక్షిక సంబంధాల బలోపేతం కోసం ఆస్ట్రేలియా కీలక నిర్ణయం తీసుకుంది. ఏటా 1000 వరకు వర్క్, హాలిడే వీసాలను భారతీయులకు మంజూరు చేయబోతున్నట్టు గురువారం ప్రకటించింది. ఉద్యోగం, ఉన్నత విద్య, పర్యాటకం నిమిత్తం ఒక ఏడాదిపాటు ఆస్ట్రేలియాలో ఉండేందుకు ఈ వీసా అవకాశం కల్పిస్తుంది. 18 నుంచి 30 ఏండ్ల భారత పౌరులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులు.

ఇంద్రసేనారెడ్డికి మిజోరాం గవర్నర్‌గా అదనపు బాధ్యతలు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డికి మిజోరాం రాష్ట్ర గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం రాష్ట్రపతి భవన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా మిజోరాం గవర్నర్ డాక్టర్ హరి బాబు కంభంపాటి సెలవుపై వెళ్లడంతో ఇంద్రసేనారెడ్డికి అదనపు బాధ్యతలు ఇచ్చారు.



'పరమ్ రుద్ర' సూపర్ కంప్యూటర్ల ఆవిష్కరణ

పుణె, సెప్టెంబర్ 26: దేశీయంగా అభివృద్ధి చేసిన మూడు సూపర్ కంప్యూటర్లను ప్రధాని మోదీ గురువారం ఆవిష్కరించారు. వాతావరణం, వాతావరణ పరిశోధనపై రూ.850 కోట్లతో ఏర్పాటుచేసిన కంప్యూటింగ్ వ్యవస్థను, శాస్త్రీయ పరిశోధన కోసం రూ.130 కోట్లతో పుణె, ఢిల్లీ, కోల్‌కతాలలో ఏర్పాటుచేసిన 'పరమ్ రుద్ర' సూపర్ కంప్యూటర్లను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. కుంభవృష్టి, వేడి గాలు లు, తుఫాన్లు, భారీ వర్షం, వడగండ్ల వాన, కరువు పరిస్థితుల్ని అంచనా వేసేందుకు పుణె, నోయిడాల్లో అత్యంత శక్తివంతమైన కంప్యూటింగ్ వ్యవస్థలను తీసుకొచ్చారు.

రోజువారీ కనీస వేతనం 1,035

కార్మికుల వేతనాలను పెంచిన కేంద్రప్రభుత్వం

న్యూఢిల్లీ: కార్మికుల కనీస వేతనాలు పెరిగాయి. వేరియబుల్ డియర్‌నెస్ అలవెన్స్‌ను సవరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కార్మికుల రోజువారీ కనీస వేతనాన్ని రూ.1,035 వరకు పెంచింది. పనిచేస్తున్న ప్రాంతాన్ని బట్టి ఏ, బీ, సీలుగా వర్గీకరించింది. సవరించిన వేతనాల ప్రకారం 'ఏ' ప్రాంతంలో పనిచేసే నిర్మాణం, ఊడ్వడం, క్లీనింగ్, లోడింగ్, అన్‌లోడింగ్ రంగాలలో పనిచేసే నైపుణ్యం లేని (అన్‌స్కిల్డ్) కార్మికుల రోజువారీ కనీస వేతనం రూ.783 (నెలకు 20,358)గా నిర్ణయించారు. పాక్షిక నైపుణ్య (సెమీ స్కిల్డ్) కార్మికుల రోజువారీ కనీస వేతనం రూ.868 (నెలకు 22,568), నైపుణ్య (స్కిల్డ్) కార్మికులు, క్లర్కులు, ఆయుధం ధరించని వాచ్, వార్డ్‌లకు రోజువారీ కనీస వేతనం రూ.954 (నెలకు 24,804), అత్యంత నైపుణ్యం (హై స్కిల్డ్) కార్మికులకు, ఆయుధం ధరించే వాచ్, వార్డ్‌లకు కనీస వేతనం రూ.1,035 (నెలకు 26,910)గా నిర్ణయించారు. ఈ పెరిగిన కనీస వేతనాల అమలు ఈ ఏడాది అక్టోబర్ 1 నుంచి అమలులోకి వస్తుంది.

'మతంతో సంబంధం లేకుండా గృహహింస చట్టం వర్తింపు'

న్యూఢిల్లీ: గృహ హింస నుంచి మహిళలకు రక్షణ కల్పించే చట్టం-2005 మతం, సామాజిక హోదాతో సంబంధం లేకుండా దేశంలోని మహిళలందరికీ వర్తిస్తుందని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. రాజ్యాంగం ప్రకారం మహిళల రక్షణకు హామీ కల్పించే ఈ చట్టం సివిల్‌కోడ్‌లో భాగమని ధర్మాసనం స్పష్టం చేసింది. తనకు భరణం, నష్టపరిహారం విషయంలో కర్ణాటక హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ ఒక మహిళ దాఖలు చేసిన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది.



ఏఐ సాయంతో అమెరికాలోని రిచ్‌మండ్‌లో వినూత్న వ్యవసాయ ప్రాజెక్టును చేపట్టారు. డ్రిస్‌కాల్స్ కంపెనీ నియంత్రిత పద్ధతిలో, ఇండోర్‌లో, టవర్‌లా స్ట్రాబెర్రీ సాగు చేస్తున్నది. ఏడాదికి 18 లక్షల కిలోల దిగుబడి లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టారు.

21 మందిపై అఘాయిత్యం.. హాస్టల్ వార్డెన్‌కు మరణశిక్ష

అరుణాచల్‌లో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం తీర్పు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: అరుణాచల్ ప్రదేశ్‌లో కొన్నేండ్ల క్రితం వెలుగుచూసిన లైంగికదాడి కేసులో పోక్సో ప్రత్యేక న్యాయస్థానం సంచలన తీర్పు వెలువరించింది. దాదాపు 21 మంది విద్యార్థులపై లైంగికదాడికి పాల్పడిన కేసులో హాస్టల్ వార్డెన్‌కు మరణ శిక్ష విధించింది. ఇదే కేసులో మాజీ ప్రధానోపాధ్యాయుడితోపాటు మరో మహిళా టీచర్‌కు 20 ఏండ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది. పోక్సో చట్టం కింద నిందితుడికి మరణశిక్ష విధించటం దేశంలో ఇదే మొదటిసారి. అరుణాచల్ ప్రదేశ్‌లోని ఓ ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలో లైంగిక దాడుల వ్యవహారం 2022లో బయటపడింది. ప్రభుత్వం 'సిట్' విచారణకు ఆదేశించగా, ఈ దర్యాప్తులో వార్డెన్ అరాచకాలు బయటపడ్డాయి. 2014-22 మధ్యకాలంలో 21 మంది మైనర్లపై లైంగికదాడులు, వేధింపులకు అతడు పాల్పడినట్టు తేలింది. లైంగిక దాడికి పాల్పడేముందు బాధితులకు వార్డెన్ మత్తుమందు ఇచ్చేవాడని వెల్లడైంది.

సమాచార శాఖపై.. అవినీతి 'బాణం'

ఐ అండ్ పీఆర్ శాఖలో భారీ అవినీతి

- **వర్క్ ఆర్డర్లన్నీ 'యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ' కే**
- **మార్చిలోనే దాని అక్రెడిటేషన్‌ను సస్పెండ్ చేసిన ఐఎన్ఎస్**
- **అయినా రూ. పదుల కోట్ల ప్రకటనలు ఇచ్చిన సమాచార శాఖ**
- **మంత్రి సూచించిన కంపెనీని పక్కనపెట్టి మరీ ప్రకటనలు జారీ**
- **తెరవెనుక వ్యవహారం నడిపించిన 'బిగ్ బ్రదర్స్'**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): 'ఇందుగలడందులేడు..' అన్నట్టుగా ప్రభుత్వంలోని అన్ని శాఖలపై బిగ్ బ్రదర్స్ పంజా విసురుతున్నారు. తాజాగా సమాచార, ప్రజా సంబంధాల శాఖపై (ఐ అండ్ పీఆర్) 'బాణం' విసిరారు. వారి అండతో ఐ అండ్ పీఆర్ విభాగంలో కొన్ని నెలలుగా విచ్చలవిడిగా భారీ అవినీతి బాగోతం జరుగుతున్నది. అధికారిక గుర్తింపు లేని సంస్థకు అక్రమంగా రూ.పదుల కోట్ల ప్రకటనలు కట్టబెడుతున్నారు. ఈ క్రమంలో మంత్రి సిఫారసు చేసిన సంస్థను సైతం పక్కన పడేసి.. 'ఇండియన్ న్యూస్ పేపర్స్ సొసైటీ' సస్పెండ్ చేసిన ఏజెన్సీకి విచ్చలవిడిగా వర్క్ ఆర్డర్లు ఇవ్వడం గమనార్హం. ఐ అండ్ పీఆర్ తాజాగా రూపొందించిన ప్యానల్ ఏజెన్సీల్లో ఆ సంస్థ లేకపోవడం మరో విచిత్రం.

ఏజెన్సీలు.. అనుసంధానకర్తలు

ప్రభుత్వం ఏదైనా అంశంపై పత్రికల ద్వారా ప్రచారం చేయాలనుకున్నప్పుడు అడ్వర్టైజింగ్ ఏజెన్సీ ద్వారా పత్రికలకు ప్రకటనలు జారీ చేస్తుంది. ఢిల్లీ కేంద్రంగా నడిచే 'ద ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ' దేశవ్యాప్తంగా ఉన్న అడ్వర్టైజింగ్ ఏజెన్సీలకు అక్రెడిటేషన్ (గుర్తింపు) ఇస్తుంది. ఆ అక్రెడిటేషన్ ఉన్న ఏజెన్సీల్లో కొన్నింటిని ఐ అండ్ పీఆర్ విభాగం ఎంచుకుంటుంది. వీటిని ప్యానల్ ఏజెన్సీలు అని పిలుస్తారు. ప్రతి మూడేండ్లకు ఒకసారి జాబితాను రెన్యువల్ చేస్తుంది. ఈ ఏజెన్సీలు ప్రభుత్వానికి, పత్రికలకు మధ్య అనుసంధానకర్తలుగా వ్యవహరిస్తుంటాయి. ప్రభుత్వం ఇచ్చే ప్రకటనలకు సంబంధించి డిజైన్ రూపొందించడం, వాటిని పత్రికలకు ఇవ్వడం, ప్రభుత్వం నుంచి బిల్లులు వసూలు చేసి పత్రికలకు అందజేయడం వంటివి వాటి బాధ్యత. ప్రభుత్వం ఒక ప్రకటన జారీ చేసే ముందు డిజైన్లు సమర్పించాలని ప్యానల్ ఏజెన్సీలకు సూచిస్తుంది. ఉత్తమ డిజైన్‌ను గుర్తించి ఆ ఏజెన్సీకి వర్క్ ఆర్డర్ ఇచ్చి, ప్రకటనలు జారీ చేస్తుంది. ప్రకటన జారీ అయిన 60 రోజుల్లోగా ఏజెన్సీలు ప్రభుత్వం నుంచి బిల్లులు వసూలు చేయించి, పత్రికలకు చెల్లించాల్సి ఉంటుంది. ఇందులో కొంత భాగం ఏజెన్సీలకు కమిషన్‌గా వెళ్తుంది. ఈ ఏజెన్సీల పనితీరుపై ఎప్పటికప్పుడు ఐఎన్ఎస్ సమీక్షిస్తుంది. సరిగా పనిచేయని ఏజెన్సీల అక్రెడిటేషన్‌ను సస్పెండ్ చేస్తుంది.

మార్చిలోనే సస్పెన్షన్.. అయినా ఆర్డర్

రాష్ట్రంలో దాదాపు 50కిపైగా ప్యానల్ ఏజెన్సీలు ఉన్నాయి. ఇందులో 'యారో అడ్వర్టైజింగ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' ఏజెన్సీ ఒకటి. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు దాదాపు రూ.110 కోట్ల మేర పత్రికలకు ప్రకటనలు ఇచ్చినట్టు సమాచారం. ఇందులో 80-90 శాతం ప్రకటనల ఆర్డర్లు యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీకే దక్కాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అయితే.. యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ అక్రెడిటేషన్‌ను ఐఎన్ఎస్ ఈ ఏడాది మార్చి 22న సస్పెండ్ చేసింది. సంస్థ నుంచి పత్రికలకు బిల్లుల చెల్లింపుల తీరు సరిగా లేకపోవడం వల్ల ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు అందులో పేర్కొన్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం ఆగకుండా 'యారో' కంపెనీకి ప్రకటనల ఆర్డర్లు కట్టబెడుతూనే ఉన్నది. తాజాగా.. ఈ నెల 13వ తేదీన రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ, సీతారామా లిఫ్ట్ ప్రారంభానికి సంబంధించిన ప్రకటనలను యారో ఏజెన్సీ ద్వారానే ఇచ్చింది. మొత్తం 31 పత్రికల్లో ప్రకటనలకు రూ.10.10 కోట్ల ఆర్డర్ ఇచ్చారు. ఇదొక్కటే కాదని, ఐఎన్ఎస్ సస్పెండ్ చేసిన తర్వాత ఐ అండ్ పీఆర్ నుంచి రూ.పదుల కోట్ల వర్క్ ఆర్డర్ ఇచ్చిందని చెప్తున్నారు. జూన్‌లోనూ రూ.1.50 లక్షల వరకు రుణమాఫీ పేరుతో 31 పత్రికలకు రూ.7.34 కోట్ల వర్క్ ఆర్డర్


GOVERNMENT OF TELANGANA
DEPARTMENT OF INFORMATION & PUBLIC RELATIONS: HYDERABAD



'యారో'కు ప్రకటనలిస్తూ ఐ అండ్ పీఆర్ ఇచ్చిన ఆర్డర్, 'యారో'కు అక్రెడిటేషన్ రద్దు చేస్తూ ఐఎన్ఎస్ ఆర్డర్

ఇచ్చిందని చెప్తున్నారు. వారం రోజుల కిందట ఐ అండ్ పీఆర్ విభాగం తయారుచేసిన ప్యానల్ ఏజెన్సీల జాబితాలోనూ యారో సంస్థకు చోటు దక్కలేదు. దీనిని బట్టే కంపెనీ పరిస్థితి అర్థం చేసుకోవచ్చు.

మంత్రి చెప్పినా పట్టించుకోలే

యారోతో సమానంగా తమ సన్నిహితులకు చెందిన కంపెనీకి కూడా వర్క్ ఆర్డర్లు ఇవ్వాలని ఓ మంత్రి స్వయంగా ఈ ఏడాది మార్చిలో సిఫారసు చేసినట్టు సమాచారం. దీంతో మొహమాటానికి రెండు నెలలపాటు కొంత ఆర్డర్లు ఇచ్చారని చెప్పుకుంటున్నారు. కానీ.. ఆ తర్వాత మళ్లీ ఆర్డర్లు మొత్తం యారో కంపెనీకే కట్టబెట్టారని చెప్పుకుంటున్నారు. అదేమని అడిగితే.. ఎవరికి ప్రకటనలు ఇవ్వాలో 'బిగ్ బ్రదర్స్' ఆదేశిస్తున్నారని, తాము పాటిస్తున్నామని అధికారులు చెప్తున్నారని సమాచారం. సాధారణంగా ప్రభుత్వాలు ఒక ప్రకటనను రెండుమూడు ఏజెన్సీలకు కలిపి ఇస్తుందని, దీంతో అన్నింటికీ పని దొరుకుతుందని చెప్తున్నారు. ఒకటి రెండు ఏజెన్సీలకు కొద్దిగా ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం కూడా సహజమేనన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం మొదటి నుంచీ ఏకపక్షంగా యారోకే వర్క్ ఆర్డర్లు ఇచ్చినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో మిగతా ఏజెన్సీలకు పనిలేకుండా, దివాళా తీసే పరిస్థితి తలెత్తిందని నిర్వాహకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బిల్లులు ఎలా చెల్లిస్తారు?

ఐఎన్ఎస్ ప్రకారం యారో అడ్వర్టైజింగ్ ఏజెన్సీ గుర్తింపు ఈ ఏడాది మార్చిలోనే రద్దయింది. నిబంధనల ప్రకారం ఆ ఏజెన్సీకి ఐ అండ్ పీఆర్ వర్క్ ఆర్డర్ ఇవ్వరాదు. కానీ తెలంగాణలో యారో ఏజెన్సీకి మార్చి తర్వాత సైతం విచ్చలవిడిగా వర్క్ ఆర్డర్లు జారీ అయినట్టు చెప్తున్నారు. మరి గుర్తింపు లేని కంపెనీకి ప్రభుత్వం బిల్లులు ఎలా చెల్లిస్తుందని నిపుణులు ప్రశ్నిస్తున్నారు. యారో ఏజెన్సీ బాగోతం తెలిసిన కొన్ని పత్రికలు ఆ ఏజెన్సీ ఇచ్చిన ప్రకటనలు వేసేందుకు ఒప్పుకోలేదట. దీంతో థర్డ్ పార్టీ ఏజెన్సీల ద్వారా ప్రకటనలు వేయించినట్టు చెప్పుకుంటున్నారు. ఇది కూడా నిబంధనలకు విరుద్ధమని స్పష్టం చేస్తున్నారు. మరి పత్రికలకు ఆ బిల్లులు ఎలా చెల్లిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. ఐ అండ్ పీఆర్ శాఖలో జరిగిన ఈ అవినీతిని పూర్తిగా వెలికి తీసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు.

'రామప్ప'ను కాపాడుకోవాలి

- **ఆలయం దగ్గరలో ఓపెన్‌కాస్ట్ వద్దు**
- **సుప్రీం కోర్టు గైడ్‌లైన్స్ పాటించాలి**
- **బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మీనర్సింహారావు**



ములుగు, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప ఆలయాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని బీఆర్ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకుల మర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ ఇటీవల రామప్ప ఆలయం వర్షాలకు కురవడం, గొల్లగుడిని గుర్తుతెలియని దుండగులు ధ్వంసం చేసి గుప్తనిధుల కోసం శివలింగాన్ని తొలగించడం బాధాకరమని చెప్పారు. సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్‌ను పాటించకుండా సింగరేణి ఓపెన్ కాస్ట్ పనులు చేపడితే ఊరుకునేది లేదని, ప్రజలతో కలిసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

ఓరుగల్లు టూరిజానికి బొగ్గు మసి

- **రామప్ప వద్ద మైనింగ్‌తో పెనుముప్పు**
- **రామప్ప చెరువు, కోటగుళ్లు, లక్నవరం, మేడారంపైనా 'ఓపెన్ కాస్ట్' ప్రభావం**
- **ఇప్పటిదాకా ఎటుచూసినా ఆహ్లాదకరం**
- **తెలంగాణకు తలమానికంగా పర్యాటక ప్రాంతం**
- **బొగ్గుగనితో బొందలగడ్డగా మారే ప్రమాదం**

వరంగల్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : రామప్ప ఆలయం అనగానే గుర్తుకొచ్చేది ఓరుగల్లు.. అనేక పర్యాటక ప్రాంతాలతో అలరారుతూ విదేశీ పర్యాటకులను సైతం ఆకర్షిస్తున్న ఈ 'కాకతీయ సామ్రాజ్యం'లో రామప్ప ఆలయానికే కాదు, దాని దరిదాపులో ఉన్న రామప్ప చెరువు, లక్నవరం సరస్సు, కోటగుళ్లు, సమ్మక్క-సారలమ్మలు కొలువైన మేడారంపైనా 'మైనింగ్' ప్రభావం తీవ్రంగా పడనున్నది. ప్రశాంతతకు, పర్యావరణ సమతుల్యానికి చిరునామాగా నిలిచిన ఈ ప్రాంతమంతా సింగరేణి ఆధ్వర్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటుచేసే 'ఓపెన్ కాస్ట్'గనితో బొందలగడ్డగా మారనున్నది. పచ్చని చెట్లు, గుట్టలు, సరస్సులు, కాయతీయుల ఆలయాలన్నీ మట్టికొట్టుకుపోయే ప్రమాదమున్నది. గని నుంచి తవ్విపోసిన బూడిద కొండలతో ఈ ప్రాంతాన్ని వరదలు కూడా ముంచెత్తే అవకాశమున్నది.

మిగిలేది బూడిదే..!

దేశ విదేశాల నుంచి వచ్చే భక్తులు, సందర్శ



కులకు రామప్ప రిలీఫ్ ఇచ్చే ఎకో టూరిజం స్పాట్‌గా అవతరించింది. దేశంలోనే గొప్ప పర్యాటక ప్రదేశంగా మారింది. యునెస్కో గుర్తింపు తర్వాత ఆలయానికి వచ్చే భక్తులు, పర్యాటకుల సంఖ్య విపరీతంగా పెరిగింది. రామప్ప కేంద్రంగా చుట్టూ 25 కిలోమీటర్ల వరకు పర్యాటక ప్రదేశానికి నెలవుగా మారింది. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ చర్యలతో ఇప్పుడు ఈ ప్రదేశం ఉనికే ప్రమాదంలో పడింది. పర్యాటక ప్రాంతం నడిబొడ్డున ఏర్పాటయ్యే సింగరేణి కాలరీస్ కంపెనీ ఓపెన్ కాస్టు మైనింగ్‌తో ఈ ప్రదేశమంతటా బూడిదే వ్యాపించనున్నది. గనిలో పేలుళ్లతో సుమారు రెండు కిలోమీటర్ల వరకు భూ ప్రకంపనలు ఉంటాయి. బొగ్గు పెళ్లలు, రాళ్లు కిలోమీటర్ల దూరం వరకు ఎగిరి పడతాయి. పేలుళ్ల కారణంగా భూపాలపల్లిలోని ఓపెన్ కాస్ట్ సమీపంలో ఉన్న దుర్గంరామయ్యగడ్డలో ఇండ్లను సింగరేణి అధికారులు ఖాళీ చేయించారు. గడ్డిగానిపల్లిని తరలించేందుకు ఏర్పాట్లు కూడా పూర్తయ్యాయి. గణపురం మండలంలో కొనసాగుతున్న ఓపెన్ కాస్టు 3 పరిధిలోని మాధవరావుపల్లినీ ఖాళీ చేయించారు. కొండంపల్లిని తరలించే ప్రక్రియ వేగవంతం చేశారు.

ఇక్కడే ఎందుకు?

సింగరేణి కాలరీస్ కంపెనీ పరిధిలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి మంచిర్యాల వరకు బొగ్గు నిక్షేపాలు, గనులు విస్తారంగా ఉన్నాయి. బొగ్గు ఉన్నట్టు నిర్ధారించి తవ్వకాలు మొదలుపెట్టేందుకు సిద్ధంగా ఉన్న ప్రాంతాలున్నాయి. ఇవన్నీ పక్కనబెట్టి సింగరేణి కాలరీస్ కంపెనీ రామప్ప ప్రాంతంలోనే ఓపెన్‌కాస్ట్ గనుల ఏర్పాటు కోసం వేగంగా కదులుతుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బొగ్గు అందరి అవసరాలు తీర్చేదైనప్పటికీ చారిత్రక సంపద, పర్యావరణం, జీవావరణాన్ని దెబ్బతీసేలా ఈ ప్రాంతంలో ఓపెన్ కాస్టులు ఏర్పాటు చేయడం సరికాదని పర్యావరణ, పురావస్తు నిపుణులు అంటున్నారు. సింగరేణి కాలరీస్ కంపెనీకి భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ఓపెన్ కాస్టు 1 మూతపడగా.. ఓపెన్ కాస్ట్, గణపురం మండలంలోని ఓపెన్ కాస్టు 3లో బొగ్గు ఉత్పత్తి జరుగుతున్నది. దీనికి కొనసాగింపుగా రామప్ప ఆలయం ఉన్న వెంకటాపూర్ మండలం మీదుగా ములుగు వరకు ఓపెన్ కాస్టు 4, ఓపెన్ కాస్టు 5 గనుల ఏర్పాటుకు భూసేకరణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

బూడిద గుట్టలతో వరద ముంపు

ఆరు జిల్లాల పరిధిలో సింగరేణి సంస్థ బొగ్గు గనులు విస్తరించి ఉన్నాయి. ప్రస్తుతం 22 భూగర్భ, 18 ఓపెన్ కాస్ట్ గనులున్నాయి. ఓపెన్ కాస్ట్‌లో భాగంగా భూమి లోపలి పొరల్లో నిక్షిప్తమైన బొగ్గును బయటకు తీసే క్రమంలో ముందుగా భూ ఉపరితలంలో ఉన్న మట్టిని తొలగించాల్సి గనుల స్వభావాన్ని బట్టి టన్ను బొగ్గుకు సగటున ఐదు టన్నుల వరకు మట్టి తొలగించాల్సి ఉంటుంది. ఇలా తొలగించే మట్టిని ఓవర్ బర్డెన్ (ఓబీ)గా పిలుస్తారు. ఓబీ మట్టిని గని వెలుపల పోస్తుంటారు. మొదట్లో మట్టి కుప్పలను భూమి నుంచి 60 మీటర్ల ఎత్తు వరకు పోసేందుకు అనుమతి ఉండేది. తర్వాత 90 మీటర్లకు, మూడేళ్ల కిందట 120 మీటర్లకు పెంచారు. ఇప్పుడు 150 మీటర్లకు పెంచేందుకు ప్రతిపాదనలు సైతం సిద్ధం చేశారు. ఇదే జరిగితే మైనింగ్ కోసం తవ్వే మట్టి గుట్టలు కొండంత ఎత్తులో ఉండనున్నాయి. ఓపెన్ కాస్టు గనుల ప్రాంతంలో అంతా అడవులే ఉంటాయి. ఇక్కడ భారీ వర్షాలు కురిసినప్పుడు దిగువ భాగంలో ఆకస్మికంగా వరదలు వస్తున్నాయి. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో ఈ నెల మొదటి వారంలో 25 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఓబీ మట్టి గుట్టల మీదుగా వచ్చిన వరద రక్షణ కందకాలను దాటుకొని దిగువనున్న మణుగూరు పట్టణంలోకి ప్రవేశించింది. లోతట్టు ప్రాంతం, నాలాలకు ఇరువైపులా వరదలు వచ్చాయి. రామప్ప ప్రాంతంలోనూ ఓపెన్ కాస్ట్ గనులు చేపడితే మట్టి గుట్టల నుంచి వచ్చే వరద నీరు ఒంపుగా ఉండే రామప్ప చెరువు వైపే ప్రవహించే అవకాశం ఉంటుంది. చెరువు ముందు ఉండే రామప్ప ఆలయం వరద ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. ఇక్కడి ఊరు, అటవీపై వరద పోటెత్తనున్నది.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, టీ రవీందర్‌రావు

'రామప్ప' పరిరక్షణకు ఉద్యమిస్తాం

- **బొగ్గు గని తవ్వకాల నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి**
- **ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, టీ రవీందర్ రావు**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఓపెన్ కాస్ట్ మైనింగ్‌తో ములుగు జిల్లా రామప్ప దేవాలయానికి ముప్పు వాటిల్లుతుందని ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వం ఓపెన్ కాస్ట్ మైనింగ్ ప్రతిపాదనను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. రామప్పకు యునెస్కో ఇచ్చిన గుర్తింపు రద్దయ్యే ప్రమాదం ఉందని అన్నారు. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే, మంత్రి సీతక్క సీఎం దృష్టికి తీసుకెళ్లి బొగ్గుగని తవ్వకం ఆలోచనను విరమింపజేయాలని కోరారు. తెలంగాణ భవన్‌లో గురువారం ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, టీ రవీందర్‌రావు మీడియాతో మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలోనే 2012లో రామప్ప దేవాలయం సమీపంలో బొగ్గు గని తవ్వకాలను చేపట్టాలని ప్రభుత్వం ప్రయత్నిస్తే ఉద్యమ నాయకుడు కేసీఆర్ నాడు దానిని తీవ్రంగా వ్యతిరేకించారని పోచంపల్లి గుర్తుచేశారు. రామప్ప చెరువులకు దేవాదుల నీటిని తరలించేందుకు సొరంగాలు తవ్వాలన్న ఇంజనీర్ల ప్రతిపాదనకు ప్రత్యామ్నాయంగా పైప్‌లైన్ ద్వారా నీటిని తీసుకొచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. కేసీఆర్ సీఎంగా ఉన్న సమయంలోనే రామప్ప ఆలయానికి యునెస్కో గుర్తింపు వచ్చే విధంగా కృషి చేశారని తెలిపారు. రామప్ప దేవాలయాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి ఎన్నో నిధులు వెచ్చించారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక మళ్లీ రామప్ప ఆలయం సమీపంలో ఓపెన్ కాస్ట్ మైనింగ్‌ను చేపట్టడానికి హడావుడిగా ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పేలుళ్లు చేపడితే దేవాలయానికి ప్రమాదం జరుగుతుందని చెప్పారు. ఒక వేళ ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే కోర్టుకు వెళతామని, ఆందోళనకు కార్యాచరణను ప్రకటిస్తామని హెచ్చరించారు.

జిల్లా ప్రజలు సహించరు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రామప్ప, సమ్మక్క సారలమ్మ ఆలయాలు, భద్రకాళి, వేయిస్తంభాల దేవాలయం ఎంతో ప్రాముఖ్యమైనవని ఎమ్మెల్సీ రవీందర్‌రావు అన్నారు. చారిత్రక ఆనవాళ్లను చెరిపేయవద్దని కోరారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన రామప్ప ఆలయానికి ఓపెన్ కాస్ట్ మైనింగ్‌తో తీవ్ర నష్టం వాటిల్లుతుందని చెప్పారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తే జిల్లా ప్రజలు సహరించని హెచ్చరించారు. సమావేశంలో బీఆర్ఎస్ నేత వాసుదేవరెడ్డి పాల్గొన్నారు.

సొంత గూటికి హౌసింగ్ కార్పొరేషన్ ఉద్యోగులు

ఇందిరమ్మ ఇండ్ల కోసం డిప్యూటేషన్ రద్దు

హైదరాబాద్, సెప్టెంబర్ 26(నమస్తే తెలంగాణ): వివిధ ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో డిప్యూటేషన్‌పై పనిచేస్తున్న తెలంగాణ రాష్ట్ర గృహనిర్మాణ సంస్థ(టీజీహెచ్‌సీఎల్) ఉద్యోగులు తిరిగి సొంత గూటికి చేరుకోనున్నారు. వారి డిప్యూటేషన్‌ను రద్దు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం అమలు కోసం ప్రభుత్వం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొంది. హౌసింగ్ కార్పొరేషన్‌కు చెందిన మొత్తం 242 మంది రెగ్యులర్ ఉద్యోగులు డిప్యూటేషన్‌పై వివిధ శాఖల్లో పనిచేస్తుండగా, అందులో కలెక్టర్ ఆఫీసుల్లో పనిచేస్తున్న 148 మంది, టీజీఆర్ఎస్‌సీఎల్‌లో పనిచేస్తున్న 9 మంది మినహా మిగిలినవారు తమ సొంత శాఖకు బదిలీ అయ్యేలా ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

అధికారికంగా 'కాకా' వర్ధంతి

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): మాజీ కేంద్ర మంత్రి జీ వెంకటస్వామి (కాకా) వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఇకపై ఏటా డిసెంబర్ 22న అధికారికంగా నిర్వహిస్తామని గురువారం సీఎస్ శాంతికుమారి ఉత్తర్వులు జారీచేశారు.

తప్పుల తడకగా జీవోలు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ప్రభుత్వం విడుదల చేస్తున్న అనేక జీవోలు తప్పుల తడకగా ఉంటున్నాయి. అధికారులు నిర్లక్ష్యంగా జీవోలు విడుదల చేస్తుండటంతో ప్రభుత్వం అభాసుపాలవుతున్నది. తాజాగా మాజీ కేంద్ర మంత్రి జీ వెంకటస్వామి వర్ధంతిని అధికారికంగా నిర్వహిస్తున్నట్టుగా గురువారం విడుదలైన జీవోలో కాకాను మాజీ ఎంపీగా మాత్రమే సంబోధించారు. తర్వాత నాలుక కరుచుకొని, మార్పులు చేశారు. ఇటీవల విజిలెన్స్ కమిషన్‌గా మాజీ ఐఏఎస్ అధికారి ఎంజీ గోపాల్‌ను నియమిస్తూ విడుదల చేసిన జీవోలో 2022గా పేర్కొన్నారు. వైద్యారోగ్య శాఖ విడుదల చేసిన ల్యాబ్ టెక్నీషియన్ రిక్రూట్‌మెంట్ ఉత్తర్వుల్లో 2023గా పేర్కొన్నారు. ఇలా అనేక జీవోల్లో పాత తేదీలనే కొనసాగించారు. పర్యవేక్షణ లోపంతోనే తప్పులు జరుగుతున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి.




సమీక్షలో అధికారులను నిలదీస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

సర్కారు మారగానే కరెంటు కోతలా?

- **బీఆర్ఎస్ ఉన్నప్పుడు 24 గంటలు ఇచ్చి.. ఇప్పుడివ్వరా?**
- **కరెంట్ డిపార్ట్‌మెంట్ వరెస్ట్..**
- **ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ఫైర్**

మరికల్, సెప్టెంబర్ 26: 'బీఆర్ఎస్ ప్రభుత్వంలో 24 గంటల కరెంట్ ఇచ్చి.. గవర్నమెంట్ మారగానే ప్రస్తుతం ఎందుకు విద్యుత్తు సరఫరాలో కోతలు పెడుతున్నారు. విధుల్లో అధికారులు నిర్లక్ష్యం చేస్తే సహించేది లేదు. పనిచేయడం ఇష్టం లేకపోతే బదిలీపై వెళ్లండి' అంటూ విద్యుత్తు అధికారులపై నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. గురువారం నారాయణపేట జిల్లా మరికల్ మండల కేంద్రంలోని సూర్య చంద్ర ఫంక్షన్‌హాల్‌లో మరికల్, ధన్వాడ మండలాల అధికారులతో నిర్వహించిన సమీక్షకు ఎమ్మెల్యే హాజరయ్యారు. గత ప్రభుత్వం రైతులకు ఉచితంగా విద్యుత్తు స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు ఇచ్చిందని, ప్రభుత్వం మారగానే అవి ఎందుకు ఇవ్వడం లేదో వివరించాలన్నారు. కరెంట్ రావడం లేదన్నవాళ్లు చేతులు ఎత్తండని ఎమ్మెల్యే సూచించగా అక్కడున్న పలువురితోపాటు ఎమ్మెల్యే చేయి పైకెత్తి విద్యుత్తు శాఖ పనితీరును ఎండగట్టారు.

కరెంట్ కోసం గిరిజనుల ధర్నా



మూడు రోజులుగా కరెంట్ సరఫరా లేకపోవడంతో గిరిజనులు కన్నెర్ర చేశారు. మహబూబ్‌నగర్ జిల్లా లింగాయిపల్లి అనుబంధ గ్రామం ముందలితండావాసులు గురువారం మహబూబ్‌నగర్-తాండూరు రహదారిపై బైఠాయించారు. - మహ్మదాబాద్

కాల్మొక్తా సారూ.. ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పించండి



'కాల్మొక్తా సారూ.. ట్రాన్స్‌ఫార్మర్ ఇప్పించండి' అంటూ యాదాద్రి భువనగిరి జిల్లా గుండాలకు చెందిన రైతు గోపాల్‌దాస్ అయిలయ్య అదనపు కలెక్టర్ బెన్‌షాలోమ్ కాళ్లు మొక్కారు. గురువారం తాసీల్దార్ కార్యాలయానికి వచ్చిన అదనపు కలెక్టర్‌తో ఆయన తన సమస్యను విన్నవించాడు. దీంతో సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. -గుండాల

ఎమ్మెల్యే ఆదినారాయణకు ముచ్చెమటలు!

- **కాంగ్రెస్ ఎమ్మెల్యేపై 'రచ్చబండ'లో ప్రశ్నల వర్షం**
- **రుణమాఫీ, పింఛన్ల పెంపుపై గ్రామస్థుల నిలదీత**
- **మైక్ ఇవ్వడానికి కాంగ్రెస్ కార్యకర్తల నిరాకరణ**



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మహ్మద్‌నగర్‌లో ఎమ్మెల్యే ఆదినారాయణ చేపట్టిన రచ్చబండలో సమస్యలపై ప్రశ్నిస్తున్న యువకులు, గ్రామస్థులను అడ్డుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

చంద్రుగొండ, సెప్టెంబర్ 26: పల్లెల్లో సమస్యలు తెలుసుకునేందుకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ గురువారం చంద్రుగొండ మండలం మహ్మద్‌నగర్ గ్రామంలో చేపట్టిన 'రచ్చబండ'.. ప్రజల తిరుగుబాటుతో రసాభాసగా మారింది. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, గ్రామంలో పేరుకుపోయిన సమస్యలు ఎప్పుడు పరిష్కరిస్తారని ఎమ్మెల్యేపై ప్రజలు ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో గ్రామస్థులకు మైక్ ఇవ్వకుండా కాంగ్రెస్ నాయకులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదినారాయణ మాట్లాడుతూ.. మహ్మద్‌నగర్ గ్రామంలో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించేందుకే అధికారుల సమక్షంలో రచ్చబండ కార్యక్రమాన్ని ప్రారంభించానని తెలిపారు. తాను ఈ గ్రామాన్ని దత్తత తీసుకుంటున్నానని, ఏమైనా సమస్యలు ఉంటే చెప్తే.. వాటిని పరిష్కరిస్తారని పేర్కొన్నారు. వెంటనే గ్రామస్థులు కమాల్, లాల్ అహ్మద్, కరీంబీ, హుస్సేన్, బాద్‌షా, అజ్గర్, ఖాసీలు తమ గ్రామంలోని సమస్యలను ఏకరువుపెట్టారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా రైతుల రుణమాఫీ పూర్తిగా కాలేదని, పెంచిన పెన్షన్లను ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారని, మహిళలకు ఇస్తామన్న రూ.2,500 ఎప్పటి నుంచి ఇస్తారని ప్రశ్నించారు. గ్రామంలో ఐదు నిమిషాలకోసారి కరెంటు పోతున్నదని, తాగునీరు సైతం సక్రమంగా సరఫరా చేయడం లేదని, కొత్త ఇండ్లు నిర్మించుకుంటే ఇంటి నెంబర్లు ఇవ్వడం లేదని ఆరోపించారు. దీంతో అక్కడే ఉన్న కాంగ్రెస్ నాయకులు గ్రామస్థులను అడ్డుకున్నారు. ఎమ్మెల్యే కలుగజేసుకొని వారిని సముదాయించారు. టెక్నికల్ సమస్యతో రుణమాఫీ కాని వారికి త్వరలోనే అవుతుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

ఎన్ఎఫ్ఐఆర్‌టీడబ్ల్యూ జాతీయ ఉపాధ్యక్షుడిగా ఈదురు వెంకన్న

వర్కింగ్ కమిటీ సభ్యుడిగా పాటి అప్పారావు ఎన్నిక



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ (ఎన్ఎఫ్ఐఆర్‌టీడబ్ల్యూ) జాతీయ ఉపాధ్యక్షుడిగా ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఆర్టీసీ జాక్ చైర్మన్ ఈదురు వెంకన్న ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బెంగళూరులో రెండ్రోజులు జరిగిన ఎన్ఎఫ్ఐఆర్‌టీడబ్ల్యూ జాతీయ మహాసభలు గురువారం ముగిశాయి. ఈ సందర్భంగా జాతీయ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఆర్టీసీ ఈయూ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.



మింట్‌కాంపౌండ్ వద్ద ధర్నాలో పాల్గొన్న విద్యుత్తు కార్మికులు

ఆర్టిజన్లను రెగ్యులర్ చేయాల్సిందే!

- **ఆ తర్వాతే ఇతర ఉద్యోగాలను భర్తీచేయాలి**
- **తెలంగాణ విద్యుత్తు ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తేతెలంగాణ): రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 19,587 మంది ఆర్టిజన్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ జేఏసీ చైర్మన్ ఈశ్వర్‌రావు, కన్వీనర్ ఎంఏ వజీర్ ట్రాన్స్‌కో, డిస్కంల యాజమాన్యాలను డిమాండ్ చేశారు. ఇదే డిమాండ్‌తో జేఏసీ ఆధ్వర్యంలో గురువారం 2వేల మంది కార్మికులు హైదరాబాద్ మింట్ కాంపౌడ్ వద్ద ఆందోళనకు దిగారు. ఎస్పీడీసీఎల్ ఆఫీసు ఎదుట 2గంటలపాటు బైఠాయించారు. ప్రభుత్వ, యాజమాన్య వ్యతిరేక నినాదాలు హోరెత్తాయి. వెంటనే న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం ఎస్పీడీసీఎల్ చైర్మన్ ముషారఫ్ అలీకి వినతిపత్రం సమర్పించారు.

కేంద్రం సహకారంతోనే ఇందిరమ్మ ఇండ్లు!

- **సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

హైదరాబాద్, సెప్టెంబర్ 26(నమస్తే తెలంగాణ) : కేంద్ర ప్రభుత్వం సహకరిస్తే ఈ ఏడాది ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసేందుకు కూడా సిద్ధంగా ఉన్నామని, ఆయా ఇండ్లపై కేంద్రం బ్రాండింగ్ వేసేందుకు కూడా వెనుకాడబోమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఇందిరమ్మ ఇండ్ల పథకంపై బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి పలు కీలక వ్యాఖ్యలు చేసినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. రాష్ట్రంలో ఇల్లు లేని పేదల సమగ్ర డాటాను కేంద్రానికి పంపాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించినట్టు తెలిసింది. కేంద్రం ఇచ్చే నిధులకు అదనంగా రాష్ట్రం వాటాగా ఇవ్వాల్సిన నిధులను హౌసింగ్‌బోర్డు భూములు, రాజీవ్ స్వగృహ ఇండ్లు విక్రయించి సమకూర్చుకోవాలని దిశానిర్దేశం చేసినట్టు సమాచారం.

ఏఈఈలకు ఉద్యోగ నియామకపత్రాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : ఇరిగేషన్ శాఖలో సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, అగ్రికల్చర్ విభాగాల్లో కలిపి దాదాపు 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్(ఏఈఈ)లను ఎంపిక చేయగా, జలసౌధలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఇరిగేషన్‌శాఖ మంత్రి ఉత్తమ్‌తో కలిసి వారికి నియామకపత్రాలు అందజేశారు. అనంతరం సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల భావోద్వేగం నీళ్లతో ముడిపడి ఉందని, అందుకు అనుగుణంగా నీళ్లను ప్రజలకు అందించాల్సిన బాధ్యత ఇంజినీర్లపై ఉందన్నారు. అనంతరం ఇరిగేషన్ ఉన్నతాధికారులతో భేటీ అయ్యారు. సాగునీటిపారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, ప్రత్యేక కార్యదర్శి జీవన్‌పాటిల్, ఈఎన్సీలు, చీఫ్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

సీఎం గారూ.. ఇవి కాళేశ్వర జలాలే..



అధికారులు జీవితంలో ఎలాంటి తప్పు చేయకూడదో దానికి ఉదాహరణ కాళేశ్వరం ప్రాజెక్టు అని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. నీటిపారుదల శాఖలో కొత్తగా ఎంపికైన 700 మంది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లకు గురువారం నియామక పత్రాల అందజేత సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. పైఅధికారులు చెప్పారని నాణ్యత, నిబద్ధత విషయంలో రాజీపడితే ప్రాజెక్టులు దీర్ఘకాలం నిలబడవని కాళేశ్వరం ప్రాజెక్టును ఉద్దేశించి వ్యాఖ్యానించారు. సీఎం ఆరోపణలు అబద్ధమని చెప్పే దృశ్యం సైతం గురువారం ఆవిష్కృతమైంది. నిలబడని ప్రాజెక్టు అన్న కాళేశ్వరం నుంచి ఎదురెక్కిన జలాలు మల్లన్నసాగర్‌ను నింపి, కిందికి రావడంతో నీటితోయాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని గంధమల్ల చెరువు మత్తడి దుంకింది. **- ఆలేరు రూరల్**

దుబ్బాకలో ప్రొటోకాల్ రగడ

- **‘కల్యాణలక్ష్మి’ పంపిణీలో రసాభాస**
- **కాంగ్రెస్ నేత, బీఆర్ఎస్ ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మధ్య వాగ్వాదం**
- **పోలీసులపై బీఆర్ఎస్ శ్రేణుల నిరసన**



దుబ్బాకలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీలో సభావేదికపైకి వచ్చిన దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి మధ్య వాగ్వాదం

దుబ్బాక, సెప్టెంబర్ 26: సిద్దిపేట జిల్లా దుబ్బాకలో గురువారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం రసాభాసగా మారింది. సభావేదికపై పాటించాల్సిన ప్రొటోకాల్ అంశంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పోటాపోటీగా నినాదాలు చేయడంతో సభా ప్రాంగణం దద్దరిల్లింది. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్‌ను పాటించకుండా కాంగ్రెస్ నాయకులు కొందరు సభావేదికపైకి రావడంతో గొడవ తలెత్తింది. దుబ్బాకలోని రజినీకాంత్‌రెడ్డి ఫంక్షన్‌హాల్‌లో కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా అటవీ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, మెదక్ ఎంపీ రఘునందన్‌రావు హాజరయ్యారు. మంత్రి సురేఖకు స్థానిక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు. అనంతరం మెదక్ ఎంపీ రఘునందన్‌రావు మంత్రిని దుబ్బాక చేనేతల నూలు దండతో సన్మానించారు. ఈ సందర్భంగా అధికారులు కాంగ్రెస్ పార్టీ దుబ్బాక ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డిని సభావేదికపైకి ఆహ్వానించడంతో బీఆర్ఎస్, బీజేపీ శ్రేణులు అభ్యంతరం తెలిపాయి. దీంతో ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డి స్పందించారు. ప్రభుత్వ కార్యక్రమంలో ప్రొటోకాల్ పాటించాలని, ఇది పార్టీ కార్యక్రమం కాదని అధికారులకు సూచించారు. సభా వేదికపై నుంచి కాంగ్రెస్ నాయకుడు చెరుకు శ్రీనివాస్‌రెడ్డి వెళ్లకపోతే బీఆర్ఎస్ నాయకులు సైతం వేదికపైకి వస్తారని అధికారులకు చెప్పారు. దీంతో వేదికపైనే ఉన్న కాంగ్రెస్ నేత చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డితో వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు హోరాహోరీగా నినాదాలు చేశారు. సభా ప్రాంగణం వద్ద తోపులాట జరిగింది. మరో పక్క ఉన్న బీజేపీ శ్రేణులు నినాదాలు చేయడంతో కల్యాణలక్ష్మి కార్యక్రమం రసాభాసగా మారింది. ఉద్రిక్తత పరిస్థితుల మధ్యే మంత్రి సురేఖ ఇద్దరు, ముగ్గురు లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ చేసి వెళ్లిపోయారు. నాయకుల నినాదాలు, తోపులాటతో కార్యక్రమానికి వచ్చిన లబ్ధిదారులు ఒకింత భయాందోళనకు గురయ్యారు.



మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణ ఇంటి ఎదుట వీరంగం సృష్టిస్తున్న కాంగ్రెస్ నేత ప్రవీణ్ అనుచరులు

బీఆర్ఎస్ నేత ఇంటి వద్ద కాంగ్రెస్ వీరంగం

- **దాడికి యత్నించిన అధికార పార్టీ నేత అనుచరులు**
- **చంపుతామంటూ బెదిరింపులు.. ఇరువురి మధ్య తోపులాట**
- **మహబూబాబాద్ ఎస్పీకి ఫిర్యాదు చేసిన బాధితులు**

బయ్యారం, సెప్టెంబర్ 26: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలం బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు, కస్తూరినగర్ మాజీ సర్పంచ్ కృష్ణకుమారి భర్త మురళీకృష్ణ ఇంటిపై బుధవారం రాత్రి కాంగ్రెస్ గూండాలు దాడికి యత్నించారు. మండల కేంద్రంలోని సీఎంసీ స్థలం ఆక్రమణ విషయమై బుధవారం అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన తెలుపగా పలువురిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీనిని నిరసిస్తూ గంధంపల్లి సెంటర్‌లో ఆందోళన చేపట్టడంతో బీఆర్ఎస్ ఉపాధ్యక్షుడు మురళీకృష్ణను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బుధవారం రాత్రి ప్రవీణ్‌నాయక్ అనుచరులు మురళీకృష్ణ ఇంటికి వెళ్లి వీరంగం సృష్టించారు. నీ భర్తను చంపుతామంటూ భార్య కృష్ణకుమారిని బెదిరించారు. ఇంతలో మురళీకృష్ణతోపాటు బీఆర్ఎస్ శ్రేణులు చేరుకోగా ఇరువర్గాల మధ్య కొద్దిసేపు వాగ్వాదం, తోపులాట జరిగింది. 100కు కాల్ చేయడంతో పోలీసులు అక్కడికి చేరుకొని వారిని చెదరగొట్టారు. తన భర్త మురళీకృష్ణకు కాంగ్రెస్ నాయకుడు ప్రవీణ్‌నాయక్, అనుచరులు గోవర్ధన్, మదన్, రాంబాబు, పుల్లయ్యతో ప్రాణహానీ ఉందని కృషకుమారి బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాత గణేశ్, పలువురు నాయకులతో కలిసి ఎస్పీ రాంనాథ్ కేకన్, డీఎస్పీ తిరుపతిరావుకు ఫిర్యాదు చేశారు.



వికారాబాద్ జిల్లా పరిగిలో మెడకు ఉరితాళ్లు వేసుకొని నిరసన తెలుపుతున్న కాంట్రాక్టర్లు

మెడకు ఉరితాళ్లతో కాంట్రాక్టర్ల నిరసన

- **పెండింగ్ బిల్లుల కోసం పరిగి పట్టణంలో ఆందోళన**
- **బిల్లులు రాకపోతే ఆత్మహత్యే శరణ్యమంటున్న కాంట్రాక్టర్లు**

పరిగి, సెప్టెంబర్ 26 : ‘మన ఊరు–మన బడి’ కార్యక్రమంలో భాగంగా చేపట్టిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు గురువారం వికారాబాద్ జిల్లా పరిగిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆందోళనకు దిగారు. మెడకు ఉరితాళ్లు వేసుకొని వినూత్న నిరసన చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ‘మన ఊరు–మన బడి’ కార్యక్రమం కింద పనులు చేపట్టి ఏడాది గడిచినా బిల్లులు చెల్లించడం లేదని వారు ఆందోళన వ్యక్తం చేశారు. బిల్లుల కోసం వినతిపత్రాలు అందజేసినా స్పందించకపోవడంతో ఉరి తాళ్లతో నిరసన చేపట్టాల్సి వచ్చిందని అన్నారు. బంగారం తాకట్టు పెట్టి, అప్పులు చేసి పనులు చేపట్టామని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి వెంటనే బిల్లులు చెల్లించాలని, లేకపోతే తమకు ఆత్మహత్యే శరణ్యమని అన్నారు.

పంపుసెట్ల విద్యుద్దీకరణ పథకానికి శ్రీకారం

508.95 కోట్ల కేటాయింపు

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ సంస్థ వ్యవసాయ పంపుసెట్ల విద్యుద్దీకరణ పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందుకు రూ. 508. 95కోట్లు కేటాయించింది. గురువారం పాలనాపరమైన ఉత్తర్వులు జారీ చేసింది. టీజీఎస్పీడీసీఎల్ పరిధిలోని నల్లగొండ, సూర్యాపేట, సరూర్‌నగర్, మెదక్, వికారాబాద్, యాదాద్రి భువనగిరి, నారాయణ్‌పేట్, రాజేంద్రనగర్, గద్వాల, రంగారెడ్డి, సంగారెడ్డి, మహబూబ్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని వ్యవసాయ పంపుసెట్లను విద్యుద్దీకరిస్తారు. ఈ స్కీం కింద 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నాలుగు 5హెచ్‌పీ పంపుసెట్లకు కనెక్షన్ ఇస్తారు, ట్రాన్స్‌ఫార్మర్ నుంచి 4 మోటార్లకు కనెక్షన్ ఇవ్వాలంటే కేవీ కండక్టర్, ఎల్‌టీ కేబుల్, పోల్స్ ఇతరత్రా ఏర్పాటుకు 3 లక్షలు ఖర్చవుతుంది. ఒక్కో పంపుసెట్‌కు 75 వేల చొప్పున వెచ్చించాలి.

దేశవ్యాప్తంగా ఓపీఎస్ అమలుచేయాలి

ఎన్‌ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): దేశవ్యాప్తంగా ఓల్డ్ పెన్షన్ స్కీమ్(ఓపీఎస్) అమలుచేయాలని, సోమనాథన్ కమిటీ రిపోర్టును బహిర్గతపర్చాలని ఎన్‌ఎంవోపీఎస్ సెక్రటరీ జనరల్ స్థితప్రజ్ఞ డిమాండ్ చేశారు. నేషనల్ మూమెంట్ ఫర్ ఓల్డ్ పెన్షన్ స్కీం(ఎన్‌ఎంవోపీఎస్) ఆధ్వర్యంలో ఆగస్టు 24న కేంద్ర క్యాబినెట్ నిర్ణయించిన ఏకీకృత పెన్షన్ విధానాన్ని(యూపీఎస్) వ్యతిరేకిస్తూ గురువారం దేశవ్యాప్తంగా పెన్షన్ ఆక్రోశ్ మార్చ్ పేరిట నిరసనలు తెలిపారు. తెలంగాణలో ఉద్యోగ, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తంచేశారు. హైదరాబాద్‌లోని బీమా భవన్‌లో నిర్వహించిన నిరసనలో స్థితప్రజ్ఞ మాట్లాడారు. కార్యక్రమంలో తెలంగాణ సీపీఎస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్వల్ శ్రీకాంత్, రాష్ట్ర కోశాధికారి నరేశ్‌గౌడ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ, నాయకులు సందీప్, రెడ్డప్ప, మదన్‌రాజ్ పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో డీజేలపై నిషేధం?

- **అఖిలపక్షం భేటీలో సీపీ సీవీ ఆనంద్**

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 26(నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో డీజేల వినియోగంపై నిషేధం విధించే దిశగా ప్రభుత్వం ఆలోచిస్తున్నట్టు తెలుస్తున్నది. ఫిర్యాదుల నేపథ్యంలో మతపరమైన ర్యాలీల్లో డీజేలు, పటాకుల వాడకంపై అభిప్రాయాలను తెలుసుకునేందుకు హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ అధ్యక్షతన బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో గురువారం అఖిలపక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి రాచకొండ, సైబరాబాద్ పోలీసు అధికారులు, జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, కాంగ్రెస్ ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్, బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్, ఎంఐఎం ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల ప్రతినిధులు, మత సంఘాల నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. హైదరాబాద్‌లో డీజేలు, పటాకుల వినియోగం తగ్గించేలా చర్యలు చేపడతామని చెప్పారు.



జోగిపేటలో యశ్వంత్‌రెడ్డిని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్

పీఏసీఎస్ చైర్మన్‌పై కాంగ్రెస్ దాడి

- **మంత్రి దామోదర ఇలాకాలో కార్యకర్తల గూండాగిరి**
- **అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ విమర్శ**

టేక్మాల్/అందోల్, సెప్టెంబర్ 26: వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రాతినిధ్యం వహిస్తున్న అందోల్ నియోజకవర్గంలోని టేక్మాల్ పీఏసీఎస్ చైర్మన్ యశ్వంత్‌రెడ్డిపై గురువారం కాంగ్రెస్‌కు చెందిన సొసైటీ డైరెక్టర్, ఆయన అనుచరుడు దాడికి పాల్పడ్డారు. డైరెక్టర్ అనుచరుడు భూమయ్య సైతం చైర్మన్‌పై దాడికి పాల్పడటంతో నోటి నుంచి తీవ్ర రక్తస్రావమైంది. వెంటనే బాధితులు టేక్మాల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యశ్వంత్‌రెడ్డిపై దాడికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని అందోల్ మాజీ ఎమ్మె ల్యే చంటి క్రాంతికిరణ్ డిమాండ్‌చేశారు. జోగిపేటలో యశ్వంత్‌రెడ్డిని ఆయన పరామర్శించారు.

నటుడు అభిషేక్ అరెస్టు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): డ్రగ్స్ సరఫరా ఆరోపణలు ఎదుర్కొంటున్న సినీ నటుడు అభిషేక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. డ్రగ్స్ సరఫరా వ్యవహారంలో ఇప్పటికే ఆయనపై ఎస్సార్‌నగర్, జూబ్లీహిల్స్ పోలీసుస్టేషన్లలో కేసులు నమోదయ్యాయి. కొంతకాలంగా తప్పించుకొని తిరుగుతున్న అభిషేక్.. గోవాలో రెస్టారెంట్ నిర్వహిస్తున్నాడనే సమాచారంతో తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో పోలీసులు అక్కడికి వెళ్లి అరెస్టు చేసి గురువారం హైదరాబాద్‌కు తరలించారు.

నవంబర్‌లో రిజిస్ట్రేషన్ బాదుడు!

- **భారీగా పెరగనున్న చార్జీలు**
- **తుదిదశకు చేరిన థర్డ్ పార్టీ ఏజెన్సీ అధ్యయనం**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): నవంబర్ నుంచి సవరించిన చార్జీలను రిజిస్ట్రేషన్ చార్జీలను అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది. వాస్తవానికి వ్యవసాయ, వ్యవసాయేతర, స్థిరాస్తుల రిజిస్ట్రేషన్‌కు కొత్త ధరలను ఆగస్టు 1 నుంచే అమలు చేయాలని భావించింది. ఈ మేరకు స్టాంపులు–రిజిస్ట్రేషన్ల శాఖ జూన్‌లో షెడ్యూల్‌ను విడుదల చేసింది. అధికారులు జిల్లాల్లో అధ్యయనం చేసి ప్రభుత్వానికి జూలైలో నివేదిక ఇచ్చారు. ఈ నివేదికపై ప్రభుత్వం సంతృప్తి చెందలేదు. దీంతో ధరల సవరణ అధ్యయన బాధ్యతలను ఓ ప్రైవేట్ ఏజెన్సీకి అప్పగించారు. రాష్ట్రవ్యాప్తంగా సర్వే నంబర్ల వారీగా భూముల విలువను అధ్యయనం చేసి, ఎక్కడ పెంచేందుకు అవకాశం ఉన్నదో, ఎక్కడ తగ్గించాల్సి వస్తుందో, ఎంత మేర సవరించాలో సూచించాలని పేర్కొన్నది. ఈ మేరకు ప్రైవేట్ సంస్థ అధ్యయనం తుది దశకు చేరిందని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు తెలిపాయి. ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం పనులు ప్రారంభం కావడం, ఫ్యూచర్ సిటీ పేరుతో కొత్త నగరాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ లక్ష్యాల నేపథ్యంలో వాటి చుట్టుపక్కల ప్రాంతాల్లో భూముల సవరణపైనా అధ్యయనం చేసినట్టు చెప్తున్నారు. వారంరోజుల్లో ఈ నివేదిక ప్రభుత్వానికి చేరనున్నట్టు సమాచారం. ప్రభుత్వం సమీక్ష అనంతరం ఏ స్థాయిలో ధరలను సవరించాలో నిర్ణయిస్తారని చెప్తున్నారు. నవంబర్ మొదటివారంలో పెంపును అమలు చేసే అవకాశం ఉంది. ‘ఇది రిజిస్ట్రేషన్ చార్జీల పెంపు కాదు. శాస్త్రీయంగా ధరల స్థిరీకరణ. స్థానిక పరిస్థితులను బట్టి చార్జీలు పెంచాలో, తగ్గించాలో నిర్ణయం తీసుకొని అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తున్నది’ అని రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారి తెలిపారు.

బది‘లీలల’పై కొరడా?

రిజిస్ట్రేషన్ల శాఖలో ఇటీవల బదిలీల్లో జరిగిన అక్రమాలపై చర్యలు తీసుకుంటారని సమాచారం. ఈ బదిలీల్లో అధికార పక్ష నేతలు, ఉన్నతాధికారుల సన్నిహితులకు కోరుకున్న స్థానాలను కట్టబెట్టారని ఆరోపణలు వచ్చాయి. రూ.కోట్ల మేర చేతులు మారినట్టు చర్చ జరిగింది. కొందరు అధికారులే దళారుల అవతారం ఎత్తి పోస్టింగ్‌ల బదిలీలల్లో కీలక పాత్ర పోషించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ శాఖ మంత్రి, సీఎం గుర్రుగా ఉన్నట్టు సచివాలయ వర్గాలు చెప్తున్నాయి. త్వరలోనే చర్యలు తీసుకోనున్నట్టు సమాచారం.

సహకార డెయిరీలకు సమాధి!

- **హైదరాబాద్ పాలమార్కెట్‌పై ఆధిపత్యానికి హెరిటేజ్ యత్నం**
- **సర్కారు ప్రోత్సాహంతో ప్రాంతేతరుల పెట్టుబడులు**
- **శ్వేత విప్లవానికి బాటలు వేసిన కేసీఆర్ ప్రభుత్వం**
- **స్వరాష్ట్ర రైతుల పుట్టిముంచుతున్న రేవంత్ సర్కారు**
- **ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వ్యత్యాసం**
- **అదే ధరకు సేకరిస్తే రాష్ట్ర పాడి రైతుకు తీవ్ర నష్టం**



ఈ నెల 23న ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడలో రోడ్డుపై పాలను పారపోసి నిరసన తెలుపుతున్న పాడి రైతులు

కరీంనగర్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : పాడి రైతు మెడపై ప్రాంతేతరుల కత్తి వేలాడుతున్నది. స్వరాష్ట్రంలో శ్వేత విప్లవానికి కేసీఆర్ ప్రభుత్వం బాటలు వేస్తే.. కాంగ్రెస్ సర్కారు కుట్రల కారణంగా విజయ డెయిరీతోపాటు మిగిలిన కో ఆపరేటివ్ డెయిరీల మనుగడ కూడా ప్రమాదంలో పడే అవకాశం కనిపిస్తున్నది. ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబానికి చెందిన హెరిటేజ్ సంస్థ రాష్ట్రంలో రూ.200 కోట్లకుపైగా పెట్టుబడితో శామీర్‌పేటలో డెయిరీతోపాటు ఐస్‌క్రీం తయారీ ఫ్యాక్టరీని ఏర్పాటు చేయబోతున్నట్టు తెలుస్తున్నది. దీనికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సంపూర్ణంగా సహకరిస్తున్నట్టు సమాచారం. రాష్ట్రంలో పాలవిక్రయాల అతి పెద్ద మార్కెట్ హైదరాబాద్. ఇక్కడ రోజుకు 20 లక్షల నుంచి 22 లక్షల లీటర్లకుపైగా డిమాండ్ ఉంది. ఈ డిమాండ్‌కు అనుగుణంగా మార్కెట్‌ను అందిపుచ్చుకోవడంలో విజయ డెయిరీ లాంటివి కాస్త వెనుకబడగా..ఇపుడు ఆ మార్కెట్‌ను ప్రాంతేతర డెయిరీలు ఆక్రమిస్తున్నాయి. హెరిటేజ్, జెర్సీ, అమూల్, నందిని వంటి డెయిరీలు.. స్థానిక డెయిరీలకు మించి మార్కెట్‌లో విక్రయాలు చేస్తున్నాయి. ఒక్క హెరిటేజ్ వాళ్లే రోజుకు హైదరాబాద్‌లో 5 లక్షల లీటర్లకు పైగా పాల విక్రయాలు చేస్తున్నట్టు సదరు రంగంలోని నిపుణులు చెబుతున్నారు. ఈ పరిస్థితుల్లో ఈ సంస్థ పెట్టుబడులు పెట్టి హైదరాబాద్ మార్కెట్ మొత్తం శాసిస్తే రాష్ట్రంలోని విజయ డెయిరీతోపాటు కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు వంటి వాటి భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకునే ప్రమాదమున్నది.

రైతుల ఆదాయంపై దెబ్బ?

నిజానికి పాడి పరిశ్రమను ఆహ్వానించడం ఎవరూ తప్పుపట్టరు. కానీ సదరు పరిశ్రమతో రాష్ట్రంలోని పాడిరైతులకు వచ్చే ప్రమాదాలను పట్టించుకోకుండా రేవంత్ సర్కారు ముందుకెళ్తున్న తీరుపై విమర్శలొస్తున్నాయి. ఇప్పటికే హెరిటేజ్‌లాంటి సంస్థల దాటికి విజయ డెయిరీ కుదేలవుతుండగా.. ఇపుడు ఇతర కో–ఆపరేటివ్ డెయిరీలకూ ముప్పు పొంచిఉన్నది. దీనికి కారణం తెలంగాణతో పోలిస్తే ఆంధ్రాలో రైతులకు ఇచ్చే ఒక లీటర పాల ధరలో రూ.4 నుంచి రూ.7 వరకు వ్యత్యాసం ఉండడమే. ప్రస్తుతం 3 శాతం ఫ్యాట్ ఉన్న పాలను కరీంనగర్ డెయిరీ లీటర్‌కు రూ. 35.65కు కొనుగోలు చేస్తుండగా.. ఏపీలోని చిత్తూరులో రూ.31.50కు కొనుగోలు చేస్తున్నారు. 3.5 శాతం ఫ్యాట్ ఉన్న లీటర్‌పాలను చిత్తూరులో రూ.33కు కొనుగోలు చేస్తుండగా, కరీంనగర్ డెయిరీ రూ.40.25కు కొనుగోలు చేస్తున్నది. అంటే ఒక్కో లీటర్‌పై రూ.4 నుంచి రూ.7 వరకు తేడా ఉన్నది. అక్కడ తక్కువ ధరకు కొనుగోలు చేసి.. రాష్ట్రంలోని డెయిరీల మార్కెట్‌ను దెబ్బతీసేందుకు సరికొత్త స్కీమ్ పెట్టి లేదా.. ధర తగ్గించి సదరు కంపెనీలు పాలు అమ్మే పరిస్థితులు కనిపిస్తున్నాయి. హైదరాబాద్‌లో ఇప్పటికే పలు పాల కంపెనీలు ఈ తరహా మార్కెటింగ్‌కు పాల్పడుతున్నాయి. ఈ పరిస్థితుల్లో ప్రాంతేతర డెయిరీల పోటీని తట్టుకోవాలంటే రాష్ట్రంలోని కోఆపరేటివ్ డెయిరీలైన కరీంనగర్, ముల్కనూరు డెయిరీలు కూడా రైతుకు ఇచ్చే పాలసేకరణ ధరను తగ్గించాల్సి ఉంటుంది. పాల ధర తగ్గించకపోతే మార్కెట్ విక్రయాల్లో ఈ డెయిరీలు వెనుకబడిపోయే ప్రమాదమున్నది. తద్వారా డెయిరీలే మూతపడే ప్రమాదమున్నది. అదే జరిగితే కరీంనగర్, మూల్కనూరు డెయిరీ పరిధిలోనే దాదాపు 3 లక్షలకు పైగా పాడి కుటుంబాలు రోడ్డున పడే ప్రమాదమున్నది. ప్రాంతేతర డెయిరీల మార్కెట్‌కు దీటుగా పాలసేకరణ ధరలు తగ్గిస్తే రైతులకు గిట్టుబాటు కావన్నది నిపుణుల అభిప్రాయం. ఆంధ్రాలోని పాడిరైతులకు వచ్చే ఖర్చుతో పోల్చితే.. తెలంగాణలో వాతావారణం, ఇతర మార్పుల నేపథ్యంలో 25 శాతానికిపైగా అదనపు ఖర్చు వస్తుందని పాడిపరిశ్రమ నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే ఇక్కడి రైతాంగానికి సరిపడా రేటు గిట్టుబాటు అయ్యేందుకు కావాల్సిన చర్యలపై ప్రభుత్వం దృష్టిపెటాలన్న అభిప్రాయాలు వ్యక్తవుతున్నాయి.

సగం చేపపిల్లలకు సర్కారు కోత

- **తొలుత 85 కోట్ల పిల్లల పంపిణీకి ఏర్పాట్లు**
- **టెండర్ల సమయానికి 40కోట్లకే పరిమితి**
- **కాంగ్రెస్ ప్రభుత్వం నిధులవ్వకనే ఈ దుస్థితి**
- **నాలుగుసార్లు టెండర్లు పిలిచినా స్పందన కరువు**
- **బకాయిలపై ప్రశ్నించిన రైతులకు బెదిరింపులు**



హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ): ఉచిత చేపపిల్లల పంపిణీలో ప్రభుత్వం కోత పెట్టింది. సగానికి సగం కోత పెట్టిన ప్రభుత్వం 50శాతం చేపపిల్లల్ని మాత్రమే పంపిణీ చేయాలని నిర్ణయించింది. తొలుత 85 కోట్ల చేపపిల్లల పంపిణీకి ప్రణాళికలు రూపొందించిన మత్స్యశాఖ.. టెండర్ల సమయానికి 40 కోట్లకే పరిమితం చేసింది. చేపపిల్లల పంపిణీలో కోతకు ప్రభుత్వం తగినన్ని నిధులు ఇవ్వకపోవడమే కారణమని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఉన్న నిధులతో 40కోట్లు పంపిణీ చేస్తామని, ప్రభుత్వం నిధులిస్తే మిగిలిన సగం పంపిణీ చేస్తామని స్పష్టం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతియేట 80 కోట్ల చేపల పిల్లల్ని, మరో 10 కోట్ల రొయ్య పిల్లల్ని పంపిణీ చేసేంది. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తొలి ఏడాదే చేపపిల్లల పంపిణీకి కోత పెట్టడంపై మత్స్యకారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

నాలుగుసార్లు టెండర్లు పిలిచినా...

ఈ ఏడాది చేపపిల్లల పంపిణీకి మత్స్య శాఖ ఆపసోపాలుపడుతున్నది. జూలై 9నుంచి నేటి వరకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతూనే ఉన్నది. రెండున్నర నెలల్లో నాలుగుసార్లు టెండర్లు పిలిచినా పంపిణీదారుల నుంచి స్పందన కరువైంది. గతేడాది బకాయిలు కాంగ్రెస్ ప్రభుత్వం ఇంకా ఇవ్వకపోవడంతో పంపిణీదారులు ముందుకు రావడం లేదు. పాత బకాయిలు ఇస్తేనే టెండర్లలో పాల్గొంటామని పంపిణీదారులు చెబుతున్నారు. తొలుత పిలిచిన టెండర్‌లో ఒకే ఒక దరఖాస్తురాగా, రెండోసారికి 4దరఖాస్తులు వచ్చాయి. మూడోసారి 27వరకు దరఖాస్తులు వచ్చినట్టుగా తెలిసింది. ఇందులో కొంతమందికి వెరిఫికేషన్‌లో చేపల చెరువులు లేకపోవడంతో వారిని తిరస్కరించారు. ఇప్పుడు 19 జిల్లాలకు దరఖాస్తులు ఒకే కాగా 12 జిల్లాలకు మళ్లీ దరఖాస్తులు పిలిచారు. వీటి ప్రక్రియ ఎప్పుడు పూర్తవుతుందో కూడా తెలియని పరిస్థితి నెలకొన్నది.

బ్లాక్‌లిస్టులో పెడుతాం

చేపల పంపిణీ రైతులపై మత్స్యశాఖలోని అధికారులు బెదిరింపులకు దిగుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పాత పంపిణీదారు రైతులను పిలిపించిన అధికారులు.. వారం పది రోజుల్లో బకాయిలు ఇప్పిస్తామని హామీ ఇచ్చి టెండర్లలో పాల్గొనాల్సిందిగా కోరినట్టు ఓ పంపిణీదారు తెలిపారు. అధికారుల హామీతో టెండర్లలో పాల్గొన్నామని, పదిహేను రోజులు గడిచినా బకాయిల ఊసెత్తడంలేదని తెలిపారు. దీనిపై అధికారులను ఆరా తీస్తే.. బకాయిలు ఇచ్చే పరిస్థితిలేదని, టెండర్‌లో ఎంపికైన వాళ్లు అగ్రిమెంట్ చేసుకోవాలని ఆదేశించినట్టుగా తెలిసింది. రైతులు అగ్రిమెంట్‌కు నిరాకరించగా ‘మీ బకాయిలు ఎలా వస్తాయో చూస్తాం. మీ డిపాజిట్ డబ్బులను బ్లాక్ చేస్తాం. మళ్లీ టెండర్లలో పాల్గొనకుండా బ్లాక్‌లిస్టులో పెడతాం’ అంటూ బెదిరించినట్టుగా ఓ పంపిణీదారు ఆవేదనను వ్యక్తం చేశారు.

పంపిణీ ఇంకెప్పుడు ?

ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభంకావాల్సిన చేపల పంపిణీ ప్రక్రియ సెప్టెంబర్ పూర్తవుతున్నా టెండర్ దశలోనే ఉంది. పంపిణీ ఆలస్యమవుతుండడంతో ఏప్రిల్ వరకు చెరువులు, కుంటల్లో నీళ్లు తగ్గి చేపలు ఆశించిన స్థాయిలో పెరుగవని మత్స్యకారులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. నాలుగైదేండ్లుగా పుష్కలమైన చేపలను విక్రయించి ఆర్థికంగా భరోసా దక్కిందని, ఇప్పుడు పంపిణీ ఆలస్యం అవుతుండడంతో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదే విధంగా 50శాతం పంపిణీ నిర్ణయాన్ని విరమించుకొని 100శాతం పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

యువతిపై ప్రేమోన్మాది దాడి



సాయికుమార్ (ఫైల్)

రామంతాపూర్, సెప్టెంబర్ 26: ఓ యువతిపై ప్రేమోన్మాది దాడి చేసిన ఘటన ఉప్పల్ బస్‌స్టాప్ వద్ద గురువారం చోటుచేసుకుంది. భువనగిరికి చెందిన రాగల సాయికుమార్(24), ఓ యువతి గతంలో ప్రేమించుకోగా.. మనస్పర్థలు రావడంతో విడిపోయారు. చాలా రోజుల తర్వాత ఈ ఇద్దరూ గురువారం ఉప్పల్ బస్‌స్టాప్ వద్ద కలుసుకోగా.. తనను ప్రేమించాలంటూ సాయికుమార్ యువతిపై ఒత్తిడి చేశాడు. ఇద్దరి మధ్య మాటామాటా పెరగడంతో ఆమెపై కత్తితో దాడిచేశాడు. యువతి వేలికి గాయం కాగా, స్థానికులు ఆమెను చికిత్స నిమిత్తం దవాఖానకు తరలించారు. ఉప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డికి వినతిపత్రం ఇస్తున్న యూఎస్‌పీసీ సభ్యులు

రేపు యూఎస్‌పీసీ, ఎస్జీటీయూ నిరసనలు

- **జీవో 25ను సవరించాలని డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 26 (నమస్తే తెలంగాణ) : సర్దుబాటుకు ముందే బదిలీ అయిన ఎస్జీటీలను రిలీవ్ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సాయంత్రం అన్ని జిల్లా కేంద్రాల్లో నిరసనలు తెలిపి కలెక్టర్లకు వినతిపత్రాలు ఇవ్వాలని యూఎస్‌పీసీ, ఎస్జీటీయూ పిలుపునిచ్చాయి. మరోవైపు జీవో 25లోని నిబంధనలు సవరించాలని కోరుతూ గురువారం యూఎస్‌పీసీ స్టీరింగ్ కమిటీ సభ్యులు కే జంగయ్య, పీ నాగిరెడ్డి పాఠశాల విద్య డైరెక్టర్ ఈవీ నరసింహారెడ్డి, విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశాన్ని కలిసి వినతిపత్రాలు అందజేయగా, ఎస్జీటీ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మహిపాల్‌రెడ్డి, వెంకటేశం సైతం వినతిపత్రం సమర్పించారు.

జైనూర్ ఘటనపై విచారణ చేపట్టాలి



ఖైరతాబాద్, సెప్టెంబర్ 26: ఆదిలాబాద్ జిల్లా జైనూర్‌లో ఈ నెల 4న జరిగిన ఘటనపై ప్రభుత్వం పూర్తిస్థాయిలో విచారణ చేపట్టాలని పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సామాజిక, పౌర హక్కుల కార్యకర్తలు ఖలీదా పర్వీన్, సరా మాథ్యూస్, మసూద్, ప్రొఫెసర్ పద్మజాషాతో కలిసి మాట్లాడారు. జైనూరులో ఉద్దేశపూర్వకంగానే ఒక వర్గంపై దాడులు, దౌర్జన్యాలు జరిగాయని, దీనిపై విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు.



రామగుండం ఎన్టీపీసీకి ఎనర్జీ లీడర్‌షిప్ అవార్డులు

జ్యోతినగర్, సెప్టెంబర్ 26: రామగుండం ఎన్టీపీసీకి ఇంధన ఉత్పాదకత, సంరక్షణ, పరిరక్షణల్లో మూడు ఎనర్జీ లీడర్‌షిప్ అవార్డులు లభించాయి. న్యూఢిల్లీలో జరిగిన ఎకనామిక్ టైమ్స్ ఎనర్జీ లీడర్‌షిప్ అవార్డ్స్-2024లో కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి చేతులమీదుగా సంస్థ ఈడీ కేదార్ రంజన్‌పాడు అవార్డులను అందుకున్నారు. విద్యుత్తు, పునరుత్పాదకత, ఇండస్ట్రియల్ విభాగాల్లో ఇవి దక్కాయి.

6 కాదు.. 3 రోజులే

డెట్ సెక్యూరిటీల పబ్లిక్ ఇష్యూ లిస్టింగ్ సమయాన్ని తగ్గించిన సెబీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: డెట్ సెక్యూరిటీస్ పబ్లిక్ ఇష్యూ, నాన్-కన్వర్టబుల్ రిడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్ల లిస్టింగ్‌కున్న సమయాన్ని 3 రోజులకు తగ్గించాలని మార్కెట్స్ రెగ్యులేటర్ సెబీ నిర్ణయించింది. ప్రస్తుతం ఇది 6 రోజులుగా ఉన్నది. పబ్లిక్ ఇష్యూ జారీదారులు నిధులను మరింత త్వరగా అందిపుచ్చుకోవడానికి ఇది దోహదం చేయనున్నది. ఈ ఏడాది నవంబర్ 1 నుంచి కొత్త టైమ్‌లైన్స్ అమల్లోకి రానున్నాయి. అయితే తొలి ఏడాది ఈ టైమ్‌లైన్‌ను ఇష్యూయర్స్ పాటించవచ్చు లేదా పాటించకుండా ఉండవచ్చు. కానీ వచ్చే ఏడాది నవంబర్ 1 నుంచి మాత్రం తప్పక పాటించాల్సిందేనని సెబీ తాజాగా స్పష్టం చేసింది.

ఆజియోలో హెచ్‌అండ్ఎం

ముంబై, సెప్టెంబర్ 26: రిలయన్స్ రిటైల్‌కు చెందిన ప్రీమియం ఫ్యాషన్ ఈ-టెయిలర్ ఆజియో.. స్వీడన్ ఫ్యాషన్ దిగ్గజం హెచ్‌అండ్ఎంతో జట్టు కట్టింది. దీంతో ఆజియో వేదికపై ఇక హెచ్‌అండ్ఎం బ్రాండ్ ఉత్పత్తులు లభించనున్నాయి. ఉమెన్స్‌వేర్, మెన్స్‌వేర్, కిడ్స్‌వేర్, హోం డెకరేషన్ తదితర 10వేల కలెక్షన్స్‌ను ఆజియోపై హెచ్‌అండ్ఎం పెడుతున్నది. ఈ పండుగ సీజన్‌లో సరసమైన ధరలకు నాణ్యమైన బ్రాండెడ్ ఉత్పత్తులను కొనుగోలుదారులు ఆజియో ద్వారా అందుకోవచ్చన్న విశ్వాసాన్ని సదరు సంస్థలు గురువారం విడుదల చేసిన ఓ ప్రకటనలో వ్యక్తం చేశాయి.

మేక్ ఇన్ ఇండియా ఎక్కడ?

జీడీపీలో తయారీ రంగం వాటాను పెంచడంలో మోదీ సర్కారు విఫలం



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: 'మేక్ ఇన్ ఇండియా' అంటూ మోదీ సర్కారు ప్రతిష్ఠాత్మకంగా తెచ్చిన కార్యక్రమం.. దేశీయ తయారీ రంగంలో ఏమాత్రం ఉత్సాహాన్ని నింపలేకపోయింది. 10 ఏండ్ల పాటు ప్రచారం చేసినా.. ఫలితం శూన్యం. మోదీ హయాం కంటే జీడీపీలో తయారీ రంగం వాటా అంతకుముందే బాగుండటం గమనార్హం. 2014 మే నుంచి కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధాన మంత్రిగా ఉంటున్న విషయం తెలిసిందే. 2030 నాటికి దేశ జీడీపీలో తయారీ రంగం వాటాను 25 శాతానికి పెంచాలన్న లక్ష్యంతో 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమాన్ని తీసుకొచ్చారు. అయితే గత ఆర్థిక సంవత్సరం 2023-24లో ఇది 15.9 శాతంగానే ఉన్నది. కానీ 2013-14లో 16.7 శాతంగా ఉండటం విశేషం. దీంతో తమ ప్రభుత్వం నిర్దేశించుకున్న లక్ష్యం నెరవేరడానికి ఇంకా సమయం ఉందని, పడుతుందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖకు చెందిన డీపీఐఐటీ కార్యదర్శి అమర్‌దీప్ సింగ్ భాటియా అంటున్నారు. పెట్టుబడులు, సాంకేతికత, నైపుణ్యాభివృద్ధి అంశాల్లో మరింత మెరుగైన ఫలితాల్ని సాధించాల్సి ఉందని ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ అభిప్రాయపడ్డారు. ఆ దిశగానే ప్రభుత్వం దృష్టి పెట్టిందని కూడా వివరించారు. పీఎం గతి శక్తి స్కీంతో రవాణా ఖర్చుల భారాన్ని పరిశ్రమపై తగ్గించే ప్రయత్నం చేస్తున్నట్టు చెప్పారు. అయితే గత ప్రభుత్వాలతో పోల్చితే నిధుల కేటాయింపులపరంగా, రాయితీలు-ప్రోత్సాహకాలపరంగా తయారీ రంగానికి పెద్దపీట వేస్తున్నట్టు ప్రకటించినా.. ఆచరణలో అది కనిపించట్లేదన్న విమర్శలు ఇప్పుడు వినిపిస్తున్నాయి.

78 వేలకు బంగారం

మరో రూ.400 పెరిగిన తులం విలువ • రికార్డు స్థాయికి దూసుకుపోయిన ధర

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: బంగారం ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు ఎన్నడు లేని గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో దేశీయంగా వరుసగా రెండోరోజూ రూ.78 వేల మార్క్‌ను అధిగమించాయి. దేశ రాజధాని ఢిల్లీలో తులం పుత్తడి ధర రూ.400 ఎగబాకి రూ.78,250 పలికింది. పండుగ సీజన్ కూడా తొడవడంతోపాటు గ్లోబల్ మార్కెట్లో ధరలు పుంజుకోవడం వల్లనే ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. బుధవారం గోల్డ్ ధర రూ.77,850 పలికింది. బంగారంతోపాటు వెండి ధరలు మరింత అధికమయ్యాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి మద్దతు లభించడంతో కిలో వెండి రూ.1,000 అధికమై రూ. 94 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ గోల్డ్ ధర రూ.77,020 వద్ద కొనసాగుతుండగా, 22 క్యారెట్ ధర రూ.70,600 వద్ద ఉన్నది. కిలో వెండి ధర రూ.1,01,000కి చేరుకున్నది. మరోవైపు, అంతర్జాతీయ మార్కెటైన కోమెక్స్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,701.20 డాలర్లకు చేరుకోగా, వెండి 32.86 డాలర్ల వద్ద ఉన్నది. ద్రవ్యోల్బణం కట్టడి చేయడానికి ఇప్పటి వరకు వడ్డీరేట్లను పెంచుకుంటూ పోయిన పలు సెంట్రల్ బ్యాంక్‌లు ప్రస్తుతం వడ్డీరేట్లలో కోతలు పెడుతుండటం, దీనికి తోడు పశ్చిమాసియా దేశాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం కూడా పసిడికి డిమాండ్ నెలకొన్నదని బులియన్ వర్తకులు వెల్లడించాయి. రూపాయితో పోలిస్తే డాలర్ విలువ క్రమంగా పడిపోతుండటం కూడా మరో కారణమన్నారు.




దీపావళి వరకు ఇదే స్థాయిలో..

ప్రస్తుతం రికార్డు స్థాయిలో పెరిగిన ధరలు దీపావళి నాటికి 76-78 వేల స్థాయిలోనే ఉండనున్నాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ కమోడిటీ హెడ్ అనూజ్ గుప్తా తెలిపారు. ఫెడ్ వడ్డీరేట్లు తగ్గించినప్పటీ నుంచి పుత్తడి ధర దూసుకుపోతున్నదన్నారు. అయినప్పటికీ ఈ ఏడాది బంగారం ధరలు 27 శాతం వరకు పెరగడంతో కొనుగోళ్లు నిలిచిపోయాయన్నారు. అలాగే వెండి రూ.92-95 వేల స్థాయి లో ఉంటుందని అంచనావేస్తున్నారు.

హౌసింగ్ ఆగమాగం

హైదరాబాద్‌లో ఇండ్లకు తగ్గిన గిరాకీ

ఈ జూలై-సెప్టెంబర్‌లో అమ్మకాలు 22 శాతం పతనం
దేశీయ ప్రధాన నగరాల్లో ఇది రెండో అత్యధికం
అనరాక్ తాజా గణాంకాల్లో వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: నిన్న ప్రాప్‌ఈక్విటీ.. నేడు అనరాక్.. రేపు ???. నివేదిక ఏదైనా.. హైదరాబాద్ నిర్మాణ రంగంలో మందగమనం మాత్రం నిజమేనని తేలుస్తున్నాయి. ఏడాది కిందటిదాకా దేశీయ రియల్ ఎస్టేట్‌ను శాసించిన హైదరాబాద్‌లో ఇప్పుడు ఇండ్ల గిరాకీ అంతంతమాత్రం అన్నట్టుగా తయారైంది మరి. అవును.. హైదరాబాద్‌లో ఇండ్లంటే హాట్ కేకులే. అంతా ఎగబడి కొనేస్తారు. అయితే ఇదంతా గతం. ఇప్పుడు సీన్ రివర్సైంది. ప్రముఖ రియల్ ఎస్టేట్ కన్సల్టెంట్ అనరాక్ తాజాగా విడుదల చేసిన గణాంకాలు ఇందుకు అద్దం పడుతున్నాయి.

కానరాని డిమాండ్

ఇండ్ల అమ్మకాల్లో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, చెన్నై నగరాలను దాటేసి వృద్ధిపథంలో పరుగులు పెట్టిన హైదరాబాద్‌లో ప్రస్తుతం ఆ స్థాయి డిమాండే కనిపించడం లేదు. దేశీయ ప్రధాన నగరాల మాటెలా ఉన్నా.. హైదరాబాద్ రియల్టీ మాత్రం ఎప్పుడూ జోష్‌తోనే ఉండేది. కానీ ఇప్పుడు క్షీణతలో ముందుంటున్నది. నాడు మార్కెట్ పరిస్థితులతో నిమిత్తం లేకుండా హైదరాబాద్‌లో ఇండ్ల కొనుగోళ్లు భారీగా జరిగితే.. నేడు తగ్గుతున్నట్టు స్పష్టంగా తెలుస్తున్నది. గత పదేండ్లలో నిర్మాణ రంగానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిన విషయం తెలిసిందే. వ్యాపార, పారిశ్రామిక రంగాల్లో అవలంభించిన విధానాలూ కలిసొచ్చాయి. హౌసింగ్ మార్కెట్ విపరీతంగా పెరిగిపోయింది. అయితే ప్రభుత్వం మారడంతో మార్కెట్‌లో నిస్తేజం ఆవరించింది. హైడ్రా కూల్చివేతలతో ఇది పతాక స్థాయికి చేరిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కోల్‌కతా తర్వాత..

హైదరాబాద్‌సహా టాప్-7 నగరాల రియల్టీపై గురువారం అనరాక్ ఓ డాటాను విడుదల చేసింది. ఇందులో ఈ జూలై-సెప్టెంబర్‌లో గృహ విక్రయాలు గతంతో పోల్చితే 22 శాతం పడిపోయినట్టు తేల్చింది. కోల్‌కతా (25 శాతం) తర్వాత ఇదే అత్యధికం. పోయినసారి 16,375 యూనిట్ల అమ్మకాలు జరిగితే.. ఈసారి అవి 12,735 యూనిట్లుగానే ఉన్నాయన్నది.

మహారాష్ట్రలోకి 'మేఘా'


హైదరాబాద్, సెప్టెంబర్ 26: రాష్ర్టానికి చెందిన ప్రముఖ మౌలిక సదుపాయాల సంస్థ మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్...మహారాష్ట్రలో రూ.21 వేల కోట్ల పెట్టుబడితో నాలుగు వేల మెగావాట్ల సామర్థ్యం కలిగిన రెండు భారీ పంప్డ్ స్టోరేజ్ జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలను ఏర్పాటు చేయబోతున్నది. ఇందుకు సంబంధించి మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఫడ్నవీస్ సమక్షంలో మహారాష్ట్ర జలవనరుల శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి దీపక్ కపూర్, మెయిల్ ప్రెసిడెంట్ ఆర్‌వీఆర్ కిశోర్ ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. బీవోఎం విధానంలో మెయిల్ ఏర్పాటు చేస్తున్న తొలి ప్రాజెక్ట్ ఇదే కావడం విశేషం.

ఐపీవోకి మౌరీ టెక్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26: ఐటీ సేవల సంస్థ మౌరీ టెక్..స్టాక్ మార్కెట్లోకి లిస్ట్ కావడానికి సిద్ధమవుతున్నది. ఇందుకు సంబంధించి మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది. వాటాల విక్రయం ద్వారా రూ.1,500 కోట్ల నిధులను సమీకరించాలని యోచిస్తున్నది. ఈ ఐపీవోల్లో భాగంగా ఈక్విటీ షేర్లను జారీ చేయడం ద్వారా రూ.440 కోట్లు, ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో షేర్లను విక్రయించడంతో రూ.1,060 కోట్లను సేకరించాలనుకుంటున్నది.

ఆగని సూచీల పరుగు

85,836 వద్దకు సెన్సెక్స్, 26,216కి నిఫ్టీ
చారిత్రక గరిష్ఠ స్థాయికి చేరుకున్న సూచీలు



ముంబై, సెప్టెంబర్ 26: దేశీయ స్టాక్ మార్కెట్ల ర్యాలీ నిరాటంకంగా కొనసాగుతున్నది. గురువారం మరో ఉన్నత శిఖరాలను అధిగమించింది. బ్యాంకింగ్ షేర్లు ఇచ్చిన దన్నుతోపాటు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల అంశాలతో సెన్సెక్స్ 86 వేల పాయింట్లకు చేరువైంది. నెలవారీ డెరివేటివ్ కాంట్రాక్టు గడువు ముగుస్తుండటంతో మదుపరులు ఎగబడి కొనుగోళ్లు జరిపారు. దీంతో ఇంట్రాడేలో 86 వేల పాయింట్లకు చేరువలో వచ్చిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 666.25 పాయింట్లు అధిగమించి 85,836.12 వద్ద ముగిసింది. ఇది కూడా సూచీలకు గరిష్ఠ స్థాయి ముగింపు కావడం విశేషం.

ఆరో రోజూ నిఫ్టీది అదే జోరు

వరుసగా ఆరో రోజు కూడా భారీగా లాభపడిన నిఫ్టీ.. రికార్డు గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. ఇంట్రాడేలో 246.75 పాయింట్లు లాభపడిన సూచీ.. చివర్లో మార్కెట్ ముగిసే సమయానికి 211.90 పాయింట్లు ఎగబాకి 26,216.05 వద్ద స్థిరపడింది.

టాప్ గెయినర్‌గా మారుతి

దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీ షేరు అత్యధికంగా లాభపడింది. కంపెనీ షేరు ధర 5 శాతం లాభపడి టాప్ గెయినర్‌గా నిలిచింది. దీంతోపాటు టాటా మోటర్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, మహీంద్రా అండ్ మహీంద్రా, టాటా స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, అల్ట్రాటెక్ సిమెంట్, బజాజ్ ఫైనాన్స్, నెస్లె షేర్లు కూడా అత్యధికంగా లాభపడిన షేర్లలో ఉన్నాయి.

లైఫ్ సైన్సెస్‌లోకి 10 వేల కోట్లు: మంత్రి శ్రీధర్‌బాబు



హైదరాబాద్, సెప్టెంబర్ 26(నమస్తే తెలంగాణ): గత నాలుగేండ్లలో లైఫ్ సైన్సెస్ రంగంలోకి రూ.10 వేల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు వెల్లడించారు. గురువారం మంత్రి హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో ఏర్పాటు చేసిన 'ఇండియా ల్యాబ్ ఎక్స్‌పో-2024ను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..లైఫ్ సైన్సెస్, మెడ్ టెక్ స్టార్టప్‌లలో తెలంగాణ వాటా 19 శాతంగా ఉన్నదని, దేశీయంగా ఉత్పత్తి అవుతున్న ఔషధ, ఎగుమతుల్లో రాష్ట్ర వాటా 40 శాతంగా ఉండటంతో రాష్ట్రం ఫార్మా తయారీ హబ్‌గా ఎదుగుతున్నదన్నారు. చిన్న, మధ్యతరహ పరిశ్రమల స్థాపనకు రాష్ట్రం అత్యంత అనుకూలంగా ఉన్నదని, మానవ వనరులకు కొదవే లేదని వెల్లడించారు. జినోమ్ వ్యాలీ నాలుగో దశ విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయని చెప్పారు.



మర్చిపోయే ప్రసక్తి ఉండదు

ఊహ తెలిసింది మొదలు.. మెదడులో అన్నీ స్టోర్ అవుతుంటాయి. ఫలానా రోజు అలా జరిగింది.. ఆ రోజు మేం అక్కడికి వెళ్లాం.. అది చేశాం.. ఇది తిన్నాం.. అని చెబుతుంటాం. అయితే, అన్ని మెమొరీస్‌కి కచ్చితంగా ఓ ట్యాగ్ ఉంటుంది. అదే తేదీ. సందర్భాలు, సంఘటనలు.. ఇలా ఏదైనా తేదీలతోనే గుర్తు పెట్టుకుంటాం. తిరిగి సెలబ్రేట్ చేసుకుంటాం. ఎంత గుర్తున్నా కాలక్రమంలో కొన్ని ఈవెంట్స్‌ని మర్చిపోతుంటాం. అవి పుట్టినరోజులు అయ్యుండొచ్చు... పెళ్లి రోజులు కావచ్చు.. అలా జరగకుండా ఉండాలంటే? ఈవెంట్ ఏదైనా మిస్ కాకుండా అలెర్ట్ అవ్వాలంటే? సింపుల్‌గా గూగుల్ క్యాలెండర్ సాయం తీసుకోవచ్చు. సంప్రదాయ పద్ధతిలోనే కాకుండా.. చాలా సింపుల్ టెక్నిక్‌తో ముఖ్యమైన తేదీల్ని ఆయా కాంటాక్ట్‌లకు జత చేయొచ్చు. ఉదాహరణకు.. మీ ఫోన్‌లోని ఓ వ్యక్తి పుట్టిన రోజుని గుర్తుంచుకోవాలి అనుకుందాం. అప్పుడు ఏం చేస్తారంటే.. ఫోన్‌లోని గూగుల్ కాంటాక్ట్స్‌లోకి వెళ్లాలి. ఆతని ఫోన్ నెంబర్‌ని ట్యాప్ చేయాలి. తిరిగి తెర పైభాగంలో కనిపించే 'పెన్సిల్ ఐకాన్'ని తాకాలి. దీంతో ఎడిట్ కాంటాక్ట్ ఓపెన్ అవుతుంది. అక్కడ కనిపించే ఆప్షన్స్‌లోని 'యాడ్ సిగ్నిఫికెంట్ డేట్'ని ట్యాప్ చేయాలి. దీంతో వారికి సంబంధించిన ముఖ్యమైన తేదీలను మార్క్ చేయవచ్చు. 'నోట్స్'లో ఆ తేదీ గురించి రాయొచ్చు. ఉదాహరణకు పుట్టిన రోజు అయితే.. ఎలా ప్లాన్ చేయాలో డిస్క్రిప్షన్ రాసుకుని 'సేవ్' చేయాలి. అంతేకాదు.. ఆయా ముఖ్యమైన తేదీలను నోటిఫికేషన్స్ రూపంలో మీకు ఒకటిరెండ్రోజులకు ముందే వచ్చేలా చేయొచ్చు. అందుకు యాడ్ చేసిన సిగ్నిఫికెంట్ డేట్ పక్కనే కనిపించే 'బెల్' ఐకాన్‌ని సెలెక్ట్ చేయాలి. ఏ రోజు.. ఏ టైమ్‌కి మీకు నోటిఫికేషన్ రావాలో సెట్ చేసుకునే వీలుంది. ఈ ప్రాసెస్ ఆండ్రాయిడ్, ఐఓఎస్ ఫోన్లలో ఒకేలా ఉంటుంది. ఒకవేళ మీరు దీన్ని డెస్క్‌టాప్ మీద చేద్దాం అనుకుంటే.. గూగుల్ కాంటాక్ట్స్ వెబ్‌సైట్ ఓపెన్ చేసి తేదీలను యాడ్ చేసుకోవచ్చు. ఒకవేళ ఎప్పుడైనా ఈవెంట్‌ని తొలగించాలనుకుంటే... గూగుల్ కాంటాక్ట్స్‌లోకి వెళ్లి 'రిమూవ్' ఆప్షన్ కనిపిస్తుంది. ట్యాప్ చేస్తే సరి! అంతేకాదు.. 'హైడ్' కూడా చేసుకోవచ్చు.

నమస్తే తెలంగాణ
జిందగీ
హైదరాబాద్ | శుక్రవారం 27 సెప్టెంబర్ 2024 www.ntnews.com 11

మారుతున్న వాతావరణ పరిస్థితులు సమాజాన్ని కలవరపెడుతున్నాయి. అయినా సరే జనం, ప్రభుత్వాలు ఈ విషయంలో పర్యావరణానికి ముప్పు తెచ్చే పనుల్ని మానుకోవడం లేదు. ఇది పిల్లలుగా ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరిగే తమ హక్కులను కాలరాయడమే అంటూ అంతర్జాతీయ స్థాయిలో తన గళాన్ని వినిపిస్తున్నది పదహారేండ్ల రిధిమ పాండే. పర్యావరణ పరిరక్షణకు ఐక్యరాజ్యసమితితోనూ కలిసి పనిచేస్తున్న ఈమె ఇండియా గ్రెటా థన్‌బర్గ్‌గా గుర్తింపు పొందింది.



రిధిమ పాండే.. మన గ్రెటా!

ఉప్పొంగి పొర్లుతున్న నీళ్ల మధ్య మునిగిన నిలువెత్తు శివుడి విగ్రహం... ఉత్తరాఖండ్ వరదల ఉధృతిని అద్దం పట్టి చూపించింది. ఆనాటి విపత్తును టీవీల్లో చూసినా గుండె చలించిపోయేలాంటి పరిస్థితి. రిధిమ పాండేది కూడా ఉత్తరాఖండ్ కావడం గమనార్హం. హరిద్వార్ ఆమె సొంతూరు. 2013లో వరదలు వచ్చేనాటికి తనకు అయిదేండ్లు. వెయ్యి మందికి పైగా జనం చనిపోయి, లక్షకు పైగా ప్రజల్ని నిరాశ్రయుల్ని చేసిన ఆ ఉత్పాతం ప్రభావం రిధిమ ఇంటి మీదా పడింది. తన తల్లిదండ్రుల్నీ ఇంటినీ కోల్పోతానేమోనని ఆనాడే ఆ చిట్టి గుండె భయపడింది. దేవభూమిగా, హాయి గొలిపే ప్రకృతికి ఆలవాలంగా ఉండే తమ ప్రాంతంలో ఇలా ఎందుకు జరిగింది అన్న విషయం పెద్దయ్యేకొద్దీ తెలుసుకుంది. చుట్టూ ఉన్న వృద్ధుల నుంచి తమ కాలానికీ ఇప్పటికీ ఉన్న వాతావరణ మార్పుల గురించీ విన్నది.



మానవ తప్పిదాలే ఇలాంటి ప్రమాదాలకు కారణమన్న విషయాన్ని అర్థం చేసుకుంది. ప్రభుత్వాల ఉదాసీనతా ఇందుకు కారణమే అనిపించిందామెకు. అందుకే, తొమ్మిదేండ్ల వయసులోనే పర్యావరణాన్ని పట్టించుకోవడం లేదంటూ భారత ప్రభుత్వం మీద 'నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్'లో దావా వేసింది. 'పారిస్ పర్యావరణ ఒప్పందం మీద సంతకం చేసిన భారత్, దాన్ని పాటించేందుకు మాత్రం ఎందుకు కృషి చేయట్లేదు' అంటూ ఆ కోర్టులో నిలదీసింది. అంతేకాదు, కార్బన్ ఉద్గారాలను తగ్గించేందుకు, పర్యావరణ మార్పులకు సంబంధించి చర్యలు చేపట్టేందుకు జాతీయ స్థాయిలో ప్రణాళికలు రచించి అమలు చేయాలని కోరింది. శిలాజ ఇంధనాల వాడకాన్ని పరిశీలించాల్సిన అవసరాన్నీ చెప్పింది. దాదాపు ఏడాదిన్నర పాటు కోర్టులో ఆమె వాదనలు వినిపించింది. అయితే, ఆ తర్వాత ట్రిబ్యునల్ ఈ కేసును కొట్టేసింది. అయినా సరే తాను విరమించుకోలేదు. జాతీయ, అంతర్జాతీయ పత్రికలు, వేదికల మీద తన గొంతును వినిపించే ప్రయత్నం చేసింది.

గ్రెటాతో కలిసి...

నిజానికి రిధిమకు పుట్టుకతోనే పర్యావరణంతో అనుబంధం ఏర్పడింది. ఆమె తండ్రి దినేశ్‌చంద్ర పాండే వన్యప్రాణి సంరక్షకుడు, పర్యావరణవేత్త, న్యాయవాది కూడా. తల్లి వినీత పాండే ఉత్తరాఖండ్ రాష్ట్ర అటవీ శాఖలో బీట్ ఆఫీసర్. దీంతో ప్రకృతి గురించీ, జంతువుల గురించీ... పసితనం నుంచే ఆమె వింటూ ఉండేది. ఆ కారణంగా ఆమెకు పర్యావరణ పరిరక్షణ మీద సాధారణ పిల్లలకన్నా ఎక్కువ అవగాహనే ఏర్పడింది. మూడేండ్ల వయసులో జంతు సంరక్షణ కేంద్రానికి వెళ్లినప్పుడు కట్టేసిన ఓ ఏనుగును చూసి 'అంకుల్ మీరు దాన్ని అలా కట్టేసి ఉంచితే అది ఆడుకోవడానికి ఎలా వెళుతుంది' అని అడిగిందట అక్కడి ఒక ఉద్యోగిని. భూ గ్రహానికి ఏర్పడుతున్న ముప్పుల్నీ అదే రీతిలో గమనించింది. మరోపక్క స్వీడన్‌కు చెందిన గ్రెటా థన్‌బర్గ్ అనే పర్యావరణ ఉద్యమకారిణి ప్రకృతి విధ్వంసానికి వ్యతిరేకంగా తన గొంతుకను వినిపిస్తూ ప్రపంచం దృష్టిని ఆకట్టుకుంది. పర్యావరణానికి ముప్పు తలపెడుతూ పిల్లల హక్కుల్నీ, భవిష్యత్తునీ కాలరాస్తున్నాయంటూ... ఫ్రాన్స్, జర్మనీ తదితర ఐదు దేశాల మీద ఐక్యరాజ్య సమితిలో గ్రెటాతో కలిసి ఫిర్యాదు చేసిన పదిహేను మంది పిల్లల్లో రిధిమ ఒకరు. ఇది ప్రపంచ చరిత్రలోనే ఒక మైలురాయి. 2019లో న్యూయార్క్‌లో జరిగిన ఐక్యరాజ్య సమితి పర్యావరణ సదస్సులోనూ రిధిమ పాల్గొంది. భారత్ నుంచి తన గొంతు వినిపించిన ఏకైక బాలిక ఆమె.



నార్వే, ఫ్రాన్స్ తదితర దేశాల్లో జరిగిన అంతర్జాతీయ పర్యావరణ వేదికల మీదా తన అభిప్రాయాలను, ఆలోచనలను పంచుకుంది. గంగానది ప్రక్షాళనకు సంబంధించీ, మెట్రో కార్ షెడ్ ప్రాజెక్టు కోసం అడవుల నరికివేత గురించీ ప్రధాన మంత్రి నరేంద్రమోదీకి లేఖలు రాసింది. 2020లో బీబీసీ ప్రకటించిన ప్రపంచంలోని వంద మంది ప్రభావశీలురైన మహిళల జాబితాలోనూ చోటు దక్కించుకుంది. పోప్ ఫ్రాన్సిస్‌తో కలిసి ప్రపంచ పర్యావరణ మార్పులు, మూగజీవాల సంరక్షణ తదితర అంశాల మీద తీసిన డాక్యుమెంటరీలో ప్రముఖ పాత్ర పోషించింది. పర్యావరణం గురించి అంతకుముందు పోప్ రాసిన కొన్ని లేఖల ఆధారంగా దీన్ని రూపొందించారు. 'ద లెటర్– ఎ మెసేజ్ ఫర్ అవర్ ఎర్త్' పేరిట తీసిన ఈ డాక్యుమెంటరీని తొలిరోజే 70 లక్షల మంది చూశారు.

ఏం చెబుతున్నది...

రిధిమ మంచి వక్త. ప్రముఖ సామాజిక వేదిక టెడెక్స్‌లోనూ ఆలోచనాత్మక ఉపన్యాసాలు ఇస్తుంటుంది. వివిధ విద్యార్థుల కార్యక్రమాల్లో ప్రసంగించి ఎంతోమందిని ఈ దిశగా ఆలోచింపజేసింది. పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమించే ఆడవాళ్లకు దన్నుగా నిలిచేలా ఒక సంస్థనూ స్థాపించింది. వాళ్లకు అవగాహన సదస్సులూ నిర్వహిస్తున్నది. 'పర్యావరణాన్ని కాపాడే దిశగా పడే ప్రతి అడుగూ ఎంతో విలువైనది. అది దీర్ఘకాలంలో సుస్థిర మార్పులకు కారణం అవుతుంది. ప్రజల జీవనశైలిలో పరివర్తన తీసుకువచ్చే దిశగా మా శక్తి సామర్థ్యాలను వినియోగిస్తున్నాం. నిజానికి మా తరం పర్యావరణానికి చేసిన అపకారం ఏమీ లేదు. కానీ మేము, మా తర్వాతి తరాలు కూడా దీని విష ప్రభావం బారిన పడుతున్నాం. అందుకే మా వంతుగా చేయగలిగిన ప్రతి చిన్న పనినీ చేస్తున్నాం. మేం చేయని తప్పును సరిదిద్దడానికి మా బాల్యాన్ని త్యాగం చేసేందుకు ముందుకు వస్తున్నాం. పెద్దలు కూడా మాతో కలవాలనీ, మరింత బాధ్యతతో ఉండాలనీ కోరుకుంటున్నాం. మనమూ మన ప్రభుత్వాలూ తక్షణమే అర్థవంతమైన చర్యల దిశగా అడుగు వేయడం అత్యవసరం' అంటూ తన ఆలోచనలను చెబుతున్నది. నిజమే తను చెప్పిన మార్గంలో జనమంతా ఆలోచిస్తే పర్యావరణం స్వచ్ఛంగా తయారవుతుంది.

'దీర్ఘాయుష్మాన్ భవ' అని దీవించకుండానే.. జపాన్‌వాసులు ఎక్కువకాలం జీవించేస్తున్నారు. మిగతా ప్రపంచంతో పోలిస్తే.. సగటున 20 ఏండ్లు అధికంగా బతుకుతున్నారు. అందులోనూ.. 'ఒకినావా' ద్వీప ప్రజలు మరింత ప్రత్యేకంగా నిలుస్తున్నారు. ఇక్కడ 100 ఏండ్లకు పైబడినవారు ఇంటికొకరు కనిపిస్తారు. ఆ వయసులోనూ ఎంతో ఆరోగ్యంగా ఉంటారు. వీరి జీవనశైలిపై ఆహార – ఆరోగ్య నిపుణులు ఎన్నో ప్రయోగాలు, సర్వేలు నిర్వహించారు. ఒకినావా ప్రజల దీర్ఘాయువుకు వారి ఆహారపు అలవాట్లే ప్రధాన కారణమని గుర్తించారు. అయితే, ఒకినావా ప్రజల ఆహారాన్ని మన భారతీయ భోజనానికి అనుగుణంగా మార్చుకోవచ్చని న్యూట్రిషనిస్టులు చెబుతున్నారు.

'ఒకినావా'కే ఓటేద్దాం..

ఒకినావా ప్రజలు పోషకాలు ఎక్కువగా ఉండే కూరగాయలు, ఆకుకూరలతో కూడిన సమతుల ఆహారాన్ని తీసుకుంటారు. పండ్లు, ఒమేగా ఫ్యాటీ యాసిడ్స్ అధికంగా ఉండే చేపలు, బియ్యం, చిరుధాన్యాలు, టోఫు, సోయా, మిసోను కూడా భోజనంలో భాగం చేసుకుంటారు. ఇవన్నీ తక్కువ కొవ్వులు, తక్కువ చక్కెరలను కలిగి ఉండటంతోపాటు విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా అందిస్తాయి. వీటిలో ఆరోగ్యకరమైన కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు, ఫైబర్ ఎక్కువగా లభిస్తాయి. ఆహారంలో ఎక్కువ యాంటి ఆక్సిడెంట్లతో కూడిన పోషకాలు, తక్కువ కేలరీలు ఉండేలా చూసుకుంటారు. అందుకే, వాళ్లు వృద్ధాప్యంలోనూ ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతుంటున్నారు. దీర్ఘకాల వ్యాధులు, గుండెజబ్బుల ముప్పు నుంచి తప్పించుకుంటున్నారు. తక్కువ క్యాలరీలు, అధిక ఫైబర్ ఉండే ఆహారం తీసుకోవడం వల్ల.. ఊబకాయ సమస్యలను ఊదరవతలికి తరిమేస్తున్నారు.



మార్చాల్సిందే..

భారతీయ వంటకాల్లో కొన్ని స్థానిక పదార్థాలను చేర్చడం ద్వారా.. ఒకినావా డైట్‌ను మనకు అనుగుణంగా మార్చుకోవచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. చిలగడదుంపలు, బంగాళాదుంపల వంటివి తక్కువగా తీసుకోవాలి. ఆకుకూరలలో బచ్చలికూర, మెంతికూర, మునగాకు ఉండేలా చూసుకోవాలి. పొట్లకాయ, క్యారెట్, గుమ్మడికాయ వంటి కూరగాయలను రోజువారీ ఆహారంలో భాగం చేసుకోవాలి. చిక్కుళ్లు, పప్పులతోపాటు సోయా ఉత్పత్తులనూ తీసుకోవాలి. బియ్యం, గోధుమకు బదులుగా.. బ్రౌన్ రైస్, చిరుధాన్యాలు (రాగులు, కొర్రలు, సజ్జలు), క్వినోవాకు ప్రాధాన్యం ఇవ్వాలి. వంట నూనెను తక్కువగా వాడాలి.

మారాల్సిందే..

ఆహార పదార్థాలు మార్చితే సరిపోదు.. ఆహార అలవాట్లనూ మార్చుకుంటేనే ఫలితం ఉంటుంది. ఇందుకోసం జపాన్‌వాసుల జీవనశైలిని అనుసరించాలి. 'హరా హచ్ బన్ మి'.. జపాన్‌లో సుప్రసిద్ధ సామెత. అంటే.. 'ఆహారాన్ని తగిన మోతాదులోనే తినాలి' అని అర్థం. కడుపులో 80 శాతం మాత్రమే నిండేలా ఆహారం తీసుకోవాలి. మిగతా 20 శాతం ఖాళీగా ఉంచాలి. అప్పుడే దీర్ఘాయువు పొందుతామని జపాన్‌వాసులు విశ్వసిస్తారు. అవసరమైన దానికంటే ఎక్కువ తినడం వల్ల కడుపుపై భారం పడుతుందని చెబుతారు.

- నెమ్మదిగా తినడం అలవాటు చేసుకోవాలి.
- అన్ని పదార్థాలను ఒకే పళ్లెంలో వడ్డించుకుండా.. ఒక్కో పదార్థాన్ని చిన్నచిన్న ప్లేట్లలో సర్దుకొని తినాలి.
- కుటుంబసభ్యులంతా కలిసి తినడం జపాన్‌వాసుల ఆహారపు అలవాట్లలో ముఖ్యమైనది.
- భోజనం చేసే సమయంలో టీవీ చూడటం, సెల్‌ఫోన్ వాడటం పూర్తిగా నిషేధం.
- నేలపై కూర్చుని భోజనం చేయడానికి ప్రాధాన్యమివ్వాలి.

ఇలాంటి ఆహారపు అలవాట్లతోపాటు సరైన జీవనశైలిని పాటించే ప్రయత్నం చేస్తే మనం కూడా ఎక్కువ కాలం ఆరోగ్యంగా జీవించవచ్చు. మనమూ ఆరోగ్యంగా ఉంటూ దీర్ఘాయువు సొంతం చేసుకోవచ్చు.

పరవశింపజేసే ప్రకృతికి ఆలవాలం సాగర తీరం. కడలి ఒడిలో అంతెత్తున ఎగిసే అలలు.. తీరాన్ని చేరాలని ఉబలాటపడుతుంటాయి. తీరానికి ఆరాటమే.. ఆ కెరటాలు తనను తాకాలని. తీరం దాటిన అలలు కొన్ని.. ఇప్పుడు ఫ్యాషన్ సంద్రంలో తుఫాను సృష్టిస్తున్నాయి. ఆభరణాల్లో కుదురుకున్న అలలు వేవ్ జువెలరీగా, బ్రైడల్ ఆభరణాలుగా ఆధునిక మగువల మనసు దోచేస్తున్నాయి.

అలలే నగలై..









అతివల అలంకరణలో మొదటి స్థానంలో ఉండేవి ఆభరణాలే. సందర్భానికి, సమయానికి తగినట్టు నగలను ఎంచుకోవడంలోనూ వారికి వారే సాటి. ఎన్నిరకాల నగలున్నా ఎప్పుడూ కొత్త ట్రెండ్స్‌పైనే దృష్టిపెడుతుంది మహిళా లోకం. ఇలాంటివారిని మెప్పించడానికి ఎప్పటికప్పుడు నయా ట్రెండ్స్ పుట్టుకొస్తుంటాయి. అలాంటివాటిలో ఒకటే వేవ్ జువెలరీ. సముద్ర అలలే ప్రధానంగా ఈ ఆభరణాలను తయారుచేస్తారు. నీలి రంగులో ఎగిసే అలల్ని బంధించి ఆభరణాల్లో పొదగడమే ఈ ఆభరణాల ప్రత్యేకత. ఎగిసే అలలు మొదలుకొని సముద్రతీరంలో కనిపించే ప్రతి అంశాన్నీ ఆధారంగా చేసుకుని అచ్చంగా వాటిని పోలినట్టుగానే ఈ జువెలరీని తయారుచేస్తున్నారు డిజైనర్లు. నిజమైన అలలుగా కనిపించేందుకు ఈ ఆభరణాల తయారీలో ఎనామెల్, ఎపాక్సీలను వాడతారు. సహజత్వం ఉట్టిపడేందుకు నిజమైన ఇసుక, చిన్నచిన్న ఆల్చిప్పలు, గవ్వలను ఉపయోగిస్తున్నారు. అందంగా రూపొందించిన ఈ పెండెంట్లను బంగారం, వెండి, ప్లాటినమ్ వంటి లోహాలతో తయారుచేసిన గొలుసులకు జతచేస్తారు. సముద్రపు అందాన్ని పొదిగిన గొలుసులు, పెండెంట్లు, బ్రేస్‌లెట్లు, ఉంగరాలు, చెవికమ్మల రూపంలో అందుబాటులో ఉన్నాయి. ఆధునికత ఉట్టిపడే ఈ ఆభరణాలు ట్రెండీవేర్‌పై చక్కగా నప్పుతాయి. బంగారంతో కన్నా వెండి, ప్లాటినమ్, రోజ్‌గోల్డ్ లోహాలతో తయారుచేసినవి మరింత ఆకర్షణీయంగా ఉంటాయి. అందరికీ అందుబాటులో ఉండేలా స్టెయిన్‌లెస్ స్టీల్‌తో చేసిన వేవ్ జువెలరీ కూడా మార్కెట్లో దొరుకుతున్నది. మరెందుకు ఆలస్యం.. అలల నగలతో ఉప్పెన సృష్టించండి.

అందమైన గోళ్లంటే.. ఆడవాళ్లందరికీ ఇష్టమే! ఔట్‌ఫిట్‌కు తగ్గట్టుగా.. నిత్యం మ్యాచింగ్ నెయిల్ పాలిష్ వేసుకోవాల్సిందే! వేసుకోవడం వరకు ఓకే కానీ.. నెయిల్ పాలిష్‌ను తొలగించడమే కష్టం! అందులోనూ ప్రతిసారి నెయిల్ పాలిష్ రిమూవర్ ఉపయోగించడం ఎంతో ప్రమాదకరం! రిమూవర్‌లోని రసాయనాల వల్ల గోళ్లు పసుపు రంగులోకి మారుతాయి. పెళుసుగా మారి విరిగిపోతాయి. కాబట్టి, రిమూవర్‌కు బదులుగా.. ఇంటి చిట్కాలతోనే ఈజీగా నెయిల్ పాలిష్‌ను పోగొట్టుకోవచ్చు.



'గోటి'తో పోయేదానికి

- గోరువెచ్చని నీటిలో ఒక చెక్క నిమ్మకాయ రసాన్ని పిండాలి. దానిలో సోప్ లిక్విడ్ కలపాలి. ఇప్పుడు చేతులను ఈ నీటిలో ముంచి.. మూడు నుంచి ఐదు నిమిషాలు అలాగే ఉంచాలి. ఆ తర్వాత నిమ్మతొక్కతో గోళ్లపై సున్నితంగా రుద్దితే.. నెయిల్ పాలిష్ సులువుగా ఊడిపోతుంది.
- గోరువెచ్చని నీటిలో కొన్ని చుక్కల వెనిగర్ కలపాలి. అందులో గోళ్లను ముంచి.. ఐదైదు నిమిషాలపాటు అలాగే ఉంచేయాలి. ఆ తర్వాత బయటికి తీసి.. నిమ్మతొక్కతో గోళ్లను బాగా రుద్దాలి. ఇలా చేస్తే నెయిల్ పాలిష్ తేలికగా రాలిపోతుంది.
- ఇంట్లో వాడే సాధారణ తెల్లని టూత్‌పేస్ట్ కూడా ఇందుకు బెస్ట్‌గా పనికొస్తుంది. గోళ్లపై కొద్దిగా టూత్‌పేస్ట్ రాసి.. దానిపై బేకింగ్ సోడా చల్లాలి. కొద్దిసేపు మెల్లగా రుద్ది.. కొద్దిసేపటి తరవాత తడి కాటన్‌తో తుడిచేయాలి.
- ఉడకబెట్టిన బంగాళదుంప తొక్కను నిమ్మరసం, పంచదారతో కలిపి గోళ్లపై రాయాలి. కాసేపయ్యాక కాటన్ గుడ్డతో రుద్దేస్తే.. నెయిల్ పాలిష్ పోతుంది.

అరటి ఆకులో అద్భుతాలు..



భారతీయుల ఆహారపు అలవాట్లే కాదు.. సంస్కృతీ సంప్రదాయాలు కూడా ప్రకృతికి దగ్గరగా ఉంటాయి. తులసి, అరటి వంటి అనేక పెరటి మొక్కలు.. ఇంటింటా పూజలు అందుకుంటాయి. ఆరోగ్యాన్ని ప్రసాదించే దివ్యౌషధాలుగానూ ఉపయోగపడుతుంటాయి. ముఖ్యంగా.. అరటి ఆకులు ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను కల్పిస్తుంటాయి.

అరటి ఆకుల్లో భోజనం చేయడం మన సంప్రదాయం మాత్రమే కాదు.. ఆరోగ్యకరం కూడా! అరటి ఆకుల్లో ఉండే పాలీఫినాల్స్, విటమిన్ ఎ, విటమిన్ సి వంటి పోషకాలు శరీరానికి మేలుచేస్తాయి. వీటిపై భోజనం వడ్డించగానే.. ఈ పోషకాలు ఆహారంలోకి చేరతాయి.

అరిటాకులు సహజసిద్ధమైన క్రిమిసంహారకాలుగా పనిచేస్తాయి. ఆహారంలోని హానికారక బ్యాక్టీరియాను నశింపజేస్తాయి. వంటకాల రుచిని పెంచుతాయి.

అరిటాకుల్లో ఎసెన్షియల్ ఫైటో న్యూట్రియెంట్స్, మెగ్నీషియం, క్యాల్షియం, పొటాషియం, సెలీనియం, ఫైబర్ వంటి పోషకాలతోపాటు మరెన్నో ఔషధ గుణాలు ఉన్నాయి. ఇవి అనేక వ్యాధుల నుంచి మనల్ని రక్షిస్తాయి.

అరిటాకులు నేచురల్ డ్రెస్సింగ్‌గానూ ఉపయోగపడతాయి. బొబ్బలు, కాలిన గాయాలను మాన్పడంలో సాయపడతాయి. అరిటాకుపై కొబ్బరినూనె రాసి.. బొబ్బలపై ఉంచితే మంచి ఫలితం ఉంటుంది.

అరిటాకును కాల్చి తేనెతో కలిపి తీసుకుంటే.. ఎక్కిళ్లు ఇట్టే ఆగిపోతాయి

అరిటాకులో ఉండే 'లిగ్నిన్'.. ముఖంపై చర్మం పొడిబారడం, కందిపోవడాన్ని తగ్గిస్తుంది. చర్మాన్ని తేమగా ఉంచడంతోపాటు అలర్జీలు, దద్దుర్లు మొదలైన వాటి నుంచి అరిటాకులు ఉపశమనం కలిగిస్తాయి.

జీర్ణ లక్షణాలను మెరుగుపరచడం, అతిసారం, విరేచనాలను తగ్గించడంలో అరిటాకు ముందుంటుందని నేషనల్ లైబ్రరీ అఫ్ మెడిసిన్ చెబుతున్నది.

అరిటాకుల్లో యాంటి ఆక్సిడెంట్లు అధికం. ఇవి శరీర కణాలను దెబ్బతీసే ఫ్రీ రాడికల్స్‌తో పోరాడటానికి, వైరల్ ఇన్ఫెక్షన్లను తగ్గించడానికి సాయపడతాయి.

అరిటాకుల్లో పుష్కలంగా లభించే ఐరన్.. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలను పెంచడానికి సహాయపడుతుంది. విటమిన్ బి6, పొటాషియం.. రక్తపోటును నియంత్రిస్తాయి.

నేటి నుంచి భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టు

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

జోరు కొనసాగించేందుకు టీమ్‌ఇండియా ప్రణాళికలు.. తుది జట్టుపై ఉత్కంఠ.. కాన్పూర్‌కు వర్ష సూచన

భారత్, బంగ్లాదేశ్ రెండో టెస్టుకు వేళయైంది. కాన్పూర్ వేదికగా ఇరు జట్ల మధ్య నేటి నుంచి పోరు మొదలుకానుంది. చెన్నై టెస్టులో ఘన విజయంతో ఇప్పటికే సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న టీమ్‌ఇండియా క్లీన్‌స్వీప్‌పై గురిపెట్టింది. పెట్టని కోటలాంటి సొంతగడ్డపై ప్రత్యర్థి బంగ్లాను చిత్తుచేసేందుకు అస్త్రశస్త్రాలు సిద్ధం చేసుకుంది. తొలి టెస్టులో అశ్విన్, జడేజా, పంత్, గిల్ చెలరేగగా సీనియర్లు రోహిత్, కోహ్లీ స్థాయికి తగ్గ ఆటతీరు ప్రదర్శించలేకపోయారు. సమిష్టి ప్రదర్శనతో కాన్పూర్‌లోనూ జయకేతనం ఎగురవేసేందుకు టీమ్‌ఇండియా కృతనిశ్చయంతో ఉంది. పిచ్ స్పిన్నర్లకు స్పందించనుందన్న వార్తల నేపథ్యంలో ఒక పేసర్‌ను తప్పించి మూడో స్పిన్నర్ తీసుకునే చాన్స్ ఉంది. ఇక పాకిస్థాన్‌పై సిరీస్ విజయంతో ఊపుమీద కనిపించిన బంగ్లా..భారత్ ముందు ఘోరంగా తేలిపోయింది. అటు బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లో పేలవ ప్రదర్శనతో భారీ ఓటమి మూటగట్టుకుంది. కనీసం రెండో టెస్టులోనైనా టీమ్‌ఇండియాకు పోటీనివ్వాలని బంగ్లా ప్రయత్నిస్తున్నది.

కాన్పూర్: సొంతగడ్డపై బంగ్లాదేశ్‌తో రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా చెన్నైలో ముగిసిన తొలి మ్యాచ్‌లో ఘన విజయం సాధించిన భారత క్రికెట్ జట్టు.. శుక్రవారం నుంచి కాన్పూర్ వేదికగా జరుగబోయే రెండో టెస్టులోనూ జోరు కొనసాగించేందుకు సిద్ధమైంది. సిరీస్ క్లీన్‌స్వీపే లక్ష్యంగా బరిలోకి దిగుతున్న రోహిత్ సేన.. చెపాక్‌లో ప్రత్యర్థిని పేస్‌తో దెబ్బకొట్టగా కాన్పూర్‌లో స్పిన్ ఉచ్చులో బంధించేందుకు ప్రణాళికలు రచిస్తోంది. సంప్రదాయకంగా స్పిన్‌కు అనుకూలించే గ్రీన్ పార్క్ స్టేడియంలో ముగ్గురు స్పిన్నర్లతో బరిలో దిగి ప్రత్యర్థిని 'తిప్పేయాలని' భారత్ భావిస్తోంది. మరోవైపు పాకిస్థాన్‌పై చారిత్రక టెస్టు సిరీస్ విజయం అనంతరం భారీ ఆశలతో భారత్‌కు వచ్చిన బంగ్లాదేశ్ తొలి టెస్టులో రెండో ఇన్నింగ్స్‌లో తప్ప ఆశించిన స్థాయిలో రాణించలేక చతికిలపడి దారుణ పరాభవాన్ని మూటగట్టుకుంది. రెండో టెస్టులో అయినా పుంజుకోవాలని చూస్తోంది.


నజ్ముల్

అందరి కళ్లూ ఆ ఇద్దరి మీదే..

మొదటి టెస్టులో తొలి రోజు బంగ్లా పేసర్లు బెంబేలెత్తించినా అశ్విన్, జడేజా ఆదుకోగా రెండో ఇన్నింగ్స్‌లో గిల్, పంత్ శతకాల మోత మోగించడంతో 'మెన్ ఇన్ బ్లూ'కు భారీ గెలుపు దక్కింది. అయితే మ్యాచ్ గెలిచినా సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వైఫల్యం అభిమానులను నిరాశపరిచింది. రెండు ఇన్నింగ్స్‌లలో కలిపి ఈ ఇద్దరూ చేసింది 34 పరుగులే. కాన్పూర్‌లో ఈ ద్వయం భారీ ఇన్నింగ్స్‌లు బాకీ పడింది. క్రీజులో కుదురుకుంటే భారీ స్కోరు చేయొచ్చని పిచ్ క్యూరేటర్ చెబుతున్న నేపథ్యంలో 'రోకో' ఎలా ఆడతారనేది ఆసక్తికరం! రోహిత్, కోహ్లీతో పాటు తొలి టెస్టులో కేఎల్ రాహుల్ సైతం ఆశించిన స్థాయిలో ఆడలేదు. రాబోయే నాలుగు నెలల్లో కీలక సిరీస్‌లు ఆడనున్న భారత్ ఈ ముగ్గురూ రాణించాలని కోరుకుంటోంది. యశస్వీ, గిల్, పంత్ జోరు కొనసాగిస్తే రోహిత్ సేనకు తిరుగుండదు.

బంగ్లా పుంజుకునేనా?

పాకిస్థాన్‌పై టెస్టు సిరీస్ ఇచ్చిన విజయంతో రెట్టింపు ఉత్సాహంతో భారత్‌లో అడుగుపెట్టిన బంగ్లాకు 'ఇక్కడ అంత వీజీ కాదు' అన్న విషయం బోధపడటానికి పెద్ద టైమ్ పట్టలేదు. చెపాక్‌లో తొలి రెండు సెషన్లలో మినహా ఆ జట్టు ప్రయాణం టెస్టు ఆసాంతం ఒడిదొడుకుల మధ్యే సాగింది. తొలి ఇన్నింగ్స్‌లో బ్యాటర్లు దారుణ వైఫల్యంతో ఆత్మరక్షణలో పడ్డ బంగ్లా.. ఆ తర్వాత భారత్ జోరుతో కాడి వదిలేసింది. మిడిలార్డర్‌లో బంగ్లాకు కీలకమైన ముష్ఫీకర్, లిటన్ దాస్, మోమినుల్ హక్‌తో పాటు మెహిది హసన్ మిరాజ్ విఫలమయ్యారు. కెప్టెన్ శాంతో రెండో ఇన్నింగ్స్‌లో ఒంటరిపోరాటం చేసినా ఫస్ట్ ఇన్నింగ్స్‌లో తేలిపోయాడు. కాన్పూర్ పిచ్ స్పిన్నర్లకు అనుకూలంగా ఉండనుండటంతో భారత స్పిన్నర్లను ఆ జట్టు ఏ మేరకు ఎదుర్కోగలదని ఆసక్తికరం.

లైవ్:
9:30 గంటల నుంచి స్పోర్ట్స్-18లో ప్రత్యక్ష ప్రసారం

తుది జట్టు సవాల్..

కాన్పూర్ పిచ్ స్వభావం దృష్ట్యా బంతి తక్కువ ఎత్తులో రావడమే గాక పిచ్ నెమ్మదిగా స్పందిస్తుంది. ఆట తొలి రెండు సెషన్లు మినహాయిస్తే పేసర్లకు ఇక్కడ ఆశించినంత సహాయం కష్టమే. కానీ మూడో రోజు నుంచీ పిచ్ స్పిన్నర్లకు స్వర్గధామంగా మారుతుంది. ఈ నేపథ్యంలో భారత్.. ఇద్దరు పేసర్లు, ముగ్గురు స్పిన్నర్ల ఫార్ములాతో బరిలోకి దిగనుంది. అలా జరిగితే ఆకాశ్ దీప్, సిరాజ్‌లో ఎవరో ఒకరు బెంచ్‌కే పరిమితమవక తప్పదు. అశ్విన్, జడేజాకు తోడుగా కుల్దీప్ యాదవ్ లేదా అక్షర్ పటేల్‌ను తుది జట్టులో తీసుకునే అవకాశముంది. బంగ్లా కూడా పేసర్ నహిద్ రాణాను పక్కనబెట్టి స్పిన్నర్ తైజుల్ ఇస్లాంను ఫైనల్ లెవన్‌లో చేర్చనున్నట్టు సమాచారం.


కోహ్లీ

తుది జట్లు (అంచనా)

భారత్: రోహిత్ శర్మ (కెప్టెన్), యశస్వీ జైస్వాల్, శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, కెఎల్ రాహుల్, రిషబ్ పంత్, రవిచంద్రన్ అశ్విన్, రవీంద్ర జడేజా, అక్షర్ పటేల్/కుల్దీప్ యాదవ్, మహ్మద్ సిరాజ్, జస్ప్రీత్ బుమ్రా

బంగ్లాదేశ్: నజ్ముల్ హొసేన్ (కెప్టెన్), జకీర్ హసన్, షద్మాన్ ఇస్లాం, మోమినుల్ హక్, ముష్ఫీకర్ రహీం, షకిబ్ అల్ హసన్, లిటన్ దాస్, మెహిది హసన్ మిరాజ్, తైజుల్ ఇస్లాం/నహీద్ రాణా, హసన్ మహ్మూద్, టస్కిన్ అహ్మద్

జడ్డూకు 'రికార్డు' టెస్ట్

ఈ మ్యాచ్‌లో ఒక వికెట్ తీస్తే రవీంద్ర జడేజా టెస్టులలో 300 వికెట్లు, మూడు వేల పరుగులు (3,122) పూర్తి చేసిన ఆటగాడిగా అరుదైన ఘనత దక్కించుకుంటాడు. అంతర్జాతీయ టెస్టు క్రికెట్‌లో అత్యంత వేగంగా ఈ ఘనత సాధించిన వారిలో ఇయాన్ బోథమ్ (72 టెస్టులు) ముందుండగా జడేజా ఒక వికెట్ తీస్తే 73వ టెస్టులో ఈ రికార్డు సాధించినవాడు అవుతాడు.

వర్ష సూచన:




మ్యాచ్‌లో తొలి మూడు రోజుల ఆటకు వర్షం అంతరాయం కలిగించే అవకాశమున్నట్టు వాతావరణ శాఖ అంచనా వేసింది.

ఇంత దుష్ప్రచారం ఎందుకు?

ఆర్సీబీలోకి పంత్ అంటూ నెట్టింట వైరల్

ఘాటుగా స్పందించిన వికెట్ కీపర్



ఢిల్లీ: ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2025 సీజన్ వేలానికి ముందు ఫ్రాంచైజీలు రిటెన్షన్ ప్రక్రియతో సతమతం అవుతుంటే సోషల్ మీడియాలో పలువురు ఆకతాయిలు చేస్తున్న పోస్టులపై క్రికెటర్లు సమాధానం చెప్పుకోవాల్సి వస్తోంది. తాజాగా టీమ్‌ఇండియా వికెట్ కీపర్ బ్యాటర్ రిషభ్ పంత్.. రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ)లోకి వస్తున్నాడంటూ 'ఎక్స్'లో ఓ నెటిజన్ పెట్టిన పోస్టుపై స్వయంగా అతడే వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. ఎక్స్‌లో ఓ యూజర్.. 'పంత్ తన మేనేజర్ ద్వారా ఆర్సీబీ యాజమాన్యాన్ని సంప్రదించాడు. ఆ జట్టులో సారథి పోస్టును పంత్ కోరగా అందుకు ఆర్సీబీ నిరాకరించింది. పంత్ ఆర్సీబీలోకి రావడం కోహ్లీకి ఇష్టం లేదు' అని పోస్ట్ పెట్టాడు. దీనిపై పంత్ స్పందిస్తూ.. 'ఫేక్ న్యూస్. సోషల్ మీడియాలో మీరు ఇంత దుష్ప్రచారం ఎందుకు చేస్తున్నారు? ఇలాంటి వార్తలను సృష్టించవద్దు. ఇలా జరగడం ఇదే మొదటిసారి కాదు అంతేగాక ఇదే చివరిసారి కాబోదు కానీ ఇన్నాళ్లూ దీనిపై చూసీ చూడనట్టు వ్యవహరించా. కానీ నానాటికీ పరిస్థితి దిగజారిపోతోంది. దయచేసి ఇలాంటివి రాసేముందు సంబంధిత వర్గాల నుంచి పూర్తి సమాచారం తెలుసుకోండి. ఇక మీ ఇష్టం' అని ఘాటుగా రిప్లై ఇచ్చాడు.

చండిమాల్ శతకం

గాలె: న్యూజిలాండ్‌తో గాలె వేదికగా జరుగుతున్న రెండో టెస్టులో ఆతిథ్య శ్రీలంక భారీ స్కోరు దిశగా పయనిస్తోంది. టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేస్తున్న ఆ జట్టులో వన్ డౌన్ బ్యాటర్ దినేశ్ చండిమాల్ (116) శతకంతో చెలరేగాడు. టెస్టులలో రెండేండ్ల తర్వాత అతడికి ఇదే తొలి సెంచరీ. చండిమాల్‌కు తోడుగా ఏంజెలో మాథ్యూస్ (78 నాటౌట్), కమిందు మెండిస్ (51 నాటౌట్) అర్ధ శతకాలతో రాణించడంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి లంకేయులు 90 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 306 పరుగులు చేసింది.

'అప్పట్లో ఓ నటితో డేటింగ్‌లో ఉన్నా'

- **సంచలన విషయాలు వెల్లడించిన యువరాజ్**



ముంబై: భారత మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ సంచలన విషయాలతో వార్తల్లో వ్యక్తిగా నిలిచాడు. సరిగ్గా 17 ఏండ్ల క్రితం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లినప్పుడు జరిగిన ఉదంతాన్ని పాడ్‌కాస్ట్‌లో పంచుకున్నాడు. ఆసీస్ పర్యటనలో ఒక ప్రముఖ నటితో డేటింగ్ చేసినట్లు చెప్పుకొచ్చాడు. '2007లో మేము ఆసీస్ టూర్‌కు వెళ్లినప్పుడు అదే సమయంలో బాలీవుడ్ నటి షూటింగ్ కోసం అక్కడికి వచ్చింది. అప్పటికే మంకీగేట్ వివాదంతో వాతావరణం చాలా ఉద్విగ్నంగా ఉంది. దీనికి తోడు ఆడిన రెండు టెస్టుల్లో విఫలమైన నేను ఒకింత ఒత్తిడిలో ఉన్నాను. ఫామ్‌లేమితో సతమతమవుతున్న నన్ను కలిసేందుకు ప్రయత్నించద్దంటూ ఆమెకు సూచించాను. కానీ నన్ను ఫాలో అవుతూ కాన్‌బెర్రాకు వచ్చింది. ఇక్కడేం చేస్తున్నావంటూ ప్రశ్నిస్తే నీతో గడిపేందుకు వచ్చానంటూ సమాధానమిచ్చింది. ఆ రోజు రాత్రంతా సరదాగా గడిపాం. నేను కెరీర్‌పై దృష్టి పెడుతాను, నువ్వు కూడా సినిమాలు ఏంటో చూసుకోమని చెప్పాను. కాన్‌బెర్రా నుంచి అడిలైడ్ వెళ్లే సమయంలో నా సూట్‌కేసు కూడా ఆమె సర్దిపెట్టింది. అప్పుడు షూస్ కూడా ప్యాక్ చేయడంతో చేసేదేమి లేక ఆమె చెప్పులు వేసుకుని టీమ్ బస్ ఎక్కాల్సి వచ్చింది. ఇది చూసిన సహచర క్రికెటర్లు చప్పట్లతో ఆటపట్టించారు' అని అన్నాడు. పలువురు హీరోయిన్లతో డేటింగ్ చేసిన యువీ 2016లో హజెల్‌కీచ్‌ను పెండ్లి చేసుకున్న సంగతి తెలిసిందే.

షకిబ్ రిటైర్మెంట్

టీ20లకు వీడ్కోలు
టెస్టులపై సందిగ్ధత!



కాన్పూర్: బంగ్లాదేశ్ ఆల్‌రౌండర్ షకిబ్ అల్ హసన్ అంతర్జాతీయ టీ20 క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఈ ఏడాది ముగిసిన టీ20 ప్రపంచకప్‌తో తాను చివరి మ్యాచ్‌ను ఆడేశానని తెలిపాడు. పొట్టి ఫార్మాట్‌కు గుడ్ బై చెప్పిన అతడు టెస్టుల విషయంలో మాత్రం బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ)పై భారం వేశాడు. అక్టోబర్‌లో సొంతగడ్డపై దక్షిణాఫ్రికాతో జరిగే టెస్టులో ఆడాలని అనుకుంటున్నానని, అలా జరగకుంటే భారత్‌తో కాన్పూర్ టెస్టే తనకు చివరిదని తెలిపాడు. 'టీ20 ప్రపంచకప్‌తో అంతర్జాతీయ స్థాయిలో నేను చివరి మ్యాచ్ ఆడేశాను. ఈ విషయమై ఇప్పటికే సెలెక్టర్లతో చర్చించాను. 2026 వరల్డ్ కప్ నేపథ్యంలో నాకంటే మెరుగైన ఆటగాళ్లు జట్టులోకి వస్తారని ఆశిస్తున్నా. నా సొంతమైదానం మీర్‌పూర్‌లో చివరి టెస్టు మ్యాచ్ ఆడాలని కోరుకుంటున్నా' అని అన్నాడు. వన్డేలలో మాత్రం వచ్చే ఏడాది జరిగే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ ఆఖరిదని షకిబ్ తెలిపాడు.

క్వార్టర్స్‌కు శ్రీకాంత్

మహిళల డబుల్స్‌లో త్రిసా-గాయత్రి ద్వయం ముందంజ



మకావు: చైనాలో జరుగుతున్న మకావు ఓపెన్ సూపర్ 300 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లాడు. గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో శ్రీకాంత్.. 21-13, 21-18తో భారత్‌కే చెందిన ఆయూశ్ శెట్టిపై అలవోక విజయం సాధించాడు. ఆయూశ్ నిష్క్రమణతో ఈ టోర్నీలో పురుషుల సింగిల్స్‌లో శ్రీకాంత్ ఒక్కడే బరిలో ఉన్నాడు. ఇక మహిళల డబుల్స్‌లో త్రిసా జాలీ-గాయత్రి గోపీచంద్ జోడీ.. 22-20, 21-11తో లిన్ చిహ్ చున్-టెంగ్ చున్ హున్ (చైనీస్ తైపీ)పై గెలిచి క్వార్టర్స్‌కు అర్హత సాధించింది. తస్నీమ్ మిర్, సుమిత్-సిక్కి రెడ్డి పోరాటం రెండో రౌండ్‌కే పరిమితమైంది.

చెన్నైకి చుక్కెదురు

చెన్నై: ఇండియన్ సూపర్ లీగ్(ఐఎస్‌ఎల్)లో చెన్నైయిన్ జట్టుకు చుక్కెదురైంది. గురువారం జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో చెన్నైయిన్ 0-1 తేడాతో మొహమ్మదీన్ క్లబ్ చేతిలో ఓటమిపాలైంది. ఆఖరి వరకు హోరాహోరీగా సాగిన పోరులో మొహమ్మదీన్ తరఫున లాల్‌రెమిసంగా ఫనాయి(39ని) ఏకైక గోల్ చేశాడు.

ఐవోఏ సీఈవో ఎన్నికపై రచ్చ!



న్యూఢిల్లీ: భారత ఒలింపిక్ అసోసియేషన్ (ఐవోఏ)లో సీఈవో నియామకంపై సభ్యుల మధ్య విబేధాలు కొనసాగుతున్నాయి. సీఈవోగా రఘురామ్ అయ్యర్ నియామకంపై ఐవోఏ అధ్యక్షురాలు పీటీ ఉష మొగ్గుచూపుతుంటే..కార్యవర్గ సభ్యులు మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. గురువారం అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో దీనిపై వాడీవేడీగా వాదోపవాదాలు జరిగాయి. 'సీఈవో నియామకంపై అసోసియేషన్‌లో తీవ్ర సందిగ్ధత కొనసాగుతున్నది. అయ్యర్‌ను సీఈవోగా ఆమోదించేది లేదంటూ కొంత మంది సభ్యులు వాదిస్తున్నారు. నియామక ప్రక్రియ కొత్త ప్రారంభించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇలా చేస్తే ఐవోసీ నుంచి ఇబ్బందులు ఎదురవుతాయి. భవిష్యత్‌లో మనం ఒలింపిక్స్ ఆతిథ్య హక్కుల విషయంలో అవకాశాలను చేజార్చుకోవాల్సి వస్తుంది' అని ఉష పేర్కొంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.